29-7Pg1FS.qxd:29-7Pg1FS.qxd 1/1/02 7:13 AM Page 1

epaper.vaartha.com
WWW.VAARTHA.COM
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
శ్రీకాకుళం
: fb.com/vaartha Digital

Published from Srikakulam, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem.

29-7-2026 బుధవారం సంపుటి: 32
సంచిక: 179 పేజీలు: 16 వెల: 6.50

# ఎల్ నినోపై యాక్షన్ ప్లాన్



మంగళవారం అధికారులతో వర్చువల్‌గా సమీక్షిస్తున్న సిఎం చంద్రబాబు

## ఆగస్టు 3నుంచి అవగాహన కార్యక్రమాలు

### నిరంతర మానిటరింగ్‌కు కంట్రోల్ రూమ్

### యేడాదికి సరిపడా పశుగ్రాసం నిల్వలు

### సమీక్షలో సిఎం చంద్రబాబు

**విజయవాడ,జులై28,ప్రభాతవార్తప్రతినిధి:** రైతులకు వర్షాభావ పరిస్దితులను వ్యూహాత్మకంగా ఎదుర్కొనేందుకు అవగాహన కల్పించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు.ఎల్ నినో కష్టకాలంలో రైతులను ఆదుకోవాలని, వారికి సరైన సమాచారాన్ని సహకారాన్ని అందిస్తూ అండగా నిలవాలని ముఖ్యమంత్రి అధికారులకు కీలక నిర్దేశం చేసారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ఎల్ నినో ప్రభావం, ప్రభుత్వ పరంగా తీసుకోవాల్సిన చర్యలు, రైతుల్లో కల్పించాల్సిన అవగాహనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్షించారు. పలువురు జిల్లాలస్దాయి అధికారులతో వర్చువల్‌గా మాట్లాడారు.ఎల్ నినో ప్రభావం ఏ మేరకు ఉంటుంది, దీనికి సంబంధించిన యాక్షన్‌ప్లాన్ వంటి అంశాలను సీఎం చంద్రబాబుకు అధికారులు వివరించారు. జూలై నెలలో 69శాతం లోటు వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. వచ్చే మూడు నెలల్లో సరాసరి 35 నుంచి 40 శాత మేర లోటు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందన్న అధికారులు, జూన్ - నవంబర్ మధ్య 844 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 551 మి.మీ మాత్రమే నమోదయ్యే అవకాశం ఉందని వివరించారు. అంచనాలకు మించి ఎల్‌నినో ప్రభావం ఉండబోతోందని అధికారులు తెలిపారు. ప్రస్తుతానికి ఉన్న అంచనాల ప్రకారం అన్ని జిల్లాల్లోనూ ఎల్‌నినో ప్రభావం చూపిస్తోందని, ఎక్కువగా పశ్చిమ గోదావరి, ప్రకాశం, అన్నమయ్య, కృష్ణా, కడప జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొంటాయని అధికారులు చెప్పారు. 2.78 లక్షల హెక్టార్లలో పత్తి, 1.07లక్షల హెక్టార్లలో >>2

# 'భోగాపురం' రెడీ

## ప్రారంభోత్సవానికి హాజరుకానున్న 3లక్షల మంది

### ప్రధాని పర్యటనను సక్సెస్ చేద్దాం: మంత్రి లోకేష్



మంగళవారం భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవ ఏర్పాట్లపై సమీక్షిస్తున్న మంత్రి లోకేష్, చిత్రంలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తదితరులు

**భోగాపురం, జులై 28 ప్రభాతవార్త:** విజయనగరంజిల్లా భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ ఏర్పాట్లను త్వరితగతిన పూర్తిచేయాలని, ప్రధాని పర్యటన విజయవంతానికి ప్రతిఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. ఆగష్టు 1వ తేదీన రాష్ట్రంలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లపై భోగాపురం విమానాశ్రయంలో కేంద్ర విమానయానశాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడుతో కలిసి అధికారులు, మంత్రులు, ప్రజాప్రతినిధులతో >>2







29-7Pg3exHMNWJQEBPGOLCT.qxd:29-7Pg3exHMNWJQEBPGOLCT.qxd 1/1/02 7:34 AM Page 1



# వెయిట్ లిఫ్టర్ అజయ్ బాబుకు సిఎం చంద్రబాబు అభినందనలు



**విజయవాడ, జులై 28 ప్రభాతవార్త ప్రతినిధి:** వెయిట్ లిఫ్టర్ గ్లాస్గో 2026 కామన్వెల్త్ క్రీడల్లో పురుషుల 79 కిలోల వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో రజత పతకం సాధించిన వల్లూరి అజయ్ బాబుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 'ఎక్స్' వేదికగా అభినందనలు తెలిపారు. తన తండ్రి శ్రీనివాసరావు అడుగుజాడల్లో నడుస్తూ అజయ్ క్రీడా వారసత్వాన్ని విజయవంతంగా కొనసాగించారని ప్రశంసించారు. అజయ్ సాధించిన ఈ విజయం ఆంధ్రప్రదేశ్‌తో పాటు యావత్ భారతదేశానికే గర్వకారణం అని వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ వేదికలపై భారత్ క్రీడా కీర్తిని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. అజయ్‌కు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని స్పష్టం చేసారు.



## డి.సిఎం పవన్ కళ్యాణ్ ప్రశంసలు

కామన్వెల్త్ గేమ్స్ 2026లో రజత పతకం సాధించిన వెయిట్ లిఫ్టర్ వల్లూరి అజయ్ బాబుకు డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ అభినందనలు తెలియజేశారు. సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ గ్లాస్గోలో పురుషుల 79 కిలోల వెయిట్‌లిఫ్టింగ్‌లో సిల్వర్ మెడల్ సాధించి భారతదేశానికి మరో కీర్తిని తెచ్చిపెట్టిన అజయ్ బాబుకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. స్వర్ణ పతకాన్ని అత్యంత స్వల్ప తేడాతో చేజార్చుకున్నా ఛాంపియన్‌గా నిలిచావని కొనియాడారు. అజయ్ బాబు ప్రదర్శన.. ధైర్యం, పట్టుదల, క్రమశిక్షణకు నిదర్శనమన్నారు. అజయ్ బాబు విజయనగరం జిల్లా కీర్తిని ప్రపంచ వేదికపై చాటారని, తండ్రి వల్లూరి శ్రీనివాసరావు క్రీడా వారసత్వాన్ని కొనసాగించారని పవన్ అన్నారు. భారతదేశానికి మరో గర్వకారణమైన విజయాన్ని అజయ్ అందించారన్నారు. తమ బిడ్డలలో ఒకరు భారత్‌కు కీర్తిని తెచ్చిపెట్టినందుకు ఆంధ్రప్రదేశ్ ఎంతో గర్వపడుతోందని అన్నారు. ప్రపంచ వేదికపై మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ అజయ్‌బాబుకు పవన్ శుభాకాంక్షలు తెలిపారు.

# నాడు తండ్రి.. నేడు కొడుకు

## కామన్వెల్త్ గేమ్స్‌లో అజయ్ బాబు రజతం

## విజయనగరం జిల్లా కొండవెలగాడలో సంబరాలు





**నెల్లిమర్ల, జులై 28 ప్రభాతవార్త:** స్కాట్లాండ్ దేశంలోని గ్లాస్కో పట్టణంలో జరుగుతున్న కామన్వెల్త్ దేశాల వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం కొండవెలగాడ గ్రామానికి చెందిన వల్లూరి అజయ్ బాబు రజత పతకం సాధించి దేశ కీర్తి ప్రతిష్టలను రెపరెపలాడించాడు. 79 కిలోల కేటగిరీలో ఈ పోటీల్లో పాల్గొన్న అజయ్ బాబు స్నాచ్‌లో 149 కిలోల బరువు, క్లీన్ అండ్ జర్క్‌లో 181 కిలోల బరువు మొత్తం 330 కిలోల బరువుని ఎత్తి ఈ రజత పతకం సాధించాడు. ఈ పోటీల్లో భారతదేశానికి దక్కిన ఆరో పతకమిది.

**తండ్రికి వారసుడిగా..:** 2010వ సంవత్సరంలో న్యూఢిల్లీలో జరిగిన కామన్వెల్త్ దేశాల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో అజయ్ బాబు తండ్రి వల్లూరు శ్రీనివాసరావు పాల్గొని రజిత పతకం సాధించాడు. తండ్రి బాటలో నడిచిన కుమారుడు అజయ్ బాబు కూడా అదే కామన్వెల్త్ దేశాల పోటీల్లో పాల్గొని రజిత పతకం సాధించి భారతదేశానికి అందించడం యాదృచ్ఛికమే అయినప్పటికీ తండ్రికి తగ్గ తనయుడిగా, అసలు సిసలైన వారసుడిగా నిలబెట్టుకున్నట్లయింది. అజయ్ బాబు సాధించిన విజయం పట్ల రాష్ట్ర, జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు అజయ్ బాబును అభినందనలతో ముంచెత్తారు. కొండవెలగాడ గ్రామంలో క్రీడాకారులు, గ్రామస్తులు సంబరాలు చేసుకుంటున్నారు.

# స్పీడ్, క్వాలిటీ, డెలివరీ లక్ష్యంగా రాజధాని పనులు

- వేగం మరింత పెరగాలి... అనుకున్న సమయానికి పనులు పూర్తి కావాలి
- రాజధాని పనులపై కాంట్రాక్ట్ సంస్థలు, అధికారులతో సమీక్షలో సిఎం చంద్రబాబు

**విజయవాడ, జులై 28 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతి నిర్మాణ పనుల్లో వేగం మరింత పెరగాలని, అనుకున్న సమయానికి ప్రతి ప్రాజెక్ట్ పూర్తి కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. స్పీడ్, క్వాలిటీ, డెలివరీ లక్ష్యంగా రాజధాని పనులు జరగాలని సిఎం అన్నారు. గతంతో పోల్చితే పనుల్లో వేగం కొంత మేర పెరిగినా, ఇంకా వేగం పెంచాలన్నారు. ఒక నిర్మాణ సంస్థగా రాజధాని పనులు చేపట్టడం గొప్ప అవకాశమని, ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సిఎం సూచించారు. ఆర్థికంగా ఎటువంటి సమస్యలు లేకుండా ప్రభుత్వం చూస్తున్న నేపథ్యంలో పనుల్లో ఎక్కడా జాప్యం ఉండకూదని సిఎం స్పష్టం చేశారు. సచివాలయంలో రాజధాని అమరావతి నిర్మాణ సంస్థల ప్రతినిధులతో ముఖ్యమంత్రి మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. రాజధానిలో 95 ప్రాజెక్టులకు సంబంధించి రూ.50,999 కోట్ల విలువైన పనులు చేపట్టగా నెలకు కనీసం 7.92శాతం పనులు జరగాలని సూచించారు. భూసేకరణ, నిధుల సమీకరణ, అనుమతులు, డిజైన్లు వంటి అంశాల్లో అన్ని శాఖలు, ఉన్నతాధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అమరావతి అంటే... కేవలం 29 గ్రామాల సమాహారంగా కాకుండా విజయవాడ, గుంటూరుతో కలిపి చూడాలన్నారు. అందుకు తగిన విధంగా ఆయా ప్రాంతాల్లో మౌలిక వసతుల ప్రాజెక్ట్ పనులు జరగాలన్నారు. రోడ్ల నిర్మాణంతో పాటు పచ్చదనం పెంపుపైనా దృష్టిపెట్టాలని సూచించారు. తాను కూడా స్వయంగా ఇకపై రాజధాని పనులను పరిశీలిస్తానని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సమీక్షా సమావేశంలో మంత్రి నారాయణ, సిఎస్ సాయిప్రసాద్, ఉన్నతాధికారులు, కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



# ఎల్ నినో నుంచి రైతులను ఆదుకోండి



- సిఎం చంద్రబాబుకు సిపిఐ రామకృష్ణ వినతి

**విజయవాడ, జులై 28 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎల్ నినో కారణంగా తక్కువ వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. కె.రామకృష్ణ మంగళవారం రాష్ట్ర సచివాలయంలో సిఎం చంద్రబాబును కలిశారు. రాష్ట్రంలోని 21 జిల్లాల్లో 54 శాతం తక్కువగా వర్షపాతం నమోదైందని, 249 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులు ఇబ్బందుల్లో ఉన్నారని ఆయన వివరించారు. అదే విధంగా మంచినీటి ఎద్దడి లేకుండా ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టాలని రామకృష్ణ ముఖ్యమంత్రిని కోరారు. ఈ సందర్భంగా సిఎం స్పందిస్తూ ప్రభుత్వం ఇప్పటికే ఎల్ నినో సమస్యపై దృష్టి సారించిందని, ఆగస్ట్ 3 నుంచి అన్ని ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. తాగునీటి సమస్య రాకుండా ఉండేలా యంత్రాగానికి ఆదేశాలు జారీ చేశామని సిఎం అన్నారు. ప్రభుత్వం దృష్టికి రామకృష్ణ తీసుకొచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సిఎం చంద్రబాబు తెలిపారు.

# ముగిసిన కపిలేశ్వరుని పవిత్రోత్సవాలు



**తిరుమల, జులై 28 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి కపిలేశ్వరస్వామి ఆలయంలో మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించిన వార్షిక పవిత్రోత్సవాలు మంగళవారం మహాపూర్ణాహుతితో శాస్త్రోక్తంగా ముగిశాయి. వేద మంత్రోచ్చారణల నడుమ భక్తిపారవశ్య వాతావరణంలో నిర్వహించిన ఈ మహోత్సవాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉదయం యాగశాల పూజ, హోమం, మహాపూర్ణాహుతి, కలశోద్వాసన, మూలవర్లకు కలశాభిషేకం, పట్టుపవిత్ర సమర్పణ తదితర విశిష్ట ఆగమ కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం పంచమూర్తులు ఆలయ మాడ వీధుల్లో భక్తులకు దివ్య దర్శనమిస్తూ ఊరేగి అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో టిటిడి జెఇఒ డాక్టర్ ఎ. శరత్, ఆలయ డిప్యూటీ ఇఒ నాగరత్న, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## జీవితాంతం విఐపి బ్రేక్ దర్శనమంటూ మోసం

# భక్తులను నమ్మిస్తే చర్యలు: టిటిడి

**తిరుమల,జులై 28 ప్రభాతవార్తప్రతినిధి:** యాత్రాస్థలం తిరుపతి నగర ప్రాధాన్యత దృష్ట్యా సొంతింటి కల సాకారం పేరుతో ప్లాట్ కొంటే జీవితాంతం విఐపి బ్రేక్ దర్శనం సదుపాయం కల్పిస్తామని మోసం చేస్తున్న వారిపై టిటిడి చర్యలకు ఉపక్రమించింది. సామాజిక మాధ్యమంలో ఈ దుష్ప్రచారం చేస్తున్న ఎస్‌సిపి డెవలపర్స్ సంస్థపై కఠిన చర్యలకై పోలీసులకు ఫిర్యాదు అందింది. కొంతమంది వ్యక్తులు తిరుపతి హైవే లో ప్లాట్లు కొనుగోలు చేస్తే "జీవితాంతం శ్రీవారి విఐపి బ్రేక్ దర్శనం కల్పిస్తామంటూ ప్రచారం చేస్తున్న రీల్స్‌ను టిటిడి తీవ్రంగా ఖండించింది. ఈ ప్రచారానికి టిటిడితో ఎలాంటి సంబంధం లేదని, ఇటువంటి హామీలు ఇచ్చే అధికారం ఏ ప్రైవేటు సంస్థకు, వ్యక్తికి లేదని టిటిడి యంత్రాంగం స్పష్టం చేసింది. శ్రీవారి దర్శనానికి సంబంధించిన అన్ని విధానాలు, సేవలు, టికెట్లు పూర్తిగా టిటిడి నిబంధనలు, మార్గదర్శకాల ప్రకారమే అమలులో ఉంటాయి. ఎవరైనా వ్యక్తులు ,సంస్థలు భక్తులను ఆకర్షించేందుకు టిటిడి పేరు, శ్రీవారి పేరు, దర్శనాల పేరును ఉపయోగించి తప్పుడు ప్రచారం చేయడం అత్యంత బాధ్యతారాహిత్యమైన చర్యగా పేర్కొన్నారు. భక్తులు ఇటువంటి తప్పుడు ప్రకటనలు, సోషల్ మీడియా రీల్స్, వాణిజ్య ప్రకటనలను నమ్మి మోసపోవద్దని టిటిడి విజ్ఞప్తి చేసింది. శ్రీవారి దర్శనాలకు సంబంధించిన అధికారిక సమాచారం కోసం టిటిడి అధికారిక ప్రకటనలు, వెబ్‌సైట్ ,అధికారిక సోషల్ మీడియా వేదికలను మాత్రమే విశ్వసించాలని భక్తులను కోరారు.. టిటిడి విజిలెన్స్ అధికారులు సదరు ప్రకటన కొరకు పరి శోధించే క్రమంలో ఆ సంస్థ తమ వ్యాపార ప్రకటన సామాజిక మాధ్యమం నుండి తొలగించినట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించారు.

# ట్రోలింగ్‌కు దూరంగా ఉండండి

- అభిమానులకు అల్లు అర్జున్ కీలక సూచన



అభిమానులతో కలిసి సెల్ఫీ దిగుతున్న అల్లు అర్జున్

**జూబ్లీహిల్స్, జులై 28 ప్రభాతవార్త:** నచ్చని వారి గురించి ఆలోచించడం కంటే నచ్చే పనిచేసుకుంటూ వెళ్లడం మంచిదని తన అభిమానులను ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ సూచించారు. ఈ సందర్భంగా సోషల్ మీడియాలో జరుగుతున్న నెగెటివిటీ, అనవసర వివాదాల గురించి స్పందిస్తూ అభిమానులకు పలు కీలక సూచనలు చేశారు.యూసుఫ్‌గూడలోని శౌర్య భవన్‌లో మంగళవారం అల్లు అర్జున్ దాదాపు 900ల మంది అభిమానులతో నలుపు రంగు దుస్తు కోడ్‌లో అభిమానుల ఆతిథ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లు అర్జున్ మాట్లాడుతూ.. ఈ రోజు నేను ఇక్కడ ఉండటం చాలా గర్వంగా ఉంది. ప్రతి ఒక్కరికి పేరు పేరునా ధన్యవాదాలు. మీలో ఈ ఉత్సాహాన్ని ఎప్పటికి పోనివ్వకండి. నా అభిమానులకే కాదు.. నన్ను ద్వేషించేవారికి చెబుతున్నా.. ఒకరిపై ఒకరు ట్రోలింగ్ చేయడం మంచిది కాదు. మనకు నచ్చని వాళ్ల కోసం మన సమయం, డబ్బు, శక్తి ఎందుకు ఖర్చుచేయాలి.? సోషల్ మీడియాలో వచ్చే ట్రోల్స్‌పై స్పదించడం కంటే, ఆ సమయాన్ని మీ సొంత ఎదుగుదల కోసం ఉపయోగించండి, మీకు నచ్చిన పని చేయండి, నీకు నచ్చిన అమ్మాయి ఇంటి ముందు నిలబడి ఎదురుచూడండి, పర్లేదు కనీసం నువ్వు ఆ సయమాన్ని అయినా ఎంజాయ్ చేస్తావు కదా అని అన్నారు. ఎవరిని ఎప్పుడు ట్రోల్స్ చేయవద్దని, సమయం, శక్తి ఏదైనా అనుకోండి ప్రతి మనిషికి ఒక రోజులో 100 శాతం ఉందనుకుంటే దాన్ని మీరు దేనికి ఉపయోగిస్తారనేది ముఖ్యమని అన్నారు. ఈ కార్యక్రమానికి తెలుగు రాష్ట్రాలతోపాటు ఒరిస్సా, మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ నుంచి అభిమానులు తరలివచ్చారు. ఏఏఎఫ్ఏ తరుపున ఆయన అభిమానులకు ఇన్సూరెన్స్ పాలసీలను అందించారు. ఈ సందర్భంగా ప్రతి అభిమానికి ఆయన తనతో ఫొటో దిగే అవకావం కల్పించారు.

## ఎపిలో జాతీయ రహదారులపై

# డ్రైవర్ల కోసం 59 అప్నా ఘర్‌లు

## రాజ్యసభలో ఎంపి రఘునాథ రెడ్డికి కేంద్ర మంత్రి సురేష్ గోపి వెల్లడి

**రాజంపేట, జులై 28 ప్రభాతవార్త:** జాతీయ రాష్ట్ర రహదారులపై ట్రక్ డ్రైవర్లు, టాక్సీ డ్రైవర్ల భద్రత, విశ్రాంతి, సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అవసరమైన చోట అప్నా ఘర్ అమలు చేస్తున్నట్లు 'అప్నా ఘర్' కార్యక్రమంపై వైసిపి రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథ రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి సురేష్ గోపి సమాధానం ఇచ్చారు. 2026 జులై 1 నాటికి దేశవ్యాప్తంగా 840 'అప్నా ఘర్' కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఆంధ్రప్రదేశ్‌లో 59 కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో 58 జాతీయ రహదారులపై, 1 రాష్ట్ర రహదారిపై ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కేంద్రాల్లో ట్రక్ డ్రైవర్లకు 10 నుంచి 30 పడకలతో వసతి, రెస్టారెంట్, ధాబా లేదా స్వీయ వంట సౌకర్యం, శుభ్రమైన మరుగుదొడ్లు, ప్రత్యేక స్నాన సౌకర్యాలు, శుద్ధి చేసిన తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. అదేవిధంగా, జాతీయ రహదారులు, పారిశ్రామిక కారిడార్లు, లాజిస్టిక్స్ మార్గాలు, పోర్టు అనుసంధాన రహదారులు, మైనింగ్ బెల్ట్‌లు, తయారీ క్లస్టర్లు వంటి ప్రాంతాల్లో ట్రక్కుల రద్దీ, భూమి లభ్యత, పారిశ్రామిక కేంద్రాలకు సమీపం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని కొత్త 'అప్నా ఘర్' కేంద్రాల ఏర్పాటును దశలవారీగా విస్తరిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

# పార్టీ గీత దాటలేదు.. భవిష్యత్‌లోనూ దాటను!

## - విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు

**విజయవాడ, జులై 28 ప్రభాతవార్త ప్రతినిధి:** పార్టీ గీత దాటలేదు. భవిష్యత్‌లోనూ దాటను. చంద్రబాబు ఆదేశాలను ఎప్పుడూ శిరసావహిస్తానని విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు స్పష్టం చేసారు. ముద్రగడ పద్మనాభం. సంస్మరణ సభకు వెళ్లి వైఎస్సార్సీపీ నేతలను కలవాల్సి వచ్చిందన్నారు. ఆ విషయాన్ని విపరీతంగా ట్రోల్ చేశారన్నారు. మంగళవారం త్రిసభ్య కమిటీ ముందు బొండా ఉమా విచారణకు హాజరయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తనపై వచ్చిన ఆరోపణలకు పల్లా శ్రీనివాస్, రామానాయుడుకు వివరణ ఇచ్చానని తెలిపారు. "సోషల్ మీడియాలో నా మాటలను వక్రీకరించారు. జరిగిన ఘటనను వక్రీకరించారు ఇదంతా సమన్వయ లోపమే. ఇలాంటివి మరోసారి జరగకుండా చూస్తానని చెప్పా. కొన్ని దుష్టశక్తులు నాపై బురద జల్లాయి. నేను చెప్పని మాటలను కూడా టివిల్లో ప్రసారం చేశార్లు అని ఎమ్మెల్యే బోండా ఉమ పేర్కొన్నారు. ముద్రగడ పద్మనాభం సంస్మరణ సభకు మాత్రమే హాజరయ్యానని తెలిపారు. కాపు జెఎసి ఆధ్వర్యంలో నిర్వహించిన ముద్రగడ సంస్మరణ సభకు అన్ని పార్టీలకు చెందిన నేతలు హాజరయ్యారని బోండా ఉమ తెలిపారు. ఆ సభలో తాను పాల్గొనడంలో ఎలాంటి రాజకీయ ఉద్దేశం లేదని స్పష్టం చేశారు. సభలో నేను కూర్చున్న కుర్చీ పక్కకు వైసిపి మాజీ మంత్రి అంబటి రాంబాబు వచ్చి పలకరించారు. అది వాస్తవం. కానీ దాన్ని వేరే విధంగా ప్రచారం చేస్తున్నారు అని బోండా ఉమ పేర్కొన్నారు. తన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకుని సోషల్ మీడియాలో ప్రచారం చేయడం బాధాకరమని ఆయన అన్నారు. ఈ వ్యవహారంపై పార్టీ అధిష్టానానికి పూర్తి వివరాలు వెల్లడించినట్లు తెలిపారు. తాను ఎప్పుడూ పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించలేదని బోండా ఉమ స్పష్టం చేశారు.

# సినీ నటి పావలా శ్యామల కన్నుమూత

- అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి
- 250పైగా చిత్రాల్లో నటించి ప్రత్యేక గుర్తింపు





**హైదరాబాద్, జులై 28 ప్రభాతవార్త:** సినీ నటి, క్యారెక్టర్ ఆర్టిస్ట్ పావలా శ్యామల కన్నుమూశారు. కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. అర్ధరాత్రి దాటిన తర్వాత తీవ్రమైన గుండెపోటు రావడంతో ఆమె మరణించినట్లుగా ఉస్మానియా ఆస్పత్రి వైద్యులు తెలిపారు. ప్రస్తుతం ఆమె భౌతికకాయాన్ని ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. ఎపిలోని గుంటూరు జిల్లాలో 1951లో జన్మించిన పావలా శ్యామల అసలు పేరు నేతి శ్యామల. పదో తరగతి వరకు చదువుకున్న ఆమె, నాటక రంగంతో నటన రంగంలోకి అడుగుపెట్టింది. నటిగా, రేడియో ఆర్టిస్ట్‌గా ప్రస్థానం ప్రారంభించారు. ఆమె నటించిన 'పావలా' అనే నాటకం విశేష ప్రజాదరణ పొందడంతో ఆదే ఆమె ఇంటిపేరుగా స్థిరపడిపోయింది. తన అమాయత్వంతో కూడిన నటనతో తెలుగు ప్రేక్షకుల్లో చెరగని ముద్రవేశారు. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు సాగిన తన సినీ ప్రయాణంలో పావలా శ్యామల 250కి పైగా చిత్రాలలో నటించారు. 1985లో బాలకృష్ణ హీరోగా వచ్చిన 'బాబాయ్ అబ్బాయ్' సినిమాతో పావలా శ్యామల ఇండస్ట్రీలోకి వచ్చారు. కె.విశ్వనాథ్ దర్శకత్వంలో వచ్చిన 'స్వర్ణకమలం' సినిమాతో నటిగా ఆమె గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ తర్వాత ఖడ్గం, గోలీమార్, ఆంధ్రావాలా సినిమాలతో ఆమె పాపులర్ అయ్యారు. కాగా,పావలా శ్యామల మరణవార్తతో తెలుగు సినీ పరిశ్రమలో విషాదం నెలకొంది.

# శాకంబరిగా దుర్గమ్మ దర్శనానికి భక్తుల వెల్లువ





**ఇంద్రకీలాద్రి, జులై 28 ప్రభాతవార్త:** దుర్గమ్మకి ఆషాఢం సారె తెచ్చిన భక్తజనంతో ఆలయంలో మంగళవారం రద్దీ నెలకొంది. శ్రీ కనకదుర్గమ్మని ఇంటి ఇలవేల్పుగా, ఆడపడుచుగా భావిస్తూ పసుపు, కుంకుమలు, గాజులు, చీర,సారెలతో ఇంద్ర కీలాద్రికి 15వ రోజు మంగళవారం సాయంత్రం గంటల వరకు 32 సారె బృందాలకు చెందిన 16,890 మంది మహిళలు అమ్మవారికి సారె సమర్పించారు. వారు దుర్గమ్మ దర్శనానంతరం 6వ అంతస్తులోని శ్రీ అమ్మవార్లకు సారెను సమర్పించి పూజాదికాలు నిర్వహించారు. వారికి భవానీ అనుగ్రహ దర్శన్ క్యూ లైన్ దర్శనం మొత్తం సారె భక్తులకు కేటాయించారు.

**పోరంకి వేదపాఠశాల విద్యార్థులకు పౌర్ణమి, అమావాస్య రోజుల్లో దుర్గమ్మ ప్రత్యేక దర్శనం:** పోరంకి వేదపాఠశాల విద్యార్థులకు పౌర్ణమి, అమావాస్య రోజుల్లో దుర్గమ్మ ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేసినట్లు ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. దేవస్థాన చరిత్ర లో తొలిసారిగా వేద విద్యార్థుల కోసం వేద దివ్య దర్శనం పాలసీ" రూపొందించామన్నారు. వేద విద్యను ప్రోత్సహించేందుకు ఇకపై ప్రతి పండగ దినాల్లో, పౌర్ణమి, అమావాస్య వంటి విశేష పర్వదినాల్లో అమ్మవారి ప్రత్యేక దర్శనం కల్పించనున్నామన్నారు.

సకల లోకాలను రక్షించడానికి ఈనెల 27 నుండి శాకంబరి మాతగా అనుగ్రహించిన దుర్గమ్మ ఆలయంలో బుధవారం ఉదయం పూర్ణాహుతి నిర్వహిస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. ఉదయం 8 గంటలకు చండీసప్తశతీ పారాయణం, మహావిద్యా పారాయణం, హోమం, శాంతి పౌష్టిక హోమములు, మండపపూజ, ఉదయం 9.30కు మహాపూర్ణాహుతి, కలశోద్వాసన, మార్జనము, ప్రసాద వితరణముతో ఉత్సవాలకు స్వస్తి పలుకుతామని ఇఓ తెలిపారు.

**నేడు గిరి ప్రదక్షిణ:** బుధవారం ఆషాఢమాసం పౌర్ణమి వ్యాస పౌర్ణమి పర్వదినాన శ్రీ ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ ఉదయం 5.55లకు ఘాట్ రోడ్ వద్ద కామధేను అమ్మవారి ఆలయం నుండి ప్రారంభమవుతుందని, భక్తులు విశేషంగా పాల్గొని శ్రీ అమ్మవారి కృపకు పాత్రులవ్వాలని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు.



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు
NIT No. 75-78/EE/R&B/VZM/2026-27 తేది: 24.07.2026
విజయనగరం జిల్లాలో (ఆర్&బి) డివిజను పరిధిలో ఒక (4) పనుల కొరకు టెండర్లు పిలువబడినవి. 4 పనుల విలువ: రూ.23.45 లక్షలు. టెండర్లు స్వీకరణ కొరకు ఆఖరు తేది: 06.08.2026, సా.4.00గం.ల వరకు. తదుపరి వివరాలను ఇ-మార్కెట్ ప్లేస్ www.apeprocurement.gov.in వద్ద చూడవచ్చును.
సం/-. కార్యనిర్వాహక ఇంజనీరు (ఆర్ & బి), విజయనగరం.
DIPR.NO. 21038/CL/ADVT/1/1/2022-23 తేది: 28.07.2026

వార్త

అంతరాత్మ నీకు మంచి స్నేహితుడు. కావున తరచుగా తన మాట వినవలసిందే!

- గురజాడ

# ఓటు హక్కుపై నీలినీడలు !

ప్రజాస్వామ్యంలో ఓటరు జాబితాపై ప్రజలకు నమ్మకం లేకపోతే ఎన్నికల ఫలితాలపై కూడా అనుమానాలు తలెత్తుతాయి. అందుకే ప్రత్యేక ఓటరు జాబితా సవరణ వంటి ప్రక్రియలు అత్యంత పారదర్శకంగా, రాజకీయాలకు అతీతంగా సాగాలి. ఇప్పటికే ఎన్నో రాష్ట్రాలలో 'సర్' ప్రక్రియ విమర్శలకు తలకెత్తుకుంది. కాగా ఆంధ్రప్రదేశ్లో ఎస్ఐఆర్ అమలుపై వెలువడుతున్న ఆరోపణలు ఎన్నికల నిర్వహణపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. ప్రతిపక్షాల ఆరోపణలు కొట్టేయదగినవి కావు. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిస్తున్నారని, బూత్ లెవల్ అధికారులపై అసాధారణ ఒత్తిడి ఉందని, రాజకీయ ప్రభావంతో ధృవీకరణ జరుగుతోందని, ఫారాల పరిశీలన సజావుగా లేదనే ఆరోపణలున్నాయి. ఆ మేరకు ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు కూడా అందాయి. నకిలీ నమోదులు, మరణించిన వారి పేర్లు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన ఓటర్లను గుర్తించి జాబితాను సరి చేయడమే ఎస్ఐఆర్ లక్ష్యమని ప్రకటించుకున్నా జరుగుతున్న కార్యాచరణ వేరేగా ధ్వనిస్తోంది. ప్రతి అభ్యంతరాన్ని స్వీకరించేందుకు, ప్రతి ఓటరుకి అవకాశం కల్పించేందుకు చట్టబద్ధ విధానాలు అమల్లో ఉన్నాకూడా అధికారయంత్రాంగం కొన్ని విధానాలు పట్టించుకుంటున్నట్లు లేదు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత ఎంత ఎక్కువగా ఉంటే, రాజకీయ వివాదాలు అంత తక్కువగా ఉంటాయి. ప్రతి తొలగింపుకు స్పష్టమైన కారణం ఉండాలి. ప్రతి అభ్యంతరానికి వేగంగా పరిష్కారం లభించాలి. ప్రతి రాజకీయ పార్టీకి సమాన సమాచారం అందాలి. ఇదే ప్రజాస్వామ్యానికి సరైన మార్గం. ఆంధ్రప్రదేశ్లో ఓటరు జాబితాలపై వివాదాలు కొత్తవి కావు. గతంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలపై కూడాఇలాంటి ఆరోపణలు వచ్చాయి. అందువల్ల ఇది ఒక పార్టీకి సంబంధించిన అంశంగా కాకుండా, ఎన్నికల వ్యవస్థ విశ్వసనీయతకు సంబంధించిన సమస్యగా చూడాలి. కానీ ఎన్నికల సంఘంపై ప్రజల విశ్వాసం దెబ్బతింటే నష్టపోయేది ప్రజాస్వామ్యమే. ఎస్ఐఆర్ అమలులో బూత్ లెవల్ అధికారుల పాత్ర అత్యంత కీలకం. అధికార యంత్రాంగం వేగం కంటే నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలి.ఇంకో వైపు రాజకీయ పార్టీలకూ బాధ్యత ఉంది. ఆధారాలతో కూడిన అభ్యంతరాలు సమర్పించడం, వాటిని నిష్పాక్షికంగా విచారించడం ఈ రెండు సమాంతరంగా జరగాలి. అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా అన్యాయంగా తొలగించబడకూడదు. అదే సమయంలో నకిలీ నమోదులకు కూడా స్థానం ఉండకూడదు. ఈ రెండింటి మధ్య సమతుల్యత సాధించడమే ఎన్నికల సంఘం ముందున్న అసలు సవాలు. ఎస్ఐఆర్ వివాదం చివరికి ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తోంది. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం, ప్రజలతో నిరంతర సంభాషణ ఈ మూడు సూత్రాలు బలంగా అమలైతే ఆరోపణలకు తావుండదు. తెలంగాణలో మొత్తం ఓటర్లు 3.4 కోట్లు. తెలంగాణలో ఫ్లాగ్ చేసిన రికార్డులు సుమారు 88 లక్షలుంటాయి. సుమారు 30లక్షలు అని అధికారుల అంచనా. ఇది మొత్తం ఓటర్లలో దాదాపు 9శాతంగా చెప్పాలి.ఎమ్ఐఆర్ చెల్లుబాటైన డాక్యుమెంట్లు ఇస్తే పేరు తొలగించరాదని సుప్రీం కోర్టు తీర్పు స్పష్టం చేసింది కూడా. వలసదారులు, డూప్లికేట్ ఐడీల కారణంగా హైదరాబాద్లో అత్యధిక తొలగింపులు ఉండే అవకాశం ఉంది. తెలంగాణలో 30 లక్షల వరకు తొలగిపోయే అవకాశం ఉందని అంచనా. ఇక ఆంధ్ర ప్రదేశ్లో మొత్తం ఓటర్లు 4.16కోట్లు కాగా ఒక్క తిరుపతి జిల్లాలోనే 2.88 లక్షల మంది ఆచూకీ తెలియని వారి జాబితాలో పెట్టారు. ఇప్పటికే 15.2 లక్షల మంది చనిపోయిన వారు, 14.4 లక్షల మంది చిన్న గాయాలు మారిన వారు, 7.3లక్షల డూప్లికేట్ వెరసి 37లక్షలకు పైగా ఓటర్లు తొలగింపు ప్రక్రియలో బాధితులుగా మారారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కేవలం రాజ్యాంగ హక్కు మాత్రమే కాదు, అది జన స్వరానికి ప్రతీక. అర్హు లైన ఒక్క ఓటరు పేరు కూడా అన్యాయంగా తొలగించబడకూడదు. అదే సమయంలో నకిలీ నమోదులకు కూడా స్థానం ఉండకూడదు. ఈ రెండింటి మధ్య సమతుల్యత సాధించడమే ఎన్నికల సంఘం ముందున్న అసలు సవాలు. ఎస్ఐఆర్ వివాదంలో తేలిన విషయాలను బట్టి చివరికి ఒక స్పష్టమైన సందేశాన్ని గమనించవచ్చు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం, ప్రజలతో నిరంతర సంభాషణ. ఈ మూడు సూత్రాలు బలంగా అమలైతే ఆరోపణలకు తావు తగ్గుతుంది. ప్రజాస్వామ్యం బలపడేది రాజకీయ విజయాలతో కాదు. ప్రజలు ఎన్నికల ప్రక్రియను నమ్మినప్పుడే. ఆ నమ్మకాన్ని కాపాడడం ఎన్నికల సంఘం, రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు అందరి ఉమ్మడి బాధ్యత. ఓటు హక్కు అనేది ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలస్తంభం. సాంకేతిక సరిదిద్దుబాట్లు లేదా అధికారిక ప్రక్షాళన పేరుతో ఏ ఒక్క నిజమైన పౌరుడూ ఓటు హక్కుకు దూరం కాకూడదు. ఎన్నికల కమిషన్ విశ్వసనీయత పెరగాలన్నా, ప్రజాస్వామ్య పునాదులు బలపడాలన్నా 'సర్' ప్రక్రియ నిష్పాక్షికంగా, పారదర్శకంగా జరగడం అత్యంత ఆవశ్యకం. తగినముందస్తు నోటీసులు లేదా క్షేత్రస్థాయి విచారణ లేకుండానే నిజమైన ఓటర్ల పేర్లను జాబితా నుండి తొలగించడం క్షమార్హం కాదు. వలస కార్మికులు, పేదలు , అట్టడుగు వర్గాలు అవసరమైన ఆధార్, పుట్టిన తేదీ లేదా నివాస ధ్రువీకరణ పత్రాలను నిర్ణీత సమయంలోగా అందించలేక ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. అది ప్రజాస్వామ్యానికే తీరని మచ్చ.



ఆత్మవిశ్వాసం, స్వయం పోషకత్వం ఉత్తమ స్వభావానికి మూలస్తంభాలు వంటివి.

వినోబా భావే



కల్లోలంగా ఉన్న కొలనులో నిశ్చలమైన ప్రతిబింబం కనబడదు. అలాగే నిలకడలేని మనసులో శాంతి నిలబడదు.

కె. స్టానిస్లావిస్కి

# బలమైన లక్ష్యమే 'కాక్రోచ్' విజయానికి నాంది!

*అహింసతో స్వాతంత్ర్యం సాధించుకున్న ఈ దేశం క్రమేపీ హింసకు అనేక ఘటనలల్లో స్థానం ఇవ్వటం శోచనీయం! విద్యార్థులు అదుపు తప్పితే అల్లరి చిల్లరి పనులు చేస్తారు! మన ఇండ్లలో గూడా పిల్లల అల్లరి చేష్టలు చూస్తునే వుంటాం! తల్లిదండ్రులు ఆ చేష్టలు శ్రుతిమించిన ప్పుడు హద్దుల్లో పెట్టగలరు! ఆ నేర్పు ప్రభుత్వాలు నేర్చు కోవాలి! కరుడు గట్టిన అల్లరి మూకలను అణిచివేసే ధోరణి లోనే సహేతుకంగా ఆందోళనకు దిగిన యువతను విద్యార్థు లను, అదుపు చేయాలని ప్రయత్నించటం సరికాదు! ఆ విధంగా ఢిల్లీ పోలీసులు చేసారన్న ఆరోపణలు ఊపిరి పోసుకోవటం వల్ల, ఆందోళనకారులు ప్రతిఘటించారు. ఆ ప్రతిఘటనలకు సానుభూతి లభించింది. అందుకే మిడతల యుద్ధం విజయవంతంగా ముగిసింది! కాక్రోచ్ పార్టీ ఈ విజయాన్ని ఆధారం చేసుకొని రాజకీయాల్లో జొరబడితే దేశంలో వున్న అన్ని పార్టీల మాదిరే మిగులుతుంది. ప్రత్యే కత పేరుకు మాత్రమే కాదు లక్ష్యానికి వున్నప్పుడే విజయం చీమల దండుకైనా దక్కుతుంది.*



రావులపాటి సీతారాంరావు

మిడతల దండు ఉద్యమం విజయవంతంగా ముగియటానికి ముఖ్య కారణం పట్టుదల! విద్యార్థులలో యువతలో ఆ పట్టుదల లక్ష్యం సాధించాలన్న ఏకాగ్రత చాలా రోజుల తర్వాత ఈ ఉద్యమంలో చూడగలిగాం. సి.జె.పి (కాక్రోచ్ జనతా పార్టీ) స్థాపించిన అభిజిత్ దీప్కే స్వీయ నాయకత్వంతో ఈ విజయం సాధించాడా, వెనకఎవరైనా వున్నారా అన్నది ప్రస్తుతంఅప్రస్తుతం! అది తర్వాత తేలాల్సిన విషయం! ప్రస్తుత పరిస్థితులలో, ఉద్యమం సద్దుమణిగిన వేళ కొన్ని అంశాలు ప్రస్ఫుటంగా విశ్లేషించుకోవాల్సిన అవసరం వుంది! జూలై 19న జంతర్ మంతర్ నుంచి సోనమ్ వాంగ్ చుక్‌ను ఒక రోజు ముందు లేపేసిన రోజున వందల కొద్దీ యువత నిరసనకారులకు వత్తాసు పలికారు. బీహార్, యు.పి, రాజస్థాన్, హర్యానా, వెస్ట్ బెంగాల్ లాంటి రాష్ట్రాల నుండి తరలివచ్చి వారితో జత కలిపి ప్రొటెస్టు చేయసాగారు! మెట్రో స్టేషన్లు మూసి వేయబడినా, ఇంటర్నల్ సర్వీసులు పనిచేయకపోయినా, జనం విపరీతంగా ఎన్నో కిలోమీటర్లు నడుచుకుంటూ జంతర్ మంతర్ ప్రాంతానికి చేరుకోవటం విశేషమే! ఎవరిని అడిగినా జంతర్ మంతర్కు వెళ్తున్నాం అనే!జంతర్‌మంతర్ ప్రాంతంలో నిరాహార దీక్షలు చేస్తున్నవారు ఆకలిని తట్టుకొని ఎన్నో గంటలు కాక్రోచ్ ఉద్యమంలో పాల్గొనటం, విద్యార్థులకు మేమున్నాం అని చేయూతనివ్వటం ఈ మధ్య కాలంలో చూడని విషయంగా చెప్పుకోక తప్పదు! 21 రోజులు నిరాహార దీక్ష చేస్తూ గూడా చెక్కుచెదరని దీక్షతో విద్యార్థులు వుండటానికి కారణం వారు లక్ష్యాన్ని బలంగా నమ్మటం వల్లనే! అంతేగాదు ప్రశాంతంగా మౌనవ్రతంలో కూర్చోవటం గూడా అరుదైన విషయమే! ఆకలిని జయించి క్రమశిక్షణను ఆలంబనగా చేసుకొని విద్యార్థులు వారి శరీరాలను, మాటలనూ, ఓపికనూ అదుపులో నమ్మకంతో పెట్టుకోగలగటం వారి మొదటి విజయంగా చెప్పుకోవాలి!'విద్యార్థులలో తమకు జరుగుతున్న అన్యాయానికి లోలోపల కోపాగ్నిగా రగిలి బడబాగ్నిగా బయటకు ఉబికి ఉబికి వస్తున్నదని' అర్ధతతో జంతర్‌మంతర్ ప్రాంతంలో అంతులేని విద్యార్థి లోకాన్ని చూసిన వృద్ధుడు అనటం అక్కడి వారిని కంటతడి పెట్టించింది. జులై 20 నాడు జంతర్ మంతర్‌లో చూసిన దృశ్యాలు విద్యార్థి లోకం మూకుమ్మడిగా తిరగబడటం, బారికేడ్లను విరిచేయటం, టియర్ గాస్, లాఠీ చార్జిలతో గాయాలు అయినా ఎదురొడ్డి నిల్చోవటం, అరెస్టులు కావటం పోలీసుల ఎఫ్.ఐ.ఆర్‌లను స్టేషన్లలో ఎదుర్కోవటం, ఇంకా ఆ ప్రాంతంలో నివసిస్తున్న జనానికి కళ్లకు కట్టినట్లుగా కనిపిస్తూనే వున్నాయి! అయితే ఇన్ని జరిగినా వారిఓపిక తగ్గకుండా వుండటాన్ని ఇప్పటికీ కథలు కథలుగా చెప్పుకుంటూనే వున్నారు! 'ప్రతిఘటన'ను విద్యార్థిలోకం ఆయుధంగా మల్చుకుంది! ఉద్రేకంతో చేసే ఆ ప్రతిఘటన వారి శరీరాల్లో ఇంకిపోయి పట్టుదలను మరింతగా పెంచినందువల్లేఅంతగా ప్రభుత్వాన్ని పాలనను ఎదిరించి పోరాడగలిగారు!వారి ప్రతిఘటనా శక్తిని అణిచివేయటానికి ప్రయత్నించినా మరింత వేగం పుంజుకొని వారిలో తిరగబడే నేర్పరితనాన్ని కలిగించటం వల్లనే, అంతమంది పోలీసులను ఎదురొడ్డి, దీక్షను సాగించగలిగారు! ప్రొటెస్ట్ వారికి ఆ క్షణంలో 'లైఫ్‌లైన్' గా మారింది అన్న భ్రాంతిని చూపరులకు కలిగించింది! వేల



కొద్దీ పార్లమెంటు వైపు పోలీసుల లాఠీచార్జీని, అణిచివేత ధోరణిని లెక్కచేయకుండా, ఆశ్చర్యపరిచే విధంగా సంయమనంతో ఓపికతో మార్చ్ చేస్తూ వెళ్ళటం వారి దృఢ సంకల్పాన్ని ప్రభుత్వానికి తెల్పినట్లయింది! వారే కాదు, మహిళలు, వృద్ధులు, పిల్లలు, బారికేడ్లను నెట్టేసుకుంటూ, లాఠీలు ఝుళిపిస్తున్న పోలీసులకు గులాబీ పుష్పాలు ఇస్తూ వెళ్తున్న వారిని చాలామందిని పోలీసులు అరెస్టు చేయటం అరుదైన దృశ్యంగా ఢిల్లీ వీధుల్లో ఆవిష్కరించబడింది! ఈ మధ్య కాలంలో యువత అంతగా బరితెగించి ప్రతిఘటించటం, చుట్టూ కమ్ముకుంటున్న నిరాశను, భవిష్యత్తు అయోమయంగా మారటాన్ని ప్రతిబింబించినట్లయింది. విద్యార్థుల చట్టోల్లంఘన పర్వం ప్రభుత్వానికి కొత్త పాఠాలను నేర్పినట్లయింది. 'నీట్' పరీక్షల ప్రహసనం కేవలం పెల్లుబుకుతున్న లావా పైకి రావటాన్ని మాత్రమే చూపించింది! ధర్మేంద్ర ప్రధాన్, మంత్రిగా రాజీనామా చేయటం వల్ల మొత్తం ప్రహసనానికి తెరపడ్డట్లు కాదేమో! ఉద్యోగాలు చాలా తక్కువ సంఖ్యలో వుంటున్న దశలో ఎంట్రెన్స్ పరీక్షలు తక్కువగా వున్న, ఆ ఉద్యోగాలు ఎంతమంది భవిష్యత్తులో కచ్చితంగా దక్కించుకోగలరో తేల్చటానికే! యువకులు ఆశాకిరణం 'పేపర్ల' లీక్‌తో 'టప్' ఆగినట్లయింది! ఆగిపోని రీతిలో అనేక లీక్‌లు దేశమంతటా సంభవిస్తుంటే దానికి కారణంగా అవినీతి కరాళనృత్యం కనపడింది. 20 లక్షల మంది (దాదాపు) నీట్ టెస్టును చాలా రోజులు కష్టపడి పగలనకా రేయనకా చదివి పరీక్ష రాసిన తర్వాత అది చెల్లదని అంటే విద్యార్థుల కడుపుల్లోంచి అగ్ని ఉబికి ఉబికి పైకొచ్చి ఉద్యమంగా మారింది! మళ్ళీ పరీక్ష రాయాలి! అదీ వారి స్కూల్ పరీక్షలు జరుగుతున్నప్పుడే అంటే విద్యార్థి లోకానికి ఆందోళన తప్ప మరో మార్గం ఏముంది? ఎంతో మంది విద్యార్థులు అపరిస్థితిని తట్టుకోలేకపోయారు! పోలీసులు సరియైన అవగాహన లేకుండా ప్రొటెస్టులు జరుగుతున్న ప్రాంతాలకు గుంపులుగా చేరకుండా వుండటానికి బలప్రయోగం చేయటం అగ్నికి ఆజ్యం పోసినట్లయింది! ప్రభుత్వం ఈ ఉద్యమాన్ని అణిచివేయటం సాధ్యం కాదని భావించిన తర్వాతనే క్రిందికి దిగివచ్చి దిద్దుబాటు చర్యలు మొదలు పెట్టింది. ఆ చర్యలు మొదటి దశలోనే 'లీక్' అని తెలిసినప్పుడే తీసుకున్నట్లయితే పరిస్థితి యింతదాకా వచ్చేది కాదు! కాక్రోచ్ పార్టీ భీష్మించుకొని కూర్చోవటంతో విధిలేక తలవంచే పరిస్థితి ప్రభుత్వం తెచ్చుకోవటం దయనీయంగా మారింది! రాజకీయ పార్టీలు ఈ అసాధారణ ఉద్యమాన్ని హైజాక్ చేయ ప్రయత్నించినా, వారికి సాధ్యం కాలేదు! 'సొమ్ము ఒకడిది సోకు ఒకడిది' అన్న రీతిలోఈ పార్టీలు 'క్రెడిట్' తీసుకోవాలని శతవిధాలా ప్రయత్నించినా విఫలం చెందక తప్పలేదు! కత్తి విడిచి సాము చేయటం ఈపార్టీలకు అలవాటయింది.సమస్యలను పరిష్కరించటం మానేసి నిప్పులను ఎగదోయటం అన్ని పార్టీలకు ఆనవాయితీగా మారటం దురదృష్టకరం! అహింసతో స్వాతంత్ర్యం సాధించుకున్న ఈ దేశం క్రమేపీ హింసకు అనేక ఘటనలల్లో స్థానం ఇవ్వటం శోచనీయం! విద్యార్థులు అదుపు తప్పితే అల్లరి చిల్లరి పనులు చేస్తారు! మన ఇండ్లలో గూడా పిల్లల అల్లరి చేష్టలు చూస్తునే వుంటాం! తల్లిదండ్రులు ఆ చేష్టలు శ్రుతిమించినప్పుడు హద్దుల్లో పెట్టగలరు! ఆ నేర్పు ప్రభుత్వాలు నేర్చుకోవాలి! కరుడుగట్టిన అల్లరి మూకలను అణిచివేసే ధోరణి లోనే సహేతుకంగా ఆందోళనకు దిగిన యువతను విద్యార్థులను, అదుపు చేయాలని ప్రయత్నించటం సరికాదు! ఆ విధంగా ఢిల్లీ పోలీసులు చేసారన్న ఆరోపణలు ఊపిరి పోసుకోవటం వల్ల, ఆందోళనకారులు ప్రతిఘటించారు. ఆ ప్రతిఘటనలకు సానుభూతి లభించింది. అందుకే మిడతల యుద్ధం విజయవంతంగా ముగిసింది! కాక్రోచ్ పార్టీ ఈ విజయాన్ని ఆధారం చేసుకొని రాజకీయాల్లో జొరబడితే దేశంలో వున్న అన్ని పార్టీల మాదిరే మిగులుతుంది. ప్రత్యేకత పేరుకు మాత్రమే కాదు లక్ష్యానికి వున్నప్పుడే విజయం చీమల దండుకైనా దక్కుతుంది. ●

# సవాళ్లను అధిగమిస్తేనే సాంకేతికంగా ముందడుగు

వి. వీరప్ప

రక్షణ, టెలికాం, ఆటోమొబైల్స్, ఏఐ, ఆరోగ్య సంరక్షణ... ఇలా నేడు అన్నింటికీ సెమీకండక్టర్లు ప్రాణావసరాలుగా మారాయి. ఆధునిక సాంకేతిక జగత్తుకు మెదడుగా, 21వ శతాబ్దపు చమురుగా అవి గుర్తింపు పొందాయి. వాటి తయారీపై ఆలస్యంగా దృష్టిసారించిన ఫలితంగా ప్రస్తుతం దేశానికి కావాల్సిన చిప్లలో 90శాతానికి పైగా దిగుమతులే దిక్కవుతున్నాయి. కొవిడ్ సమయంలో సరఫరాలు స్తంభించి పరిశ్రమలు కుదేలయ్యాయి. ఈ దురవస్థను తప్పించేందుకు చిప్లను స్థానికంగానే డిజైన్ చేసుకోవడంతోపాటు తయారీ, ప్యాకేజింగ్, టెస్టింగ్ తదితరాల్లో స్వావలంబన సాధించేందుకు ఇండియా నడుం కట్టింది. అందుకు ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తోంది. ఆదిలోనే సంక్లిష్ట చిప్ల జోలికి వెళ్లకుండా దేశ విస్తృత ప్రయోజనాల రీత్యా వ్యూహాత్మకంగా ముందుకు సాగాలని నీతి ఆయోగ్ రోడ్మ్యాప్ ఇటీవల సూచించింది. ఈ క్రమంలోనే గుజరాత్లోని సానంద్లో జపాన్, థాయ్లాండ్ సంస్థల సహకారంతో సిద్ధమైన కర్మాగారం.ఇది గడిచిన నాలుగు నెలల వ్యవధిలో పట్టాలకెక్కిన మూడో సెమీకండక్టర్ పరిశ్రమ కావడం విశేషం. ఏడాదికి 20కోట్ల చిప్లతో మొదలుపెట్టి, రాబోయే రోజుల్లో కొత్త ప్లాంటు తయారీ సామర్థ్యాన్ని 500 కోట్లకు తీసుకెళ్లాలన్నది లక్ష్యం. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే ఇక్కడి నుంచి విదేశాలకూఎగుమతులు సుసాధ్యమై 'మేకిన్ ఇండియా' ప్రస్థానం మరో మెట్టుకు చేరుతుంది! దేశీయంగా సెమీకండక్టర్ల వినియోగం ప్రస్తుతంతో పోలిస్తే, 2030 నాటికి రెట్టింపవుతుందని అంచనా.పీఎల్ఐ వంటి పథకాల కారణంగా మొబైళ్లతయారీలో ఇండియా ప్రపంచంలోనే రెండోస్థానానికి చేరింది. ఎలక్ట్రానిక్ పరికరాల ఉత్పత్తి సైతం కొన్నేళ్లుగా జోరందుకుంది. దాంతో సెమీకండక్టర్ల అవసరం అధికమైంది. వాటి



కోసం చైనా, తైవాన్, హాంకాంగ్, దక్షిణ కొరియా, జపాన్ వంటి దేశాలపై ఆధారపడాల్సి వస్తోంది. గడిచిన తొమ్మిదేళ్లలో సెమీకండక్టర్ ఉత్పత్తులకు భారతావని 15వేల కోట్ల డాలర్ల విదేశీ మారకద్రవ్యాన్ని ధారపోసింది. ఈ పరాధీనత లోంచి బయటపడేందుకు ఇప్పటిదాకా రూ.1.64 లక్షల కోట్ల విలువైన 12 సెమీకండక్టర్ తయారీ ప్రాజెక్టులకు ఇండియా ఆమోదం తెలిపింది. డిజైన్ అనుసంధానిత ప్రోత్సాహక పథకం కింద 24 చిప్ రూపకల్పన ప్రాజెక్టులకూ ఊతమిస్తోంది. జపాన్, నెదర్లాండ్స్ వంటి దేశాలతో కుదుర్చుకున్న ఒప్పందాలతో ముడిసరకులు, యంత్రాల సరఫరాలకు ఇబ్బందులు లేకుండా చూసుకుంటోంది. అందులో భాగంగానే అమెరికా నేతృత్వంలోని భిప్యాక్స్ సిలికాఖిలోనూ భాగమైంది. ఇలా ఈ రంగంలో ఆత్మనిర్భరత కోసం ప్రణాళికాబద్ధంగా కృషి జరుగుతున్నప్పటికీ, ఇండియా అధిగమించాల్సిన సవాళ్లూ కొన్ని ఉన్నాయి! మైక్రో చిప్ల తయారీకి నిరంతరం విద్యుత్, నీటి లభ్యత తప్పనిసరి. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా దేశీయంగా మౌలిక వసతులు పాదుకొనాల్సి ఉంది. ప్రపంచవ్యాప్త చిప్ డిజైనర్లలో 20శాతం భారతీయులే అయినప్పటికీ వాటి తయారీలో పనిచేయగలిగిన సాంకేతిక నిపుణుల లేమి వేధిస్తోంది.సెమీకండక్టర్లకు అత్యవసరమైన ముడిసరకుల కోసమూ విదేశాల వైపు చూడాల్సి వస్తోంది. ఈ కీలక రంగాన్ని ఏలుతున్న దేశాలతో పోలిస్తే మన దగ్గర పరిశ్రమలకు ప్రోత్సాహకాలు తక్కువగా ఉంటున్నాయి. కండక్టర్ల సరఫరా గొలుసులో ప్రపంచానికి విశ్వసనీయ గమ్యస్థానంగా ఎదగాలన్న భారత్ కల నెరవేరాలంటే వీలైనంత వేగంగా సంబంధిత ఆవరణ వ్యవస్థను పటిష్ఠం చేసుకోవాలి. 2032 నాటికి విశ్వవ్యాప్తంగా 10 లక్షల మంది సెమీకండక్టర్ నిపుణులకు కొరత ఏర్పడుతుందన్న విశ్లేషణలను గమనంలో ఉంచుకుంటూ ఆ మానవ వనరుల సృష్టిపైనా సమధికంగా దృష్టిసారించాలి!. ●

# జీవ వైవిధ్య పరిరక్షణతోనే మానవాళి మనుగడ

రామ కిష్టయ్య సంగన భట్ల

ప్రపంచ వ్యాప్తంగా జులై 29న అంతర్జాతీయ పులుల దినోత్సవం నిర్వహిస్తారు. పులుల ఆవాసాల రక్షణ, విస్తరణకు ప్రోత్సహించడానికి, పులుల పరిరక్షణపై అవగాహన ద్వారా పొందే మద్దతుకోసం 2010 నుండి ప్రతి సంవత్సరం ఈ దినోత్సవం నిర్వహిస్తున్నారు.2010లో రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్ నగరంలో జరిగిన పులుల సంరక్షణ సమావేశంలో ఈ అంతర్జాతీయ పులుల దినోత్సవం ప్రకటించబడింది. పులుల సహజ ఆవాసాలను పరిరక్షించే విధంగా వ్యవస్థను ప్రోత్సహించడం, పులి సంరక్షణగురించి ప్రజలలో అవగాహన పెంచి వారినుండి సహాయాన్ని అందుకోవడం ఈ దినోత్సవ ముఖ్యోద్దేశ్యం. ఈ దినాన్ని పురస్కరించుకొని పులుల సంరక్షణ, వాటి సంతతి వృద్ధికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాల గురించి ప్రణాళికలు ప్రభుత్వాలు సిద్ధం చేసుకుంటాయి. పులులు ఎక్కువ కాలం తమ తల్లిదండ్రులపై ఆధారపడవు. తమ కాళ్లపై తాము నిలబడటానికి ఇష్టపడతాయి. రెండేళ్లు కాగానే విడిగా వెళ్లిపోతాయి. మగ పులులకు మూడేళ్ల తర్వాత సెక్సువల్ మెచ్యూరిటీ వస్తుంది. ఆడ పులులకు నాలుగేళ్ల తర్వాత అది వస్తుంది. పులులు 20 ఏళ్ల దాకా బతుకుతాయి. పులి పిల్లలు పుట్టినప్పుడు వాటికి కళ్లుకనపడవు. తమ తల్లినుంచి వచ్చే వాసనను బట్టీ తల్లిని అనుసరిస్తాయి. పులి పిల్లల్లో సగం ఆకలితో చనిపోతాయి. చలికి వాతావరణ పరిస్థితులకు తట్టుకోలేక చనిపోతాయి. ప్రతీ పులికీ చారలు వేర్వేరుగా ఉంటాయి. మనుషుల్లో ఏ ఇద్దరికీ ఒకేలాంటి వేలిముద్రలు ఉండనట్లే ఏ రెండు పులులకూ ఒకేరకమైనచారలు ఉండవు. పులులు బాగా ఈదగలవు. ఆహారం కోసం చాలా దూరం ఈదుతూ వెళ్లగలవు. సింహాలు గుంపులుగా జీవిస్తాయి. పులులు విడివిడిగా జీవిస్తాయి. ప్రతీ పులీ తన కంటూ ప్రత్యేక ప్రాంతాన్ని ఎంచుకుంటుంది. బాగా పెరిగిన పులి 140 కేజీల నుంచి 300 కేజీల దాకా ఉంటుంది. పులులు గంటకు 65 కిలోమీటర్ల వేగంతో పరుగెడతాయి. పులుల పాదాల కింద మెత్తగా ఉండి, నడిచేటప్పుడు శబ్దం రాదు. వేటాడేటప్పుడు నిశ్శబ్దంగా వచ్చి పరుగెడతాయి. పులిని, 1986 నుండి ఐయుసిఎన్ రెడ్ జాబితాలో అంతరించిపోతున్న జాబితాలో చేర్చారు. గత 100 సంవత్సరాలలో, 97 శాతం అడవి పులులను ప్రపంచం కోల్పోయింది. 20వ శతాబ్దపు ప్రారంభంలో పులి లెక్కింపులో లక్ష ఉన్నట్లు తెలగా, 2013లో 3274కు తరువాత 2014లో 3200 తగ్గిపోయాయి. మానవులు నగరాల విస్తరణ, వ్యవసాయం తదితర కారణాలవల్ల పులుల93శాతం మేర సహజ ఆవాసం కోల్పోయాయి. అంతేకాకుండా, మానవ వన్యప్రాణి సంఘర్షణ, వాతావరణ మార్పుకూడా పులులజనాభా క్షీణతకు, మనుగడ నష్టానికి కారణాలు. ప్రపంచ దేశాల్లో, అత్యధిక సంఖ్యలో 2226 పులులతో భారత దేశం ఉంది. భారత దేశం తర్వాత 500పులులతో మలేషియా అనుసరి



స్తున్నది. 2004 లో 440 పులులతో మూడో స్థానంలో ఉన్న బంగ్లాదేశ్, టైగర్ సెన్సస్ 2015లో 106కు పులుల జనాభా క్షీణతను చవిచూసింది. పులులు అంతరించిపోకుండా రక్షించడానికి 2010లో రష్యాలోని సెయింట్‌పీటర్స్‌బర్గ్ టైగర్ సమ్మిట్‌వద్ద పులుల దినోత్సవం నిర్వహించారు. జాతీయ పులుల సంరక్షణ ప్రాధికార సంస్థ (నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ ఎన్‌టీసీఏ) దేశవ్యాప్తంగా పులులను లెక్కిస్తుంది. రాష్ట్రాల్లోని అన్ని అడ వుల్లో నాలుగేళ్లకోసారి ఈ గణన జరుగుతుంది.వన్యప్రాణుల గణాంక సేకరణ దేశంలోని అన్ని అటవీ ప్రాంతాల్లో జరుగుతుంది. అటవీ సిబ్బంది రోజూ సుమారు నాలుగు కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లి, పులులతో పాటు ఇతర వన్యప్రాణుల ఆధారాలను అన్వేషిస్తారు. 2014 నుండి ఎన్‌టీసీఏ వన్యప్రాణుల లెక్కింపులో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన కెమెరాలను వాడుతోంది. వీటిని వన్యప్రాణులు తిరిగే ప్రదేశాల్లో ఎదురెదురుగా చెట్లకు అమరుస్తారు. ఒకటి నుంచి రెండు అడుగుల ఎత్తులో ఉంచే ఈ కెమెరాలు 24 గంటలూ వాటంతటవే పనిచేస్తాయి. చిత్రాల్లోని జంతువుల ఎత్తు, చారలు, నడకను పరిగణనలోకి తీసుకొని వాటి సంఖ్యను లెక్కగడతారు. భారత దేశంలో దాదాపు 3వేల పులులున్నాయని లెక్కలు చెపుతున్నాయి. పులుల ఆవాసానికి ప్రపంచంలోనే భారతదేశం అనువైన ప్రాంతం. దేశంలో క్రమంగా పులుల జనాభా పెరిగిపోతోంది.2006లో1,411, 2010లో 1,726, 2014లో 2,226 పులులుండగా, 2018లో ఆసంఖ్య 2,967కు చేరుకుంది. ప్రతి నాలుగేండ్లకు ఒకసారి పులుల గణనచేపడుతారు.2014లోఅవిభాజ్య ఆంధ్రప్రదేశ్‌లో పులుల సంఖ్య 68కాగా, 2018 నాటికి ఏపీ, తెలంగాణల్లో కలిపి వీటి సంఖ్య74కు చేరింది.ఏపీలో 48, తెలంగాణలో 26పులులున్నట్లు రికార్డులు చెపుతున్నాయి. దేశంలోని అతిపెద్ద అభయారణ్యాల్లో ఒకటైన నాగార్జునసాగర్ శ్రీశైలం పులుల అభయారణ్యంలో 2006లో 95 పులులుండేవి. 2010లో వీటి సంఖ్య 72కు, 2014 నాటికి 68కి తగ్గింది. అయితే, 2018 లెక్కల్లో ఈ సంఖ్య పెరిగింది. రాచఠీవికి పెట్టింది పేరైన పులి భారతదేశ జాతీయ జంతువు. 1972లోనే పులిని జాతీయ జంతువుగా ప్రకటించిన భారత్ మరుసటి ఏడాది టైగర్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించింది. పులుల్ని వేటాడే వారికి కఠిన శిక్షలుపడేలా చట్టాలు తెచ్చింది. వాటి సంరక్షణ కోసం భారీగా ఖర్చు చేస్తోంది. దేశంలో 48 పులి అభయారణ్యాలను ఏర్పాటు చేశారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా ఆలిండియా టైగర్ ఎస్టిమేషన్ రిపోర్ట్ ప్రకారం తెలంగాణ అడవుల్లో 26 పులులు ఉన్నట్లు తేలింది. గతంలో 20 పులులు ఉన్నట్లు ఓ అంచనా ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం, అటవీశాఖ చేపట్టిన అటవీ రక్షణ చర్యలవల్లే పులుల సంఖ్య పెరిగేందుకు దోహద పడ్డాయి. తెలంగాణలో పులులసంఖ్య పెంచే కార్యక్రమాలను రాష్ట్ర అటవీశాఖ ఆధ్వర్యంలో చర్యలు చేపడుతున్నారు. రాష్ట్రంలో కవ్వాల్, ఆమ్రాబాద్ రెండు అభయారణ్యాలున్నాయి. రాబోవు రోజుల్లో పులుల అభివృద్ధికి మరిన్ని కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడమే కాకుండా వాటి రక్షణ కోసం వ్యవస్థను కట్టుదిట్టం చేయడానికి, చర్యలు తీసుకుంటున్నారు. పులి చర్మం, గోళ్ల కోసం వాటిని చంపే వారి పట్ల శిక్షలను కఠిన తరం చేసేందుకు కార్యాచరణ అనుసరిస్తున్నారు. ●

# ప్రజావాక్కు



## మద్రాస్ హైకోర్టు తీర్పు అభినందనీయం

ఏదైనా ప్రమాదంలో చనిపోయిన వారికి ప్రభుత్వంలో ఉద్యోగం ఇస్తాం, ఆదుకుంటాం అనడం మన నాయకులకు అలవాటైపోయింది. ఆదుకుంటాం అనడంలో అర్థముంది. ప్రభుత్వ ఉద్యోగం ఇస్తాం అనడం మాత్రం కరెక్ట్ కాదు. మనరాజ్యంగం 14వ ఆర్టికల్‌లో స్పష్టంగా చట్టం ముందు అందరూ సమానులే అని ఉంది. భారత దేశంలోఎక్కడా ఏవ్యక్తికి చట్టపరమైన సమనత్వాన్ని, రక్షణలను కల్పించటంలో సమానత్వాన్ని రాజ్యం నిరాకరించరాదు.మరి ఇలా ఈకుటుంబలవారికిప్రభుత్వ ఉద్యోగం ఇస్తామనడం చట్ట విరుద్ధం.ఇదే విషయాన్ని మద్రాస్ హైకోర్టు స్పష్టంగాచెప్పింది.'గతంలో తమిళనాడు విజయ్ సభలో చనిపోయినవారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగమిస్తాము అన్న హామీలు రాజ్యాంగ విరుద్ధం, పరీక్షలు పెట్టి అర్హులకు ఇవ్వాలి'. మద్రాస్ హైకోర్టు తీర్పు అభినందనీయం. ఈతీర్పు అన్ని రాష్ట్రాలకు వర్తిస్తుంది.మరి మన నాయకులు చనిపోయిన వారికుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తాం అనడం పరిపాటి అయిపోయింది. కనుక ఇక నుండి ఇలాంటి సందర్భాలలో అలాంటి చట్టవిరుద్ధమైన హామీలు ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

## మీసేవ ద్వారా హాజరు కల్పించాలి

కూలీనాలీ చేసుకుని చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ బతుకువెళ్లతీసే ఎందరో ముద్దాయిలుగా ఆయా కేసులలో న్యాయ స్థానాలకుహాజరైన సందర్భాలలోఉపాధిని కోల్పోతుంటారు.తుదితీర్పు రోజు వెలువడే రోజు మినహా ప్రతి సారిమీసేవ వంటివాటి సహాయంతో వర్చువల్‌గా హాజరు నమోదుకల్పిస్తే నిజమైన నిర్దోషులకు సాయంగా ఉంటుంది. ఎందరో సెలబ్రెటీలు పొందుతున్న ఈ సౌకర్యం సామాన్యులకెందుకు వర్తింపచేయకూడదో ఆలోచించాలి.

- వి.ఆర్.ఎ.రాజు, హైదరాబాద్

## ఖాళీ సీట్లను భర్తీ చేయాలి

గురుకులాల్లో పని చేస్తున్న లెక్చరర్స్, టీచర్స్,నాన్ టీచింగ్ స్టాఫ్ వారి పిల్లలకు కూడా గురుకులాల్లో సీట్లు కల్పించాలి.ఖాళీగాఉన్న సీట్లను భర్తీచేయాలి. ప్రతి గురుకులం ప్రతి తరగతిలో సంవత్సరం మొత్తం సీట్లు మిగిలి ఉంటున్నాయి. వృధాగా ఉండే కంటే గురుకులాల్లో పని చేస్తున్న వారి పిల్లలకు ఇవ్వాలి.మొత్తం సీట్లు ఈ 2026-2027 నూతన విద్య సంవత్సరంలో భర్తీ చేయాలి.

-కదురు శ్రీనివాస్, వరంగల్

## ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలి

పోటీపరీక్షలు లక్షలాదిమంది విద్యార్థుల జీవితాలను ప్రభావితం చేస్తాయి. అలాంటి పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీ జరగడం వల్ల నిజాయితీగా శ్రమించిన అభ్యర్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడుతుంది. ఈ నేపథ్యంలో ప్రశ్నపత్రాల లీకేజీ కేసుల విచారణకోసం ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలన్న నిర్ణయం ఎంతో స్వాగతించదగ్గది. ఇలాంటి కేసుల్లో వేగవంతమైన విచారణ నిందితులకు త్వరగా శిక్ష పడేలా చేయడమే కాకుండా, పరీక్షా వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసాన్ని పునరుద్ధరించడంలో కూడా కీలక పాత్ర పోషిస్తుంది. చాలా సందర్భాల్లో దర్యాప్తు, న్యాయ ప్రక్రియలు సంవత్సరాల పాటు సాగుతుంటాయి.దీనివల్ల పరీక్షలురాసిన అర్హులైనఅభ్యర్థులుతీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతారు. వారి విద్య, ఉద్యోగ అవకాశాలు ఆలస్యమవుతాయి. మరోవైపు నేరస్థులకు చట్టంపై భయం తగ్గే ప్రమాదం కూడా ఉంటుంది. అందువల్ల వేగవంతమైన న్యాయ ప్రక్రియఅవసరం. పరీక్షా నిర్వహణలో అత్యాధునిక భద్రతా వ్యవస్థలు,డిజిటల్ పర్యవేక్షణ, ప్రశ్నపత్రాల రవాణా, నిల్వప్రక్రియల్లో కట్టుదిట్టమైన రక్షణచర్యలుఅమలు చేయాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## సరైన ఎంపి!

వీవీఎస్ లక్ష్మణ్‌ను భారత క్రికెట్ జట్టు హెడ్‌కోచ్‌గా నియమించాలని అభిమానులు కోరుతున్నారు. తాత్కాలిక కోచ్‌గా 7 ద్వైపాక్షిక సిరీస్‌లలో 6 విజయాలు అందించడంతో పాటు ఆసియా క్రీడల్లో భారత్‌కు స్వర్ణ పతకం అందించారు. యువ ఆటగాళ్లను ఒత్తిడి లేకుండా ప్రోత్సహించి వారి ప్రతిభను వెలికితీయడంఆయన ప్రత్యేకత.సీనియర్లు,జూనియర్లు అందరినీ సమానంగా గౌరవిస్తూ జట్టులో ఐక్యతను పెంపొందిస్తారు. ఆయన కోచింగ్ విధానం జట్టుకు సానుకూల వాతావరణాన్ని తీసుకువస్తుందని క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి. గంభీర్ కంటే లక్ష్మణ్ మార్గదర్శకత్వంలో యువ ఆటగాళ్లు మెరుగ్గా రాణిస్తున్నారనే అభిప్రాయం క్రికెట్ వర్గాల్లో ఉంది.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

## ఉద్యోగులు విధిగా విధులు నిర్వహించాలి

ప్రభుత్వ ఉద్యోగులు ప్రత్యేకంగా పంచాయతీ కార్యదర్శులు పని వేళలో సక్రమంగా సమయపాలన పాటిస్తూ విధులు నిర్వహించాలి. వాళ్లకు కేటాయించిన ఊర్లోనే ఉంటూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలి. ఎక్కడ అందుబాటులో లేకపోయినాపై అధికారులకు ఫిర్యాదు చేయండి. విధుల నుండి తొలగించే అవకాశం లేకపోలేదు.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

29-7Pg5.qxd:29-7Pg5.qxd 1/1/02 6:25 AM Page 1



# విద్యార్థుల నిరసనల హింసపై సిట్




## రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో విచారణ: సుప్రీం కోర్టు

### కేంద్రం, ఢిల్లీ, బీహార్, బెంగాల్, అసోం, కేరళం రాష్ట్రాలకు నోటీసులు

### నేర చరిత్ర లేని నిర్బంధిత మైనర్ల విడుదలకు ధర్మాసనం ఆదేశం

**న్యూఢిల్లీ, జులై 28:** గతవారం దేశవ్యాప్తంగా జరిగిన విద్యార్థుల నిరసనల సందర్భంగా విద్యార్థులు, పోలీసు అధికారులు గాయపడ్డారన్న ఆరోపణలపై నిష్పక్షపాతమైన, స్వతంత్ర విచారణ జరగాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఈ విచారణ కోసం సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి నేతృత్వంలో ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉందని కోర్టు సూచించింది. ఈ విషయంపై తమ స్పందన తెలియజేయాలని కేంద్ర ప్రభుత్వంతో పాటు ఢిల్లీ, అసోం, బీహార్, పశ్చిమ బెంగాల్, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కేరళ రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీచేసింది. నిరసనలలో పాల్గొన్నందుకు అరెస్టు చేయబడిన లేదా నిర్బంధించబడిన, ఎలాంటి నేర చరిత్రలేని 18 యేళ్ల లోపు పిల్లల విడుదలకు సంబంధించి కోర్టు ముఖ్యంగా పలు మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. అన్ని సిసిటివి ఫుటేజ్, డ్రోన్ ఫుటేజ్, బాడీవోర్న్ కెమెరా రికార్డింగ్‌లు, వైర్‌లెస్ కమ్యూనికేషన్, పిసిఆర్ లాగ్‌లను భద్రపరచాలని కోర్టు ఆదేశించింది. అంతేకాకుండా, నిరసనకారుల వ్యక్తిగత సమాచారం, డిజిటల్ డేటాను భద్రపరచాలని, ప్రస్తుతానికివాటిని బహిరంగంగా వెల్లడించకూడదని రాష్ట్రాలను కోర్టు ఆదేశించింది. నిరసనకారుల వ్యక్తిగత డేటా లేదా వివరాలను ప్రచురించకూడదు. విద్యార్థులకు ఎలాంటి నేర చరిత్ర లేనంత వరకు, నిరసనల విషయంలో వారిపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోకూడదని కూడా కోర్టు ఆదేశించింది. జులై 20నుంచి దేశవ్యాప్తంగా పరీక్షాపత్రాల లీకేజీలు, ఇతర వ్యవస్థాగత అవకతవకలకు వ్యతిరేకంగా నిరసనలు చేస్తున్న విద్యార్థులపై పోలీసులు క్రూరంగా ప్రవర్తించారని ఆరోపిస్తూ దాఖలైన పలు పిటిషన్లను భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం విచా రించింది. గాయపడిన పోలీసు అధికారులు, మీడియా ప్రతినిధుల తరఫున దాఖలైన పిటిషన్లను కూడా కోర్టు విచారించింది. "పిటిషనర్లు చేసిన ఆరోపణలు ప్రాథమికంగా స్వతంత్ర, నిష్పక్షపాత విచారణకు ఆస్కారం కల్పిస్తున్నాయి. అటువంటి విచారణ ఆరోపణలను సమం్ధవంతంగా పరిష్కరిస్తుంది" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ పిటిషన్లను తదుపరి విచారణ ఆగస్టు 3కు వాయిదా వేసింది.

## నీట్ ఇడబ్ల్యుఎస్ కోటాపై సుప్రీం కీలక ఆదేశాలు

### వార్షిక కుటుంబ ఆదాయం సహేతుకంగా లేదని వ్యాఖ్య

**న్యూఢిల్లీ, జులై 28:** నీట్ ప్రవేశాల కోసం ఆల్ ఇండియా కోటా (ఎఐక్యూ)లో ఆర్థికంగా బలహీన వర్గాల (ఇడబ్ల్యుఎస్) రిజర్వేషన్ కింద అర్హతను నిర్ణయించడానికి నిర్దేశించిన రూ.8 లక్షల వార్షిక కుటుంబ ఆదాయ ప్రమాణాన్ని సవాలు చేయడాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఈ పరిమితి ప్రాథమికంగా సహేతుకమైన ప్రమాణంగా కనిపిస్తోందని వ్యాఖ్యానించింది. పాండే కమిటీ సిఫార్సుల మేరకు రూపొందించిన రూ.8 లక్షల వార్షిక ఆదాయ పరిమితి, ప్రమాణాల రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను మంగళవారం జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ అలోక్ అరధేలతో కూడిన ధర్మాసనం విచారించింది. విచారణ సందర్భంగా నీట్ ఈడబ్ల్యూఎస్ కోటా ఆదాయ పరిమితిపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. నీట్ ఆలిండియా కోటాలో ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్ల అర్హతకు నిర్దేశించిన రూ.8 లక్షల వార్షిక కుటుంబ ఆదాయ పరిమితి ప్రాథమికంగా సమంజసంగానే ఉందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఏ ప్రాతిపదికన మీరు దీన్ని సవాలు చేస్తున్నారు? అని పిటిషనర్లను ధర్మాసనం ప్రశ్నించింది. పాండే కమిటీ సిఫార్సు చేసిన మార్పులను కేంద్ర ప్రభుత్వం ఇంకా పూర్తిగా అమలు చేయలేదని పిటిషనర్ల తరఫు న్యాయవాది తన్వీ దూబే కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దేశవ్యాప్తంగా దాఖలైన ఇలాంటి పిటిషన్లన్నింటినీ క్రోడీకరించి, వాటిలోని ప్రధానాంశాలతో ఒక సమగ్రమైన చార్ట్ తయారు చేయాలని ధర్మాసనం తన్వీ దూబేను ఆదేశించింది. తదుపరి విచారణను కోర్టు ఆగస్టు 11వ తేదీకి వాయిదా వేసింది.

## కోర్టు విచారణ విడియోలను అనుమతి లేకుండా సోషల్ మీడియాలో పోస్టు చేస్తే కఠిన చర్యలు: సుప్రీంకోర్టు హెచ్చరిక

**న్యూఢిల్లీ, జులై 28:** సుప్రీంకోర్టు లేదా సంబంధిత హైకోర్టు నుండి ముందస్తు అనుమతి లేకుండా, కోర్టు విచారణల ఆడియో, వీడియో రికార్డింగ్‌లను సోషల్ మీడియా, ఇతర డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లలో పోస్ట్ చేయడం, రీపోస్ట్ చేయడం, అప్‌లోడ్ చేయడం, ప్రసారం చేయడం లేదా నిల్వ చేయడాన్ని సుప్రీంకోర్టు నిషేధించింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వును జారీ చేసింది. అయితే, ఈ ఉత్తర్వు న్యాయపరమైన విచారణల నిష్పక్షపాతమైన, కచ్చితమైన వార్తా నివేదనను ప్రభావితం చేయదని కోర్టు స్పష్టం చేసింది. సోషల్ మీడియాలో ఎడిట్ చేసి, కత్తిరించిన వీడియోలను ప్రచారం చేయడం ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయబడిన కోర్టు విచారణలను దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలకు సంబంధించిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిఐఎల్)పై విచారణ జరుపుతూ, భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, న్యాయమూర్తులు జయమాల్య బాగ్చి మరియు వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలను జారీ చేసింది. ఈ పిటిషన్‌పై కేంద్ర ప్రభుత్వంతోపాటు ప్రతివాదులకు ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. అయితే, మీడియా సంస్థలకు మాత్రం కోర్టు కేసులపై రిపోర్టింగ్ చేయడంపై ఎలాంటి ఆంక్షలు ఉండవని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది.

## ఎక్కువ కెఫిన్ ఉన్న పానీయాలు ఎనర్జీడ్రింక్స్‌గా బ్రాండింగ్ చేయొద్దు: ఎఫ్ఎస్ఎస్ఎఐ హెచ్చరికలు

**న్యూఢిల్లీ,జులై 28:** అధిక కెఫిన్ కలిగిన పానీయాలను ఎనర్జీ డ్రింక్స్‌గా ప్రచారం చేయవద్దని భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఎఐ) కీలక ఆదేశాలు జారీ చేసింది. పెప్సీ, రెడ్ బుల్, మాన్‌స్టర్ బెవరేజ్, రిలయన్స్, హెల్ ఎనర్జీ వంటి ప్రముఖ కంపెనీలు తమ ఉత్పత్తుల లేబుళ్ల నుంచి ఎనర్జీ డ్రింక్ అనే పదాన్ని, దానికి సంబంధించిన వర్ణనలను 90రోజుల్లోగా తొలగించాలని స్పష్టం చేసింది. భారత్‌లో ఎనర్జీ డ్రింక్స్ పేరిట విక్రయిస్తున్న ఉత్పత్తులకు సంబంధించి ఎటువంటి అధికారిక ప్రమాణాలు లేవని ఎఫ్ఎస్ఎస్ఏఐ పేర్కొంది. ఇటీవల పరిశ్రమ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఎఫ్ఎస్ఎస్ఏఐ సీఈఓ రజిత్ పున్హానీ ఈ అంశంపై స్పష్టతనిచ్చారు. ఈ క్రమంలో నిబంధనలకు కట్టుబడి ఉంటామని కంపెనీలు అంగీకరించడంతో, లేబుళ్ల మార్పునకు సంబంధించి ప్రభుత్వం 90 రోజుల గడువు ఇచ్చింది.

# విద్యాశాఖ బాధ్యతలు జోషికి ఎలా ఇస్తారు?

### అత్యాచార నిందితులను సమర్థించే వ్యక్తికి ఆపదవి ఇవ్వడమా?: రాహుల్ ఫైర్

### విద్యార్థులపై గన్స్ పేల్చమని ఆదేశించిందెవరు: ప్రియాంక

**న్యూఢిల్లీ,జులై 28:** నూతన కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిపై ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. అత్యాచార నిందితులను సమర్థించే వ్యక్తిని విద్యాశాఖ మంత్రిగా నియమించడం ఆశ్చర్యకరమని వ్యాఖ్యానించారు. పార్లమెంట్ ప్రాంగణంలో రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడారు విద్యార్థుల నిరసనల నేపథ్యంలో ప్రధాని మోదీ ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖ బాధ్యతలు అప్పగించిన నిర్ణయాన్ని ప్రశ్నించారు. దేశంలో యువత విద్యా వ్యవస్థపై నిరసనలు వ్యక్తం చేస్తోంది. ఎంతో మంది విద్యార్థినులు ఆందోళనల్లో పాల్గొన్నారు. వారిపై దాడులు జరిగాయి. అలాంటి సమయంలో అత్యాచార నిందితులను సమర్థించే వ్యక్తిని బీజేపీ విద్యాశాఖ మంత్రిగా నియమించింది. అలాంటి వ్యక్తి కంటే నీచమైన వ్యక్తి మరొకరు ఉండరు. అత్యాచార నిందితులకు రక్షణ కల్పించాలనే వ్యక్తే ఇప్పుడు భారత విద్యాశాఖ మంత్రి అని రాహుల్ గాంధీ ఆరోపించారు.



అంతేకాకుండా ప్రధాని మోడీ నిర్ణయంపై కూడా విమర్శలు చేశారు. ప్రధాని స్పందన చాలా విచిత్రంగా ఉంది. ఆయన మంత్రి వర్గంలో ఎంతో మంది మంత్రులు ఉన్నారు. వారిలో ఎవరినైనా ఎంపిక చేసుకోవచ్చు. కానీ అత్యాచార నిందితులను రక్షించే వ్యక్తినే ఎంపిక చేశారు. ఇది నిజంగా ఆశ్చర్యకరమైన విషయమని అన్నారు. రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వం లేదా ప్రహ్లాద్ జోషి నుంచి అధికారిక స్పందన వెలువడలేదు.

**పార్లమెంటులో జోషిపై ప్రియాంక సంచలన విమర్శలు:** ఇదిలా ఉంటే పార్లమెంటులో నీట్ అక్రమాల కట్టడి బిల్లుపై జరుగుతున్న చర్చలో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ, విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. గర్భవతిపై అత్యాచారం చేసిన నిందితుల్ని ఆయన సమర్థించారని ఆరోపించారు. అత్యాచార నిందితులకు బెయిల్ వస్తే ఆయన ఆనందించారన్నారు. ఈ వ్యాఖ్యల్ని కేంద్ర మంత్రి కిరెన్ రిజిజు తీవ్రంగా ఖండించారు. ప్రియాంకా గాంధీ వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. ఇదిలాఉంటే, ప్రధానిపై కూడా ప్రియాంకాగాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధాని కెమెరా యాంగిల్‌కాదు, మనసు యాంగిల్ మార్చుకోవాల న్నారు. ఇన్‌స్టాగ్రామ్ క్లిప్ కోసం కెమెరా యాంగిల్ మార్చినంత మాత్రాన జెన్ జీ నమ్మకాన్ని గెలుచుకోలేరని అన్నారు. నిరసన తెలుపుతున్న విద్యార్థులపై ఏకే 47, పెల్లెట్ గన్స్ కాల్చుమని ఎవరు ఆదేశించారని ప్రధాని మోడీని, అమిత్ షాను ప్రశ్నించారు.

# బీహార్, అసోంలో నీట్ అల్లర్లకేసులు ఎత్తివేత

### ఢిల్లీ నిరసనలపై ఎన్‌హెచ్‌ఆర్‌సి సీరియస్

**పాట్నా,గువాహతి,జులై 28:** పరీక్షా పత్రం లీకేజీ అవకతవకలపై ఆందోళనలు చేపట్టిన విద్యార్థులకు ఊరట లభించింది. నిరసనకారులపై నమోదైన కేసులను బీహార్, అస్సాం ప్రభుత్వాలు ఉపసంహరించుకున్నాయి. అరెస్టయిన వారిని విడుదల చేయాలని, భవిష్యత్తులో ఎలాంటి చర్యలు ఉండవని నిర్ణయించాయి. నీట్ ఆందోళనలకు సంబంధించి నిరసనకారులపై నమోదు చేసిన కేసులన్నింటినీ ఉపసంహరించుకుంటామని, వివిధ ఆరోపణల కింద జైలు పాలైన వారిని విడుదల చేస్తామని బీహార్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర హోం శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. ఈనెల 26న సాయంత్రం 6 గంటలకు ముందు జరిగిన నిరసనల్లో పాల్గొన్న ఏ వ్యక్తిపైనా ప్రభుత్వం ఎటువంటి చట్టపరమైన చర్యలు తీసుకోదని పేర్కొంది. అలాగే అస్సాంలో 26 నాటికి నమోదైన 5



కేసుల్లో అరెస్టైన 13 మందితో పాటు, ఇరు రాష్ట్రాల్లో అదుపు లోకి తీసుకున్న నిరసనకారులను తక్షణమే విడుదల చేయాలని ఆదేశించారు. ఈ అంశంపై కాక్రోచ్ జనతా పార్టీ ప్రతినిధులతో చర్చించిన కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులు స్పష్టమైన హామీ ఇచ్చారు. అస్సాం, బీహార్ తరపులోనే రాజస్థాన్‌లోనూ విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించుకుంటామని తెలిపినట్లు సీజేపీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ వెల్లడించారు.

**ఎన్‌హెచ్‌ఆర్‌సీ సీరియస్:** నీట్‌యూజీ పరీక్ష పేపర్ లీకేజీపై ఢిల్లీలోని జంతర్ మంతర్‌లో విద్యార్థులు చేపట్టిన నిరసనలో విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జ్ చేయడం పట్ల జాతీయ మానవహక్కుల కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు లాఠీచార్జ్ ఘటనను సుమోటోగా స్వీకరించింది. ఘటన సమయంలో సీసీటీవీ ఫుటేజ్ అందజేయాలని సంబంధింత అధికారులను ఆదేశించిది. రెండు వారాల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని ఢిల్లీ పోలీసులకు నోటీసులు జారీ చేసింది.

# ప్రధాని కోసం ధర్మేంద్ర ప్రధాన్ బలయ్యారు

### లోక్‌సభలో ఎస్‌పి అధినేత అఖిలేష్ యాదవ్

**న్యూఢిల్లీ,జులై 28:** పార్లమెంట్‌లో మంగళవారం యాంటీ పేపర్ లీక్ బిల్లుపై వాడీవేడి చర్చ నడుస్తోంది. ప్రతిపక్షాలు బీజేపీని విమర్శిస్తున్నాయి. సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) అధినేత అఖిలేష్ యాదవ్ మాట్లాడుతూ ప్రధాన్‌ను తొలగించి ప్రధాన మంత్రిని కాపాడారు అంటూ సెటైర్లు వేశారు. ప్రధాని కోసం ధర్మేంద్ర ప్రధాన్‌ను బలిపశువు చేసినట్లు ఆరోపించారు. విద్యార్థి ఉద్యమం ప్రభుత్వం మెడలు వచ్చిందని అన్నారు. రాజీనామా తర్వాత ధర్మేంద్ర ప్రధాన్ పార్లమెంట్‌కు వచ్చినప్పుడు బీజేపీ ఎంపీలు ఘనంగా స్వాగతించాయని, ఆయన తొలగింపు



ఎంత పెద్ద సంక్షోభం నుంచి బయపడేసిందో ఊహించండి అని అఖిలేష్ వ్యాఖ్యానించారు. ప్రభుత్వాన్ని తల వంచేలా చేసిన యువత ధైర్యసాహసాలను అఖిలేష్ ప్రశంసించారు. ప్రపంచం వంగుతుంది, దానిని వంచే వ్యక్తి ఉండాలి. ప్రభుత్వం ఎప్పటికీ తలవంచదనను కుంది, కానీ యువత ఐక్యత ముందు ప్రభుత్వం వెనక్కి తగ్గి మంత్రితో రాజీనామా చేయించింది అని అన్నారు. తల్లిదండ్రుల మద్దతు పొందిన తొలివిద్యార్థి ఉద్యమం ఇదే అని ఆయన అన్నారు. ప్రభుత్వం భయపడినప్పుడే డిమాండ్లను అంగీకరిస్తుందని, రైతుల ఉద్యమ సమయంలో ఎన్నికలు సమీపించడంతో మూడు వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకుందని గుర్తు చేశారు. బీజేపీ అధికారంలో వచ్చిన తర్వాత విద్యా వ్యవస్థ,యూనివర్సిటీలనను దెబ్బతీసిం దని ఆయన ఆరోపించారు. విద్యావ్యవస్థకు ఒకే రంగు వేయాలని బీజేపీ ప్రయత్నించిందని, అందుకే విద్యార్థుల్లో ఆగ్రహం పెరిగిందని, భారీ ఉద్యమంగా మారిందని,చివరకు ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీ కూడా వెనక్కి తగ్గాల్సి వచ్చిందని అన్నారు. దళితులు, వెనకబడిన వర్గాల ఉద్యోగ హక్కుల్ని ప్రభుత్వం హరిస్తుందని ఆరోపించారు.

## కృత్రిమ సూర్యుడి కోసం అతిపెద్ద అయస్కాంతం ఆవిష్కరించిన చైనా

**బీజింగ్, జులై 28:** సమస్త జీవకోటికి ఆధారం, గ్రహాల్లో ప్రధానం సూర్యుడు. అలాంటి సూర్యుడిని కృత్రిమంగా సృషించాలని చైనా భావిస్తున్నది. దీనిలో భాగంగా ప్రపంచంలోనే అతిపెద్ద సూపర్ కండక్టింగ్ ఫ్యూజన్ అయ స్కాంతాన్ని రూపొందించింది. విజయవంతంగా పరీక్షించింది. దీనిలో ఉన్న టెక్నాలజీ ప్రపం చంలోని విద్యుత్ అవసరాలను తీర్చేందుకు ఉప యోగపడుతుందని సైంటిస్టులు భావిస్తున్నారు. చైనా కృత్రిమ సూర్యుడి ప్రాజెక్టులో భాగంగా 2030 నాటికి ఫ్యూజన్ ద్వారా విద్యుత్ అవసరాలను తీర్చేందుకు ప్రపంచంలోనే అతిపెద్ద 582 టన్నులు గల అయస్కాంతాన్ని రూపొం దించింది. అణు సంలీనం ద్వారా అపరిమితమైన శక్తిని ఉత్పత్తి చేయడానికి ఈ అతిపెద్ద అయ స్కాంతం కీలకం. దీన్ని విజయవంతంగా పరీక్షించి కృత్రిమ సూర్యుడిని సృష్టించాలనుకున్న చైనా లక్ష్యానికి ముందడుగు పడినట్లు అయ్యింది. 21 మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పు గల 'డి' ఆకారంతో ఈ అయస్కాంతాన్ని చైనీస్‌అకాడమీకి చెందిన ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్మా ఫిజిక్స్ అభివృద్ధి చేసింది.

**కృత్రిమ సూర్యుడు అంటే?** అచ్చం సూర్యుడి లాగే పనిచేసే న్యూక్లియర్ ఫ్యూజన్ రియాక్టర్‌ను కృత్రిమంగా నిర్మించడం. సూర్యుడిలో 100 మిలియన్ డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత వద్ద ప్రతి క్షణం కొన్ని కోట్ల హైడ్రోజన్ అణువులు సంలీనం



చెంది కార్బన్ డయాక్సైడ్ రహిత అపారమైన శక్తి విడుదలవుతుంది. ఇలాంటి ప్రక్రియనే భూమిపై సృష్టించి విద్యుత్‌గా మారిస్తే స్వచ్ఛమైన, సురక్షితమైన, పర్యావరణహితమైన శక్తిని పొందవచ్చు.

## భార్యను హత్యచేసి అత్తమామలకు విడియో కాల్‌లో చూపించిన భర్త

**భాగల్‌కోట్,జులై 28:** కర్ణాటకలో ఒక కిరాతక ఘటన చోటుచేసుకుంది. కట్టుకున్న భార్యను అతి దారుణంగా హత్య చేయడమే కాకుండా, ఆమె ప్రాణాలు విడుస్తున్న దృశ్యాలను నిందితుడు వీడియో కాల్ ద్వారా అత్తమామలకు చూపించాడు. బాగల్‌కోట్ జిల్లాలో వెలుగుచూసిన ఈ అమానుష ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి విచారణ జరుపుతున్నారు. వివరాల్లోకి వెళితే, బిళగి పోలీస్ స్టేషన్ పరిధిలోని గలగలి గ్రామానికి చెందిన ప్రవీణ్ జిగలూర్, భాగ్యశ్రీ (23) దంపతులు. భార్యపై అనుమానంతో ప్రవీణ్ తరచూ గొడవ



పడేవాడు. భర్త వేధింపుల తాళలేక భాగ్యశ్రీ రెండు నెలల క్రితమే పుట్టింటికి వెళ్లిపోయింది. గతాన్ని మర్చిపోయి అన్యోన్యంగా ఉందామని నమ్మబలికిన ప్రవీణ్ ఆదివారం ఆమెను తిరిగి తన ఇంటికి తీసుకువచ్చాడు. ఇంటికి వచ్చిన అదే రోజు సాయంత్రం ఆమెపై దాడి చేసి అత్యంత దారుణంగా హత్య చేశాడు. అంతటితో ఆగకుండా, ఆమె మరణిస్తున్న చివరి క్షణాలను మొబైల్‌లో రికార్డ్ చేయడమే కాకుండా, నేరుగా ఆమె తల్లిదండ్రులకు వీడియో కాల్ చేసి చూపించినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం ఆ వీడియోను మరికొందరికి కూడా షేర్ చేసినట్లు సమాచారం. సమాచారం అందుకున్న పోలీసులు తక్షణమే ఘటనా స్థలానికి చేరుకుని నిందితుడు ప్రవీణ్‌ను అదుపులోకితీసుకున్నారు. తల్లిదండ్రులు ఆవేదన చూసి స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.




## ఐరోపాను నవంబరు దాకా దహించనున్న కార్చిచ్చు

### స్పెయిన్‌లో లక్షా 25 వేల ఎకరాలకుపైగా అటవీప్రాంతం అగ్నికి ఆహుతి

**ప్యారిస్, జులై 28:** ఫ్రాన్స్, స్పెయిన్ సరిహద్దుల్లోని అటవీ ప్రాంతంలో కార్చిచ్చు విధ్వంసం సృష్టిస్తోంది. ఇప్పటి వరకు ఫ్రాన్స్‌లో 420 చదరపు కిలోమీటర్లకు పైగా,స్పెయిన్‌లో 1,25,000 ఎకరాలకు పైగా అటవీ ప్రాంతం అగ్నికి ఆహుతైంది. గిరాండ్ ప్రాంతంలో కోట్ల విలువ చేసే 240కిపైగా విలాసవంతమైన ఇళ్లు కాలి బూడిదయ్యాయి. ఫ్రాన్స్‌లో ఈ భారీ కార్చిచ్చు నవంబరు మొదటి వారం వరకూ కొనసాగవచ్చని యూరోపియన్ యూనియన్ అధికారులు హెచ్చరించారు. ఐరోపాలో అగ్నికీలల వల్ల ఈ యేడాది అత్యంత ఘోరమైన సంవత్సరాలలో ఒకటిగా నిలిచిపోతుందన్నారు. ఈ వారం ఉష్ణోగ్రతలు మళ్లీ పెరుగుతుండడంతో ఫ్రాన్స్, స్పెయిన్, గ్రీస్‌లలో కార్చిచ్చుల ప్రమాదం మరింత పెరిగే అవకాశం ఉందన్నారు.

**అగ్ని సుడిగుండాలు వచ్చే ప్రమాదం**

శుక్రవారం సాయంత్రం ఫ్రాన్స్, స్పెయిన్ సరిహద్దుల్లో ప్రారంభమైన ఈ అగ్నికీలలు పలు నగరాలకు వేగంగా వ్యాపిస్తున్నాయి. దీంతో ఫ్రాన్స్‌పై భారీ పొగ మేఘాలు కమ్ముకున్నాయి. దీంతో వీటిని ఆర్పడం సవాలుగా మారింది. కార్చిచ్చును ఎదుర్కోవడానికి యూరోపియన్ కమిషన్ సమన్వయంతో ఫ్రాన్స్‌కు ఏడు అగ్నిమాపక విమానాలు, నాలుగు హెలికాప్టర్లు, స్పెయిన్‌కు ఆరు విమానాలు, మూడు అగ్నిమాపక బృందాలను పంపారు. భారీగాలులు, ఉరుములు, మెరుపులతో ఇవి అగ్ని సుడిగుండాలుగా మారే ప్రమాముందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

**రోడ్లపైకి జంతువులు :** మంటలు వేగంగా వ్యాపిస్తుండడంతో ఫ్రాన్స్‌లో సుమారు 2లక్షల మంది, స్పెయిన్‌లో లక్ష మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అడవుల్లోని జంతువులు మంటల వేడిని తాళలేక రోడ్లపైకి పరుగులు తీస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. పెంపుడు జంతువులను కూడా ప్రజలు బయటకు వదిలేస్తున్నారు. రాబోయే రెండు వారాల్లో పరిస్థితులు మరింత కఠినంగా ఉంటాయని వీటిని కలిసికట్టుగా ఎదుర్కోవాలని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేట్ మెక్రాన్ ప్రజలకు పిలుపునిచ్చారు. అగ్నికీలలు ఆర్పడానికి వేలమంది సిబ్బంది పనిచేస్తున్నారని, వందల సంఖ్యలో హెలికాప్టర్లతో నీళ్లు వెదజల్లుతున్నారని తెలిపారు. దేశంలోని అనేకప్రాంతాల్లో ప్రజలు గాలి కాలుష్యం సమస్యను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

## రూ.52,676 కోట్ల పరిహారానికి అంగీకారం

**న్యూయార్క్, జులై 28:** తమ బేబీ పౌడర్, ఇతర టాల్క్ ఉత్పత్తులు అండాశయ క్యాన్సర్‌కు కారణమవుతున్నాయని ఆరోపిస్తూ దాఖలైన పదివేల వ్యాజ్యాలను పరిష్కరించేందుకు 5.5 బిలియన్ డాలర్ల (రూ.52,676 కోట్లు) పరిష్కారానికి చేరుకున్నట్లు జాన్సన్ అండ్ జాన్సన్ తెలిపింది. ఈ పరిష్కారం ఫెడరల్ కోర్టులో ఏకీకృతం చేయబడిన సుమారు 69,000 కేసులను, రాష్ట్ర కోర్టులోని సంబంధిత కేసులను పరిష్కరిస్తుందని, ఇది మిగిలిన టాల్క్ క్లెయిమ్‌లలో 99.75శాతానికి సమానమని జె అండ్ జె తెలిపింది. దశాబ్దకాలంగా సాగిన కోర్టు పోరాటం తర్వాత ఇది ఒక మంచి పరిష్కారమని పేర్కొంటూ, వాదుల న్యాయ సంస్థలు ఈ ఒప్పందాన్ని ధ్రువీకరించాయి. టాల్క్ ప్రత్యేకంగా తమ అండాశయ క్యాన్సర్‌కు కారణమైందని నిరూపించగల వ్యక్తిగత వాదుల సామర్థ్యంపై ఒక ఫెడరల్ న్యాయమూర్తి సందేహం వ్యక్తం చేయడంతో,



సుదీర్ఘకాలంగా సాగుతున్న ఈ న్యాయ పోరాటంలో గత వారం జె అండ్ జె కోర్టు విజయాన్ని సాధించింది. టాల్క్ సురక్షితమైనదని,అందులో ఆస్బెస్టాస్ లేదని చెబుతూ, తమ టాల్క్ ఉత్ప త్తుల వల్ల క్యాన్సర్ వస్తుందన్న ఆరోపణలను జె అండ్ జె ఖండించింది. ఈ కంపెనీ 2020లో అమెరికాలో టాల్క్ ఆధారిత బేబీ పౌడర్ అమ్మ కాలను నిలిపివేసి, కార్న్‌స్టార్చ్ ఉత్పత్తికి మా రింది. ఒక షెల్ కంపెనీ దివాలా ద్వారా వ్యాజ్యా లను పరిష్కరించడానికి జె అండ్ జె పదేపదే ప్రయత్నించగా, మూడేళ్లకు పైగా నిలిపివేసిన ఈ

# సంక్షిప్త వార్తలు

## కేసుల భయంతో మాస్కులతో పాల్గొన్న విద్యార్థులు..




**న్యూఢిల్లీ,జులై 28:** నీట్‌యూజీ పేపర్ లీక్ వ్యవహారంతో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన విద్యార్థుల నిరసనల్లో కొత్త ఆందోళన వ్యక్తమవుతోంది. పోలీసు కేసులకు భయపడి చాలా మంది విద్యార్థులు మాస్కులు, కళ్లద్దాలతో తమ గుర్తింపును దాచుకుంటున్నారు. పోలీసులు ఏర్పాటు చేసిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత ఫేషియల్ రికగ్నిషన్ కెమెరాల నిఘానే దీనికి ప్రధాన కారణం. నిరసనలో పాల్గొన్న తమపై ఎఫ్ఐఆర్ నమోదైతే భవిష్యత్తులో ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు, పాస్‌పోర్ట్‌జారీ, విదేశీ విద్యఅవకాశాలపై తీవ్ర ప్రభావం పడుతుందని వారు ఆందోళన చెందుతున్నారు.

## మోడీ ఇన్‌స్టా విడియోలకు 105 మిలియన్ల ఫాలోయర్లు..



**న్యూఢిల్లీ,జులై 28:** ప్రధాని నరేంద్రమోడీ ఇన్‌స్టాగ్రామ్‌లో రికార్డులు సృష్టిస్తున్నారు. ఇటీవల, నీట్ పేపర్‌లీక్ వివాదం, నిరసనల సమయంలో ఆయన పోస్ట్ చేసిన వీడియో ఏకంగా మిలియన్ల కొద్దీ వ్యూస్ వచ్చాయి. ఈ వీడియో తర్వాత ప్రధానికి ఏకంగా 40 లక్షల మంది కొత్త ఫాలోవర్లు పెరిగారు. ఇప్పుడు మొత్తం ఆయన ఇన్‌స్టా ఫాలోవర్లు 105 మిలియన్లు (10.5కోట్లు)కు చేరుకుంది. కేవలం గత వారంరోజుల్లోనే నాలుగు మిలియన్ల మంది ఆయనను ఫాలో అవుతున్నారు. వారం క్రితం మోడీకి 101 మిలియన్ల(10.1కోట్ల) మంది ఫాలోవర్లు ఉండగా, ప్రస్తుతం ఇది 105 మిలియన్లను అధిగమించింది.

## విస్కాన్సిన్ రాష్ట్రాన్ని వణికించిన టోర్నడో..



**వాషింగ్టన్, జులై 28:** అమెరికాలోని విస్కాన్సిన్ రాష్ట్రాన్ని సోమవారం తీవ్రమైన టోర్నడో వణికించింది. ఈ టోర్నడో ధాటికి విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. దాంతో విస్కాన్సిన్‌తోపాటు అమెరికా మధ్య పశ్చిమప్రాంతంలోని పలు రాష్ట్రాల్లో 3.9లక్షల ఇళ్లకుపైగా విద్యుత్ సరఫరా కోల్పోయి నట్లు అధికారులు వెల్లడించారు. మెనాషా, యాపిల్‌టన్ నగరాలపై ఇది తీవ్ర ప్రభావాన్ని చూపిందని తెలిపారు. టోర్నడో ధాటికి ఇళ్ల పైకప్పులు ఎగిరిపో యాయి. భారీ వృక్షాలు నేలకూలాయి. మరోవైపు విద్యుత్ సరఫరా నిలిచి పోవడంతో లక్షలాది మంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దాదాపు 20 నిమిషాలపాటు టోర్నడో విధ్వంసం సృష్టించిందని అధికారులు తెలిపారు.

## అంతర్జాతీయ విద్యార్థులకు పిజి వర్క్ పర్మిట్లు తిరస్కరణ

**వాంకోవర్,జులై 28:** కెనడాలో చదువుకుంటున్న భారతీయ విద్యార్థులతో సహా పలువురు అంతర్జాతీయ విద్యార్థుల పోస్ట్‌గ్రాడ్యుయేషన్ వర్క్ పర్మిట్లు తిరస్కరణకు గురికావడం, దానికి నిరసనగా విద్యార్థులు ఆందోళనలు చేపట్టడంపై ఇమ్మిగ్రేషన్, రెఫ్యూజీస్ అండ్ సిటిజన్‌షిప్ కెనడా స్పందించింది. విద్యార్థులు చదువుకునే సమయంలో పనిచేయడానికి వర్తించే నిబంధనలపై కీలక స్పష్టతనిస్తూ తీవ్ర హెచ్చరికలు జారీచేసింది. స్టడీపర్మిట్ నిబంధనలను అతిక్రమించి అనుమతి లేకుండా పనిచేయడం ఇమ్మిగ్రేషన్ చట్టాలను ఉల్లంఘించడమేనని ఐఆర్‌సీసీ స్పష్టం చేసింది.

## మైన్మార్‌లో సైబర్ నేరాలకు పాల్పడితే ఇక మరణశిక్షే..

**నాయ్‌పైథా,జులై 28:** మయన్మార్ పార్లమెంట్ ఆన్‌లైన్ స్కామ్ మోసాలపై ఉక్కుపాదం మోపేందుకు మంగళవారం ఒక నూతన చట్టాన్ని ఆమోదించింది. ఈ 'యాంటీ ఆన్‌లైన్ స్కామ్ బిల్లు' ప్రకారం సైబర్ స్కామ్ సెంటర్లలో ప్రజలను అక్రమంగా బంధించినా, హింసించినా లేదా బలవంతంగా పనిచేయించినా మరణశిక్ష లేదా జీవిత ఖైదు విధించేలా కఠిన నిబంధనలను పొందుపరిచారు. రాజధాని నేపిడాలో ఉభయ సభల సంయుక్త సమావేశంలో ఈ బిల్లుకు పార్లమెంట్ ఆమోదముద్ర వేసినట్లు స్పీకర్ ఆంగ్ లిన్ ద్వే తెలిపారు.

## జమ్ముకాశ్మీర్‌లో ఇంటిపై పడిన బస్సు: 39 మందికి తీవ్ర గాయాలు

**శ్రీనగర్,జులై 28:** జమ్మూ కాశ్మీర్‌లోని గందర్‌బాల్ జిల్లా కంగన్ ప్రాంతంలో మంగళవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. వేగంగా వెళ్తున్న అమర్‌నాథ్ యాత్రికుల బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లి నేరుగా ఓ ఇంటిపై పడిపోయింది. ఈ దుర్ఘటనలో కనీసం 39 మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. ఘటన జరిగిన సమయంలో ఆ ఇంట్లో ఎవరూ లేకపోవడం వల్ల పెద్ద ఉపద్రవం తొలిగిపోయింది. బస్సు ఆ ఇంటిపై పడి ఆగిపోవడం వల్లే పక్కనే ప్రవహిస్తున్న సింధు నదిలోకి జారిపడకుండా ఉండిపోయిందని, ఒకవేళ నదిలో పడి ఉంటే ఊహించని రీతిలో నష్టం జరిగేదని అధికారులు భావిస్తున్నారు.

విశాఖపట్నం
అనకాపల్లి
అల్లూరి సీతారామరాజు
26
వార్త
బుధవారం 29, జూలై 2026




# డీఎస్సీపై జగన్ మోసపూరిత మాటలు : గంటా

**విశాఖపట్నం, జులై 28, ప్రభాతవార్త :**
ఎన్నికల్లో ప్రతి ఏటా జాబ్ కేలండర్, డీఎస్సీ హామీతో 2019 లో అధికారంలోకి వచ్చి నిరుద్యోగులను అయిదేళ్ల పాటు నిలువునా మోసం చేసిన జగన్మోహన్ రెడ్డి మళ్లీ అదే మేకవన్నె పులి వేషాలకు తెర తీశారని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. కూటమి ఎన్నికల మేనిఫెస్టో లో చెప్పినట్టు 16,347 పోస్టుల మెగా డీఎస్సీ ఫైలుపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తొలి సంతకం చేస్తే 240 కేసులు వేసి మోకాలడ్డడానికి దిగజారుడు యత్నాలు చేశారన్నారు. పారదర్శకంగా నిర్వహించిన మెగా డీఎస్సీపై ఈరోజుకీ విషం చిమ్మడానికి జగన్ చేస్తున్న ప్రయత్నాలను ప్రజలు అసహ్యించుకుంటున్నారని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వని జగన్మోహన్ రెడ్డికి మెగా డీఎస్సీ గురించి మాట్లాడే అర్హతే లేదన్నారు. 14 డీఎస్సీలలో 1,96,619 టీచర్ పోస్టులను భర్తీ చేసిన ఘనచరిత్ర తెలుగుదేశం పార్టీకి ఉందని, తాను (తరువాయి 8వ పేజీలో)

## అత్యంత వైభవంగా
# గిరి ప్రదక్షిణ

### లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు... విస్తృత ఏర్పాట్లు చేసిన సింహాచల దేవస్థానం
### జెండా ఊపి పుష్పరథం ప్రదక్షిణ ప్రారంభించిన అశోక్ గజపతిరాజు

**సింహాచలం, జూలై 28, ప్రభాత వార్త :**
శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామి గిరి ప్రదక్షణకు లక్షలాదిమంది భక్తులు తరలివచ్చారు సింహాద్రినాధుని స్మరణతో అడివివరం సింహాచల ప్రాంతం మారు మ్రోగింది. శ్రీ సింహగిరివాసుడి దర్శనం పరవశింప జేస్తుందని శ్రీ చందన శతక కర్త మానాప్రగడ శేషసాయి. అంతటి విశిష్టత కలిగిన సింహగిరి చుట్టూ ప్రదక్షిణ చేస్తే భూ ప్రదక్షిణతో పాటు స్వామివారి పాద దర్శనం భాగ్యం కూడా దక్కుతుందని పండితులు చెబుతారు. అందుకే ఏటేటా గిరి ప్రదక్షిణ చేసే భక్తుల సంఖ్య లక్షల్లో పెరుగు తోంది. మంగళవారం చల్లని వాతావరణం నడుమ సింహగిరి ప్రదక్షిణ ప్రశాంతంగా ప్రారంభమైంది. ఎప్పటిలాగే తేలికపాటి చినుకులు కురిసి కొద్దిసేపటికి తగ్గుముఖం పట్టడంతో సింహాచలం చేరుకున్న భక్తులు మంగళవారం ఉదయమే ప్రదక్షిణ మొదలు పెట్టారు. కొండ దిగువ తొలి పావంచా వద్ద టెంకాయ కొట్టి నడక ప్రారంభించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త, గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు మధ్యాహ్నం 2 గంటలకు స్వామి పుష్పరథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ముందుగా రథంలో కొలువుతీరివున్న సింహాద్రినాథుని నమూనా మూర్తుల వద్ద అర్చకులు సంప్రదాయ పూజలు చేశారు. మంగళ హారతులిచ్చి, అశోక్‌గజపతి, ఈఓ వెంకట్రావుతో కొబ్బరికాయ కొట్టించారు. ప్రభుత్వ విప్ పిజివిఆర్ నాయుడు రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ కోడూరి రామచంద్ర మోహన్, ధర్మకర్తలి సభ్యులు, ధర్మ కర్తలి మాజీ సభ్యులు గంట్ల శ్రీనుబాబు,హాజరయ్యారు. స్థానాచార్యులు డాక్టర్ టి.పి. రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, కరి సీతారామాచార్యుల నేతృత్వంలో పండితులు ఉత్సవం నిర్విఘ్నంగా పూర్తికావాలని అర్చన చేశారు. పులివేషాలు, తపెట్టగుళ్లు, కోలాటాల విన్యాసాలు, సంప్రదాయ నాదస్వర, డోలు, కేరళా వాయిద్యాల నడుమ సింహాచలేశుని పుష్ప రథం ముందుకు కదిలింది. నారసింహ, గోవింద నామస్మరణ చేసుకుం టూ భక్త బృందాలు రథంతో పాటు ముందుకు కదిలాయి. పాత అడివివరం వరకు అధికార యంత్రాంగమంతా రథం ముందు నడిచారు. తొలిపావంచా వద్ద ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ నుండి అధికారులు ఉత్సవాన్ని పర్యవేక్షించారు. పలు స్వచ్ఛంద సంస్థలు భక్తుల కోసం మంచినీరు, వివిధ ప్రసాదాలను ఏర్పాటు చేసి, భారీగా వితరణ చేశాయి.రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ, జిల్లా ఇన్చార్జి మంత్రి బాల వీరాంజనేయ స్వామి సోమవారం రాత్రి సింహాచలం చేరుకుని గిరిప్రదక్షిణ ఏర్పాట్లు పరిశీలించారు. కమాండ్ కంట్రోల్ రూమ్లో ఏర్పాటులకు సంబంధించిన సమాచారాన్ని అధికారులను అడిగి తెలుసు కున్నారు. కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, దేవస్థానం ఈఓ వెంకట్రావు ఇతర అధికారులు హాజరయ్యారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని మంత్రి అధికారులకు సూచించారు. భక్తుల నుండి వచ్చే ఫోన్ కాల్స్ కు స్పందించి తగిన సమాచారం అందించే వ్యవస్థను అప్రమత్తంగా ఉంచాలని ఆదేశించారు.







gిరి ప్రదక్షిణ ఏర్పాట్లను పరిశీలించిన

## కలెక్టర్ అభిషిక్త్ కిశోర్



**విశాఖపట్నం, జూలై 28:**
సింహాచలం గిరి ప్రదక్షిణ ఏర్పాట్ల పై, భక్తుల కదలికలు, పోలీస్ బందోబస్తు, వారి కోసం చేసిన ఏర్పాట్ల పై జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ మంగళవారం పలు కేంద్రాలలో పర్యటించి పరిశీలించారు. నగరం లోని అప్పుఘర్ నుండి సీతమ్మ ధార వరకు పర్యటించి ప్రజలతో మమేకమై ఏర్పాట్ల పై అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ కు జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము ఏర్పాట్ల పై వివరించారు.

భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవ ఏర్పాట్లను

## త్వరితగతిన పూర్తిచేయండి

- ప్రధాని పర్యటన విజయవంతానికి సమన్వయంతో పనిచేయాలి
- భోగాపురంలో ప్రధాని పర్యటన ఏర్పాట్లపై మంత్రి నారా లోకేష్ సమీక్ష



**భోగాపురం, జూలై 28, ప్రభాతవార్త :**
విజయనగరం జిల్లా భోగాపురం అల్లూరి సీతారామ రాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ ఏర్పాట్లను త్వరితగతిన పూర్తిచేయాలని, ప్రధాని పర్యటన విజయవంతానికి ప్రతిఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. ఆగష్టు 1వ తేదీన రాష్ట్రంలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లపై భోగాపురం విమానాశ్రయంలో కేంద్ర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడుతో కలిసి అధికారులు, మంత్రులు, ప్రజాప్రతినిధులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రహదారుల పనులు, పార్కింగ్, టెర్మినల్ బిల్డింగ్, బహిరంగ సభ వేదిక, భద్రత, జనసమీకరణ, ప్రోటోకాల్ గ్యాలరీ, భోజనం, రవాణా ఏర్పాట్లపై ఇప్పటివరకు చేపట్టిన చర్యలను అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా అధికారులకు మంత్రి నారా లోకేష్ పలు సూచనలు చేశారు. విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి 32 నియోజకవర్గాల నుంచి దాదాపు 3 లక్షల మంది హాజరవుతారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని (తరువాయి 8వ పేజీలో)

గిరి ప్రదక్షిణపై సిసి కెమెరాలతో

## నిరంతర నిఘా

- కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షిస్తున్న జిల్లా జిల్లా (డ్యూటీ ఇన్‌చార్జ్ ) అధికారులు
- కమాండ్ కంట్రోల్ రూమ్ పర్యవేక్షిణ పశ్చిమ శాసన సభ్యులు, నగర పోలీస్ కమిషనర్, జిల్లా జాయింట్ కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్



**విశాఖపట్నం, జూలై 28, ప్రభాతవార్త :**
భక్తుల రక్షణ, సౌకర్యార్థం గిరి ప్రదక్షిణ మార్గమం తటా ఏర్పాటు చేసిన సిసి కెమెరాల ద్వారా పరిస్థితిని నిరంతరాయంగా పర్యవేక్షిస్తున్నట్లు జిల్లా ఇన్‌చార్జ్ (డ్యూటీ) అధికారులు తెలిపారు. భక్తుల రద్దీ, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలను ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ రూమ్‌ను అందుబాటులోకి (తరువాయి 8వ పేజీలో)

గిరి ప్రదక్షిణ ఏర్పాట్లపై

## భక్తుల నుంచి ప్రశంసలు

### గిరి ప్రదక్షిణ మార్గాన్ని పరిశీలించిన జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్
### షవర్లు, తాగునీరు, పారిశుద్ధ్య ఏర్పాట్లు అద్భుతం.. భక్తుల సంతృప్తి

**విశాఖపట్నం, జూలై 28, ప్రభాతవార్త :**
సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి గిరి ప్రదక్షిణ సందర్భంగా లక్షలాది మంది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జీవీఎంసీ ఆధ్వర్యంలో విస్తృత స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించినట్లు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. తాగునీటి కేంద్రాలు, పరిశుభ్రమైన మరుగు దొడ్లు, ప్రత్యేక స్నానపు షవర్లు, పారిశుద్ధ్య నిర్వహణ, చెత్త సేకరణ, తరలింపు వంటి ఏర్పాట్లపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. మంగళవారం వెంకోజీపాలెం జంక్షన్ నుంచి సీతమ్మధార, నరసింహనగర్, మాధవధార, ఎన్ఎస్‌టీఎల్ వంటిల్లు జంక్షన్, గోపాలపట్నం కుమారి కళ్యాణమండపం, పాత గోశాల మీదుగా సింహాచలం తొలి పావంచ వరకు గిరి ప్రదక్షిణ మార్గాన్ని కమిషనర్ అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం సింహాచలంలోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించి ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, గిరి ప్రదక్షిణ మార్గంలోని ప్రతి కీలక ప్రాంతాన్ని స్వయంగా సందర్శించి భక్తులతో మాట్లాడినట్లు తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి ఏర్పాటు చేసిన స్నానపు షవర్లు, తాగునీటి కేంద్రాలు, మరుగుదొడ్లు, పారిశుద్ధ్య నిర్వహణ మరింత మెరుగ్గా ఉన్నాయని భక్తులు అభిప్రాయపడినట్లు చెప్పారు. ప్రసాద వితరణ కేంద్రాల



నిర్వాహకులు పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఉపయోగించిన ప్లేట్లు, గ్లాసులు, ఇతర వ్యర్థాలను తప్పనిసరిగా డస్ట్‌బిన్లలో వేయించేలా అవగాహన కల్పించాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిరోధించి, గిరి ప్రదక్షిణ మార్గాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు నిరంతర చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మార్గమంతా తాగునీరు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, మరుగుదొడ్లలో నిరంతరం నీటి సరఫరా ఉండేలా ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని అధికారులకు సూచించారు. భక్తుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా 24 గంటలూ అప్రమత్తంగా (తరువాయి 8వ పేజీలో)

భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవ ఏర్పాట్లపై

## సమీక్ష సమావేశం



**విశాఖపట్నం, జూలై 28, ప్రభాతవార్త :**
ఆగస్టు 1వ తేదీన ప్రారంభం కానున్న భోగాపురం శ్రీ అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ ఏర్పాట్ల పై భీమిలి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్, భీమిలి నియోజకవర్గం పరిశీలకులు మళ్ళా సురేంద్ర పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి వర్యులు,శాసన సభ్యులు గంటా శ్రీనివాసరావు ఆధ్యర్యంలో ఆగస్ట్1న జరగనున్న కార్యక్రమాన్ని విజ యవంతం చేయడానికి చేయాల్సిన అన్ని ఏర్పాట్లపై పార్టీ నాయ కులుతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భీమిలి మండలం అబ్జర్వర్ వెద్రమన్ హరిబాబు నాయుడు (గుంటూరు డిసిఎంఎస్ చైర్మన్) ఆనందపురం మండలం అబ్జర్వర్ బొమ్మన శ్రీధర్ (ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బెస్త కార్పొరేషన్ చైర్మన్) పద్మనాభ మండలం అబ్జర్వర్ గంటా త్రిమూర్తులు (ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కృష్ణ బలిజ కార్పొరేషన్ చైర్మన్) మరియు నియోజవర్గం ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



## అనకాపల్లి జిల్లా బాడీ బిల్డర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



అనకాపల్లి, జులై 28, ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు జిల్లా బాడీ బిల్డర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. స్థానిక గవరపాలెం శ్రీ కామాక్షమ్మ దేవాలయం మేడపైన మంగళవారం జరిగిన సమావేశంలో ఈ ఎన్నికలు ఆంధ్రప్రదేశ్ బాడీ బిల్డర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు కే.గురునాధరావు ఆంధ్రప్రదేశ్ బాడీ బిల్డర్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు రాష్ట్ర కార్యదర్శి టి.రాము, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.ఎన్.ఎస్. అప్పారావు, వై.శ్రీనివాసరావు, రాష్ట్ర లీగల్ అడ్వైజర్ కేలం చంద్రశేఖర్, పర్యవేక్షణలో నిర్వహించారు. అనంతరం నూతన జిల్లా బాడీబిల్డర్స్ అసోసియేషన్ ప్రమాణస్వీకారం రాష్ట్ర కమిటీ ప్రకటించింది. జిల్లా గౌరవాధ్యక్షులుగా కోరిబిల్లి సోమినాయుడు, ముఖ్య సలహాదారులుగా ఎం.ఎన్.ఎస్ అప్పారావు, బి.బాలాజీ బద్రీనాథ్, జిల్లా లీగల్ అడ్వైజర్గా కేలం చంద్రశేఖర్ లను ప్రకటించగా జిల్లా అధ్యక్షులుగా విల్లూరి రాజేష్, ప్రధాన కార్యదర్శిగా అమ్మిలోజు శ్రీను, కోశాధికారిగా ఆడారి నాయుడు, అసోసియేట్ సెక్రటరీగా ఆళ్ళ ప్రవీణ్ కుమార్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ.ఎం.ఎస్.శివ కుమార్, జిల్లా మీడియా ఇన్చార్జ్గా యల్లపు వెంకట రమణాజీ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా చింతా లక్ష్మణరావు, బుద్ధ జగన్, పిన్నపోతుల సంతోష్, జిల్లా ఉపాధ్యక్షులు బీశెట్టి తిరుమల, అందే గణేష్, బుద్ధ అప్పలనాయుడు, ఆళ్ళ సతీష్ కుమార్, యల్లపు సత్యనారాయణ, వేపాడ సత్తిబాబు, సహాయ కార్యదర్శులుగా వేగి అజయ్ కుమార్, కరణం కృష్ణ, గొర్లి స్వామి, లోవరాజు, శ్రావణ్ కుమార్, క్రైమ్ శ్రీను, లక్ష్మణరావు, సంతోష్లను రాష్ట్ర కమిటీ ప్రకటించింది. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ జిల్లా బాడీ అసోసియేషన్ పటిష్టతకు కృషి చేయాలన్నారు. నూతన కమిటీ అసోసియేట్ సెక్రెటరీ ఆళ్ల ప్రవీణ్, జిల్లా అధ్యక్షులు విల్లూరి రాజేష్, కార్యదర్శి అమ్మిలోజు శ్రీను తదితరులు మాట్లాడుతూ యువతకు బాడీ బిల్డింగ్లో అత్యుత్తమ శిక్షణ ఇచ్చి రాష్ట్ర భారీ బిల్డర్స్ అసోసియేషన్ కు కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ మరింత పేరు తీసుకొని వచ్చే విధంగా కృషి చేస్తామని తెలిపారు. తమకు ఈ బాధ్యతలు అప్పగించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లాలోని వ్యాయామశాలల అధినేతలు, క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

### మన ఊరు.. మన బాధ్యత పేరుతో ..

## పాల్తేరు గ్రామాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

### న్యాయవాది రాంబాబు గ్రామస్తులతో ముఖాముఖి



(నక్కపల్లి, ప్రభాతవార్త)

గ్రామ సమగ్ర అభివృదే ధ్యేయంగా ప్రత్యేక ప్రణాళికను రూపొందిస్తూ మన ఊరు మన అభివృద్ధి అనే నినాదంతో న్యాయవాది రాంబాబు నాయకత్వంలో పాయకరావుపేట మండలం పాల్తేరు గ్రామంలో గ్రామస్తులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామం అభివృద్ధి సమస్యల నివారణ కొరకు తీసుకోవలసిన చర్యలపై మన ఊరు –మన బాధ్యత పేరుతో వినాయక గుడివీధి, పల్లపు వీధిలో ఆదివారం రాత్రి జరిగిన ఈ సమావేశానికి హైకోర్టు న్యాయవాది దేవవరపు రాంబాబు హాజరయ్యారు. గ్రామంలోని ప్రస్తుత పరిస్థితులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. పరిష్కార మార్గాలపై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రాబోయే ఐదేళ్ల కాలంలో మిత్రుల సహకారంతో రాజకీయ పలుకుబడిని ఉపయోగించి ప్రముఖ వ్యాపారవేత్తలను సంప్రదించి గ్రామాభివృద్ధికి అవసరమైన నిధులను సమకూర్చి అందరి ఆశీస్సులతో కృషి చేస్తానని న్యాయవాది రాంబాబు ముందుకు వచ్చారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడంతో పాటు విద్యార్థుల కోసం ఉన్నత పాఠశాల, ఆటస్థల ఆధునికీకరణ యువత విద్యార్థుల కోసం సెంట్రల్ లైబ్రరీ ఏర్పాటు, మంచినీళ్ల చెరువు గట్టును వాకింగ్ టాక్గా మార్చడం, గ్రామానికి నూతన పంచాయతీ భవన నిర్మాణం, అవసరమైన చోట్ల రోడ్ల నిర్మాణం మరమ్మతులు మురుగునీటి పారుదల వ్యవస్థను మెరుగుపరచడం చిన్న పిల్లలు, గర్భిణుల కోసం అంగన్వాడీ కేంద్రాలను అభివృద్ధి చేయడం ఈ విధంగా పలు విషయాలు చర్చించారు. వ్యవసాయ అవసరాలకు గాను గోదావరి తాండవ నీటిని గ్రామానికి తీసుకు వచ్చేందుకు కృషి చేయడం గ్రామంలోని ఆలయాల అభివృద్ధి తగిన రక్షణ కల్పించడం వంటి అంశాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సదస్సులో తీర్మానం చేశారు. పార్టీలకి అతీతంగా పాల్తేరు గ్రామ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ చేతులు కలపాలని గ్రామ పెద్దలు కోరారు. ఈ బృహత్తర ప్రణాళిక కార్యరూపం దాల్చి విజయవంతం చేయడానికి గ్రామ యువకులు, మిత్రులు పెద్దలు, తనను ప్రోత్సహించి సహకారాన్ని అందించాలని రాంబాబు కోరారు.

## అల్లూరి సీతారామరాజు ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ ప్రారంభోత్సవానికి రానున్న ప్రధాని నరేంద్ర మోడీ

### : జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

అనకాపల్లి, జూలై 28, ప్రభాతవార్త



అల్లూరి సీతా రామరాజు ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ రానున్న నేపథ్యంలో అధిక సంఖ్యలో ప్రజల తరలివచ్చే అవకాశం ఉందని, అందుకు తగ్గట్లు రవాణా సదుపాయాలు, భోజనం వైద్య సహాయం ఇతర ఏర్పాట్లపై మంగళవారం ఉదయం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉన్నతాధికారులతో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బస్సుల కేటాయింపు, సమయ పాలన, ప్రతి బస్సులో 60 మంది చొప్పున ప్రయాణించేలా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. బోర్డింగ్ సమయానికి బస్సులను కేటాయించిన బోర్డింగ్ పాయింట్లకు చేరుకునే విధంగా అధికారులు చూడాలన్నారు. వైద్య సిబ్బంది ప్రతి బస్సులో ప్రథమ చికిత్స కిట్తో పాటు ఒక ఏఎన్ఎం లేదా ఆశా కార్యకర్త అందుబాటులో ఉండాలని తెలిపారు. ప్రయాణికులకు తాగునీరు, పులిహోర, బిస్కెట్లు అరటిపండ్లు పంపిణీ చేయాలని, మధ్యాహ్న భోజనంగా వెజ్ బిర్యానీ, మజ్జిగను అల్లూరి సీతారామరాజు ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ పార్కింగ్ స్థలం వద్ద అందజేయడానికి ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి ఎంపీడీవో కార్యాలయంలో 3 మంది సభ్యులతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి బస్సుల కదలికలను నిరంతరం పర్యవేక్షించాలని, ప్రతి బస్సుకు బస్సు ఇన్ఛార్జ్, మెడికల్ ఇన్ఛార్జ్ నియమించి సమన్వయం చేస్తారని తెలిపారు. జాయింట్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్, జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణ రావు, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పరారీలో వున్న నిందితుడు అరెస్ట్



కసింకోట, జూలై 28, ప్రభాతవార్త

ఉద్యోగాలు ఇప్పిస్తానని యువకుల వద్ద డబ్బు తీసుకొని మోసం చేసి పరారైన నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు కసింకోట సీఐ అల్లు స్వామి నాయుడు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం కశింకోట పోలీస్ స్టేషన్లో నమోదైన క్రైమ్ నెం.52/2015 యూ/ఎస్ 420 రెడ్ విత్ 34 ఐపీసీ) కేసులో, ఉద్యోగాల పేరుతో పలువురిని మోసం చేసి రూ.20,71,000 వసూలు చేసిన కేసుకు సంబంధించి 2015 నుంచి పరారీలో ఉన్న నిందితుడు బోడేపు ప్రకాశ్ను న్యాయస్థానం జారీ చేసిన ఎన్బిడబ్ల్యు మేరకు నిందితుడిని అరెస్టు చేసినట్లు తెలిపారు. మోసం చేసి వసూలు చేసిన నగదు తన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతాలో జమ చేసినట్లు సాక్షుల వాంగ్మూలాలు, బ్యాంకు ఆర్థిక లావాదేవీలు బట్టి మోసం చేసి నగదు తీసుకున్నట్లు నిర్ధారణ అయిందని తెలిపారు. కోర్టు ఆదేశాలను బట్టి నిందితుడిని అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరు పరిచినట్లు సీఐ అల్లు స్వామినాయుడు తెలిపారు. ఎస్సై కే.లక్ష్మణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## టీడీపీ ప్రభుత్వం రెండేళ్ల పాలనపై ఇంటింటి ప్రచారం

కసింకోట, జూలై 28, ప్రభాతవార్త



రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు అనకాపల్లి టిడిపి ఇన్చార్జ్ సత్యనారాయణ నాయకత్వంలో మండలంలో అన్ని గ్రామల లో తెలుగుదేశం పార్టీ రెండేళ్ల పాలన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల గురించి రెండవ రోజు ప్రజలకు వివరిస్తూ డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమశీ లో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గొంతిన శ్రీనివాసరావు ఏనుగుతుని చింతలపాలెం.నరసింగబిల్లి లో పాల్గొని డోర్ టు డోర్ తిరిగి కూటమి పరిపాలన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజలకు వివరిస్తూ ఎవరికైనా ఏమైనా సంక్షేమ కార్యక్రమాలు అంధలేదని చెప్పిన వారికి వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి ఎవరైనా ఇస్తూ డోర్ టు డోర్ తిరిగారు. ఈ కార్యక్రమంలో కోఆపరేటివ్ బ్యాంక్ ప్రెసిడెంట్ మజ్జి నిరంజన్ కుమార్ మండల తెలుగుదేశం పార్టీ నాయకులు గొంతిని చిరంజీవి, మజ్జి శ్రీకర్, నీటి సంఘం అధ్యక్షులు ఉప్పులూరి అప్పలనాయుడు, మండల ఐ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జెర్రిపోతుల నూకునాయుడు, గ్రామ పార్టీ అధ్యక్షులు మజ్జి ప్రసాద్, బూత్ ఇంచార్జ్ కొటారు సంతోష్ కుమార్, మజ్జి హరీష్ మండల ఐటీడీపీ కార్యదర్శి భీముని దాసు ర్యాలీ రమేష్ కాపుశెట్టి శివ బమ్మడి వసంత కుమార్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## గూడుపమ్మ ఆలయంలో పూజలు నిర్వహించిన తోట నగేష్



నక్కపల్లి, ప్రభాతవార్త

మండలంలోని రేబాక గూడుపమ్మ ఆలయంలో జిల్లా మాజీ గ్రంథాల సంస్థ చైర్మన్, రాష్ట్ర జనసేన పార్టీ నాయకులు తోట నగేష్ దర్శించుకున్నారు. మేరకు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు టిడిపి నాయకులు టిహెచ్ఆర్ ఎస్ఎన్ రాజు (పెంకులరాజు), జిల్లా బిజెపి నాయకులు హోసూరు శ్రీనివాసరావు, ఎన్హెచ్ నిర్వహకులు శ్రీపాద ప్రణవ్ శ్రీరామ్, దేవవరపు లోవరాజు బండారు అయ్యప్ప తదితరులు దర్శించుకున్నారు.

## దిమిలి ఎస్బీఎస్ ప్రభుత్వ పాఠశాలకు నూతన తరగతి గదుల ప్రారంభం

### రూ.33.32 లక్షల వ్యయంతో నిర్మించిన భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్

రాంబిల్లి, జులై 28, ప్రభాతవార్త



మండలంలో దిమిలి గ్రామం లోని శ్రీ భాగవతుల సోమన్న ప్రభుత్వ పాఠశాలలో రూ.33.32 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన తరగతి గదులను ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ మంగళవారం ప్రారంభించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికి ప్రైవేట్ విద్యాసంస్థలకు ఏమాత్రం తీసిపోని విద్యా వాతావరణాన్ని కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఆధునిక సౌకర్యాలతో కూడిన తరగతి గదులు, మెరుగైన మౌలిక వసతులు, పరిశుభ్రమైన పాఠశాల వాతావరణం విద్యార్థుల అభ్యాసానికి ఎంతో దోహదపడతాయని చెప్పారు. పాఠశాల పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని ఉపాధ్యాయులు, విద్యార్థులకు సూచించారు. స్వచ్ఛమైన వాతావరణం విద్యార్థుల ఆరోగ్యానికి ఎంతో అవసరమని, పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించాలని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే పాఠశాలలోని వంటశాలను సందర్శించి పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత, వంటశాల పరిశుభ్రత, ఆహార పదార్థాల నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు ప్రతిరోజూ నాణ్యమైన, పరిశుభ్రమైన, పోషకాహారం అందేలా అధికారులు, వంట సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. పిల్లల ఆరోగ్యం, పోషకాహారం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని స్పష్టం చేశారు. అనంతరం అనకాపల్లి జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో మహిళల భద్రత కోసం నిర్వహిస్తున్న 'అభయం' ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ పాల్గొన్నారు. మహిళలు, బాలికల భద్రతకు సంబంధించి పోలీసు శాఖ చేపడుతున్న చర్యలను ఆయన అభినందించారు. మహిళలపై నేరాల నివారణ, అత్యవసర పరిస్థితుల్లో పోలీసు సేవలను ఎలా వినియోగించుకోవాలి, మహిళలకు అందుబాటులో ఉన్న భద్రతా వ్యవస్థలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించడం అభినందనీయమని అన్నారు. ప్రభుత్వం విద్యాభివృద్ధితో పాటు మహిళల భద్రతకు కూడా అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదువుకుని సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, పోలీసు అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, కూటమి నాయకులు, కార్యకర్తలు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## పైడితల్లమ్మని దర్శించుకున్న టీడీపీ నేత రత్నాకర్

అనకాపల్లి, జూలై 28, ప్రభాతవార్త



అనకాపల్లి జీవీఎంసీ విలీన గ్రామం కొప్పాకలో కొలువై ఉన్న శ్రీ పైడితల్లి అమ్మవారి పండగ మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ అధ్యక్షులు దాడి రత్నాకర్ అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి సత్కరించారు. ఆలయ కమిటీ సభ్యులు గోయిన మురళి, మల్ల అంజిబాబు, వామాల కాశి, సకల రాంబాబు, ఈతన గోపి, గొర్లి సోంబాబు, బత్తిన జగదీష్, నెట్టిమి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## పొంత రోడ్లు ఏర్పాటుకు ప్రతిపాదనలు



గొలుగొండ జులై 28, ప్రభాతవార్త

మండలంలో అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో పంట పొలాలకు వెళ్లే పొంత రోడ్లు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు ఇంజనీరింగ్ అసిస్టెంట్ రామకృష్ణ తెలిపారు. ఈ నెల 30 లోపు రైతులు అభిప్రాయం మేరకు వారు చూపే పొంత రోడ్లు కొలతలు నిర్వహించి జిపిఎస్ ద్వారా ట్యాగ్ చేస్తున్నామని అన్నారు. ప్రతి రోడ్డుకు 500 మీటర్లకు తక్కువ లేకుండా ఉండాలని అంతకుమించి ఐదు కిలోమీటర్ల వరకు ఉండవచ్చని పేర్కొన్నారు. అయితే రైతులు సౌకర్యార్థం ఈ రోడ్ల నిర్మాణానికి కొలతలు నిర్వహిస్తున్నామని రైతులు సద్విని యోగం చేసుకోవాలని సూచించారు. పంట పొలాలకు వెళ్లే పొంత గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి ఇంజనీరింగ్ సిబ్బంది కొలతలు నిర్వహించారు. పప్పు శెట్టిపాలెం, చోద్యంతో పాటు మరికొన్ని పంచాయతీల్లో లింక్ రోడ్ నిర్మాణానికి రైతుల ప్రతిపాదనలు మేరకు జిపిఎస్ ట్యాగ్ చేస్తున్నట్లు వివరించారు.

## గొరపూడి పంచాయతీలో ప్రత్యేక ఆర్థిక మండలి భూసేకరణ నేపథ్యంలో ఉద్రిక్తత

### రీ-సర్వేలో తప్పులు సరిదిద్దే వరకు చెట్ల లెక్కింపు నిలిపివేయాలని రైతుల డిమాండ్

రాంబిల్లి, జులై 28, ప్రభాతవార్త



రాంబిల్లి మండలంలోని గొరపూడి పంచాయితీలో రెండో విడత ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) భూసేకరణ ప్రక్రియలో భాగంగా చేపట్టిన చెట్ల గణన కార్యక్రమాన్ని సోమవారం రైతులు అడ్డుకున్నారు. రీ-సర్వేలో ఉన్న లోపాలను ముందుగా సరిచేయకుండా చెట్ల గణన చేపట్టవద్దని రెవెన్యూ అధికారులను నిలదీశారు. భూసేకరణలో భాగంగా సోమవారం వీఆర్వోలు, ఉద్యానవన శాఖ, వ్యవసాయ శాఖ సిబ్బందితో కూడిన 10 సర్వే బృందాలు గ్రామంలోని రైతుల భూముల్లోకి వెళ్లి ఉద్యాన పంటలకు సంబంధించిన చెట్ల లెక్కింపు చేపట్టాయి. రీ-సర్వేలో రైతుల పేర్లకు కేటాయించిన ఎల్పీ (ఎల్పి) నంబర్లకు ఎదురుగా ఉన్న చెట్ల సంఖ్యను నమోదు చేస్తుండగా రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. రీ-సర్వేలో అనేక తప్పులు జరిగాయని, భూమి యజమానుల వివరాలు సరిగా నమోదు కాలేదని రైతులు ఆరోపించారు. భూమి లేని వారి పేర్లపై ఎల్పీ నంబర్లు నమోదై ఉంటే, భవిష్యత్తులో వారికి నష్టపరిహారం చెల్లించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో చెట్ల గణన చేపడితే అసలు భూమి యజమానులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. పరిహారం చెల్లించే సమయంలో రైతుల సంతకాలు తీసుకున్న తర్వాతే చెల్లింపులు చేస్తామని అధికారులు చెబుతున్నప్పటికీ, ఎల్పీ నంబర్లలో నమోదైన వ్యక్తుల సంతకాలు తీసుకుని వారికి పరిహారం చెల్లిస్తే నిజమైన భూ యజమానులు నష్టపోతారని రైతులు వాపోయారు. ముందుగా రీ-సర్వేలోని లోపాలను సరిచేసి, యాజమాన్య వివరాలను స్పష్టంగా నమోదు చేసిన తర్వాతే చెట్ల గణన చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతుల అభ్యంతరాలపై స్పందించిన సర్వే బృందాలు, ఈ విషయాన్ని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లి చర్చించి నిర్ణయం తెలియజేస్తామని రైతులకు హామీ ఇచ్చినట్లు సమాచారం. అప్పటివరకు గ్రామానికి చెట్ల గణన కోసం రావద్దని రైతులు అధికారులను కోరారు. రీ-సర్వేలో ఉన్న అనుమానాలను నివృత్తి చేసి, పారదర్శకంగా భూసేకరణ ప్రక్రియ నిర్వహించాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.




## చిత్తులాట కాయిన్ గేమ్ శిబిరంపై దాడి



గొలుగొండ జులై 28 ప్రభాతవార్త

మండలంలో పోలవరం గ్రామ శివారు జీడి తోటలో చిత్తులాట ఆడుతున్న శిబిరంపై దాడి చేసినట్లు గొలుగొండ ఎస్ఐ పి.రామారావు తెలిపారు. చిత్తులాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నట్టు వారు వద్ద నుండి 2000 రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి చట్టప ఉంటామని అన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించరాదని, ఈ సంఘటనల ద్వారా తగాదాలకు దారితీసి పలు గొడవలు చెలరేగే అవకాశం ఉందని ఎస్ఐ అన్నారు. ఇటువంటి శిబిరాలు ఎక్కడైనా నిర్వహిస్తే సమాచారం ఇవ్వాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

## పాతమల్లంపేటలో సుపరిపాలనకు రెండేళ్లు

గొలుగొండ, జులై 28, ప్రభాతవార్త



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా పాత మల్లంపేట పంచాయతీలో సుపరిపాలనకు రెండేళ్లు కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నాయకులు గడ్డం ఆనంద్ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ సుపరిపాలన పాంప్లెట్ ప్రజలకు అందజేసి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం అభివృద్ధిని వివరించారు. పాలనలో అమలు సంక్షేమం అభివృద్ధి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి సంక్షేమ ఫలాల్లో ప్రతి ఒక్కరికి న్యాయం చేసేందుకే ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు అవగాహన కల్పిస్తూ తెలుగుదేశం పార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

## వ్యభిచార గృహంపై ఆకస్మిక దాడి- ఇద్దరు నిర్వాహకులు అరెస్ట్

కసింకోట, జులై 28, ప్రభాతవార్త



అనకాపల్లి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ తుహిన్ సిన్హా, ఆదేశాల మేరకు, అనకాపల్లి డి.ఎస్.పీ. ఆర్.ఆర్. మోహన్ పర్యవేక్షణలో, కశింకోట సర్కిల్ ఇన్స్పెక్టర్ అల్లు స్వామినాయుడు మంగళవారం నమ్మదగిన సమాచారంపై కశింకోట మండలం నూతనగుంటపాలెం గ్రామంలో నిర్వహిస్తున్న వ్యభిచార గృహం పై ఆకస్మిక దాడి నిర్వహించారు. ఈ దాడిలో కశింకోట ఎస్.ఐ. కె. లక్ష్మణరావు, హెడ్ కానిస్టేబుల్ మధు, కానిస్టేబుల్స్ రాజశేఖర్, మహిళ కానిస్టేబుళ్లు వెంకటలక్ష్మి, శిరీష ,కృష్ణవేణి పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. దాడి సందర్భంగా నూతనగుంటపాలెం గ్రామానికి చెందిన గొంతిన భూలోక, కాశీందేవి నాగమణి తమ నివాసంలో వ్యభిచార గృహాన్ని నిర్వహిస్తూ, మహిళలను ప్రలోభపెట్టి వ్యభిచారానికి పాల్పడేలా చేస్తున్నట్లు గుర్తించారు. ఇద్దరు మహిళలను రక్షించి, నేరానికి సంబంధించిన మూడు మొబైల్ ఫోన్లు, ఇతర నేర సంబంధిత వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. వ్యభిచార గృహాన్ని నిర్వహిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, కశింకోట పోలీస్ స్టేషన్ క్రైమ్ నెం.163/2026గా కేసు నమోదు చేసి, తదుపరి దర్యాప్తు చేపట్టారు. సి.ఐ. అల్లు స్వామినాయుడు మాట్లాడుతూ, మహిళల దోపిడీ, వ్యభిచార గృహాల నిర్వహణ వంటి అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని తెలిపారు. ఇలాంటి నేరాలకు సంబంధించిన సమాచారం తెలిసిన ప్రజలు వెంటనే సమీప పోలీస్ స్టేషన్కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

## శివాలయ పుష్కరిణి అభివృద్ధికి 50 వేలు విరాళం

చోడవరం, జూలై 28, ప్రభాతవార్త



చోడవరంలో అతి ప్రాచీన శ్రీ గౌరీశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో గల పుష్కరిణి పునర్నిర్మాణ పనులకు ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కౌన్సిలర్ కొయ్య విజయలక్ష్మి ఉపాధ్యాయుల సహకారంతో 50 వేల రూపాయలు విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని మంగళవారం స్థానిక ఎమ్మెల్యే కె ఎస్ యన్ ఎస్ రాజు చేతుల మీదుగా ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తమరాన త్రినాధ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ దుర్గాప్రసాద్ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.మహాలక్ష్మి నాయుడు సమక్షంలో ఆలయ చైర్మన్ గునూర్ సురేష్ శివాలయ ప్రధాన అర్చకులు కొడమంచిలి చలపతిరావుకి అందజేశారు. ఈ సందర్భంగా విజయలక్ష్మిని ఉపాధ్యాయులను ఎమ్మెల్యే అభినందించారు.

## ప్రారంభమైన వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాలు

చోడవరం, జూలై 28, ప్రభాతవార్త



చోడవరంలో గల ఆపదహార శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో 47వ వార్షిక పవిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా యాగశాల అర్చనఅర్చన నిత్య హోమాలు చక్రాబ్జ మండలార్చన విశేష హోమాలు పరివార దేవత హోమాలు మం గళ శాసనాలు నిర్వహించారు. ఉత్సవాలు ఈనెల 29వ తేదీతో ముగిస్తాయి. ఈ కార్య క్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి కె.వి ఆశా కిరణ్మయి, ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ వింజమూరు గౌరీ శంకర్ ప్రసాద్, కమిటీ సభ్యులు శ్రీవారి సేవకులు ఆలయ ప్రధాన అర్చకులు గుంటూరు శాంతా రామా చార్యులు, వెంకట లక్ష్మీనారాయణ చార్యులు పుర ప్రజలు భక్తులు పాల్గొన్నారు.

## డాక్యుమెంట్ రైటర్ల ఉపాధిని దెబ్బతీయ్యొద్దు : సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు మురళి

(నక్కపల్లి,ప్రభాతవార్త)



డాక్యుమెంట్ రైటర్ల ఉపాధిని దెబ్బతీయవొద్దని, రాష్ట్ర ప్రభుత్వం జీవో 396 విరమించుకోవాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డివి మురళీకృష్ణ కోరారు. నక్కపల్లి సబ్ రిజిస్టర్ కార్యాలయం పరిధిలోని దస్తావేజు లేఖరుల పెన్డౌన్ సమ్మె మంగళవారం నాటికి 9వ రోజుకు చేరుకుంది. ఈ నిరసన కార్యక్రమంలో కార్యదర్శి బత్తుల శ్రీను, కోశాధికారి లోవరత్నం, సహాయ కార్యదర్శి డిఎంపి కుమార్, త్రినాథ్, నవీన్, కూరపాటి సూర్యనారాయణ నూకరాజు, బొంతు రాజు, సాయి తేజ, శేఖర్,మదీనా, బాబ్జి, కొంగర రాంబాబు గోవిందు, చిరంజీవి, లక్ష్మీ, వరహాలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు షిరిడి సాయిబాబాకు లక్ష గులాబి పువ్వులతో అర్చన

మాధవధార,జూలై 28, ప్రభాతవార్త



గురు పౌర్ణమి పురస్కరించుకొని మురళి నగర్ షిరిడి సాయి బాబా ఆలయంలో బుధవారం స్వయంగా భక్తుల చేతుల మీదుగా లక్ష గులాబీ పువ్వులతో అర్చన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన కార్యదర్శి సనపల వరప్రసాద్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణ లో మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. భక్తులు ఈ ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొవాలని కోరారు. రామాలయంలో 20వ గురు పౌర్ణమి పూజ మహోత్సవ సందర్భంగా మంగళవారం గణపతి పూజ, పుణ్యాహవాచనం, అంకురార్పణ, పంచామృత అభిషేకం, సుదర్శన హోమం, విరాళాధాతల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం జరిగింది. సాయంత్రం 6 గంటలకు సిద్దిబుద్ధి సమేత గణపతి కళ్యాణం జరిగింది. బ్రహ్మశ్రీ అయలూరి శ్రీనివాస్ దీక్షితులు, శ్రీమాన్ శ్రీ సీతారామాచార్యులు, శ్రీమాన్ శ్రీ శేషాచార్యులు, శ్రీమాన్ శ్రీ దాసబాబు, విశాఖపట్నం నగర పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగుచి, ఆంధ్ర యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ రాజశేఖర్, వెస్ట్ జోన్ జోనల్ కమిషనర్ బోడేపల్లి రాము,ఆలయ అధ్యక్షులు టీ నారాయణరెడ్డి, ఆలయ ప్రధాన కార్యదర్శి సనపల వరప్రసాద్, ఇతర కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## ఆపన్న సేవలో తరించిన హరే కృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధులు

### సింహాచలం గిరి ప్రదక్షిణలో పాల్గొన్న పద్మశ్రీ మధు పండిత దాస్

విశాఖపట్నం, జూలై 28, ప్రభాతవార్త



గిరి పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని సింహాచలం క్షేత్రంలో హరే కృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధులు భక్తి శ్రద్ధలతో అప్పన్న సేవలో పాల్గొన్నారు. శ్రీ శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకుని, స్వామివారి సేవలో తరించిన అనంతరం 32 కిలోమీటర్ల గిరి ప్రదక్షిణను పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో – గ్లోబల్ హరే కృష్ణ మూవ్‌మెంట్ చైర్మన్, ఇస్కాన్ బెంగళూరు అధ్యక్షుడు బృందావన్ చంద్రోదయ మందిర్ చైర్మన్, అక్షయ పాత్ర వ్యవస్థాపక చైర్మన్ పద్మశ్రీ మధు పండిత దాస్, హరే కృష్ణ మూవ్‌మెంట్ విశాఖపట్నం ప్రెసిడెంట్ నిష్కించిన భక్త దాస్, హరే కృష్ణ మూవ్‌మెంట్ విజయవాడ ప్రెసిడెంట్ వంశీధర దాస్ తదితరులు పాల్గొన్నారు. పద్మశ్రీ మధు పండిత దాస్ మాట్లాడుతూ, భక్తివేదాంత స్వామి ప్రభుపాదులు ప్రపంచవ్యాప్తంగా లక్ష్మీనరసింహ స్వామివారి ఆరాధనను విస్తృతంగా పరిచయం చేశారని తెలిపారు. ప్రపంచంలోని హరే కృష్ణ మూవ్‌మెంట్ భక్తులు తమ నిత్య ఆధ్యాత్మిక సాధనలో భాగంగా ప్రతిరోజూ శ్రీ నరసింహ స్వామివారి కీర్తనను ఆలపిస్తారని చెప్పారు. గిరి పౌర్ణమి రోజున శ్రీ శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామివారిని దర్శించుకుని గిరి ప్రదక్షిణ చేయడం ఇది జీవితంలో ఒక దివ్యమైన ఆధ్యాత్మిక అనుభూతిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. హరే కృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధులు శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామివారి ఆశీస్సులు సమస్త ప్రజలపై ఉండాలని, ప్రపంచ శాంతి, సౌభాగ్యం, సనాతన ధర్మ పరిరక్షణ కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

## జాతీయ రహదారులపై పశువుల ప్రమాదాల నివారణకు ఎన్‌హెచ్‌ఏఐ ప్రత్యేక చర్యలు

### ఎన్‌హెచ్-16లో ప్రమాదకర ప్రాంతాలపై నిరంతర నిఘా.. 1033 హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని సూచన

విశాఖపట్నం, జూలై 28, ప్రభాతవార్త

జాతీయ రహదారులపై సంచరించే పశువుల కారణంగా జరిగే రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) అమరావతి ప్రాజెక్టు అమలు విభాగం (పీఐయూ) ప్రత్యేక చర్యలను చేపట్టింది. రహదారి భద్రతను మెరుగుపరచడంతో పాటు ప్రయాణికుల సురక్షిత ప్రయాణమే లక్ష్యంగా ఈ చర్యలు కొనసాగుతున్నాయని తెలిపింది. చిలకలూరిపేట-విజయవాడ ఎన్‌హెచ్-16 మార్గంలో నాలుగు ప్రమాదకర ప్రాంతాలు, మూడు ప్రమాద బ్లాక్‌స్పాట్‌లను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించింది. అలాగే చిలకలూరిపేట-విజయవాడ మార్గం, చిలకలూరిపేట బైపాస్, విజయవాడ బైపాస్, గిద్దలూరు-వినుకొండ ఎన్‌హెచ్-544డీ మార్గాల్లో పశువులను తొలగించే ప్రత్యేక డ్రైవ్‌లను క్రమం తప్పకుండా నిర్వహిస్తోంది. ఇన్సిడెంట్ మేనేజ్‌మెంట్ బృందాలు, రూట్ ప్యాట్రోల్ వాహనాల సహాయంతో మూడు షిఫ్ట్‌లలో 24 గంటలపాటు గస్తీ నిర్వహిస్తూ రహదారిపైకి వచ్చే పశువులను సురక్షితంగా తొలగించి, యజమానులను గుర్తించిన సందర్భాల్లో వారికి అప్పగిస్తున్నట్లు తెలిపింది. సమీప గ్రామాల్లో పశువుల యజమానులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, జాతీయ రహదారులపై పశువులను వదలవద్దని సూచిస్తున్నారు. పోలీసు శాఖ, మున్సిపల్ సంస్థలు, గ్రామపంచాయితీలతో సమన్వయ సమావేశాలు నిర్వహిస్తూ నివారణ చర్యలను మరింత బలోపేతం చేస్తున్నట్లు పేర్కొంది. వాహనదారులు వేగ పరిమితులను పాటిస్తూ అప్రమత్తంగా ప్రయాణించాలని, రహదారిపై పశువులు కనిపిస్తే వెంటనే 1033 జాతీయ రహదారి అత్యవసర హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని ఎన్‌హెచ్‌ఏఐ విజ్ఞప్తి చేసింది. 1033 హెల్ప్‌లైన్ 24 గంటలూ అందుబాటులో ఉండి, పశువులు లేదా ఇతర అత్యవసర పరిస్థితులపై తక్షణ స్పందన అందిస్తుందని వెల్లడించింది.

## వ్యవసాయ యాంత్రీకరణకు కొత్త ఊపు

### ఆనందపురంలో కస్టమ్ హైరింగ్ సెంటర్ ఏర్పాటు

ఆనందపురం, జూలై 28, ప్రభాతవార్త



వ్యవసాయ రంగంలో యాంత్రీకరణను ప్రోత్సహించి, చిన్న, సన్నకారు రైతులకు తక్కువ ఖర్చుతో ఆధునిక వ్యవసాయ యంత్రాలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఆనందపురం భూమాత అగ్రికల్చర్ అనుబంధ రైతు ఉత్పత్తిదారుల కో-ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ కార్యాలయాల సముదాయం వద్ద వ్యవసాయ యంత్రాల కేంద్రం (కస్టమ్ హైరింగ్ సెంటర్) ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, వ్యవసాయ శాఖ, జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ సహకారంతో ఏర్పాటు చేశారు. రైతులు సొంతంగా ఖరీదైన వ్యవసాయ యంత్రాలు కొనుగోలు చేయాల్సిన అవసరం లేకుండా, అవసరమైన సమయంలో అద్దె ప్రాతిపదికన యంత్రాలను పొందే విధంగా ఈ కేంద్రం సేవలు అందించనుంది. రైతులకు అందుబాటులో ఉండే యంత్రాలు కస్టమ్ హైరింగ్ సెంటర్‌లో సాధారణంగా ట్రాక్టర్లు, రోటావేటర్లు, కల్టివేటర్లు, పవర్ వీడర్లు, సీడ్ డ్రిల్లులు, స్ప్రేయర్లు, రీపర్లు, వరి నాటే యంత్రాలు, పంట కోత యంత్రాలు తదితర ఆధునిక వ్యవసాయ పరికరాలను అద్దెకు అందుబాటులో ఉంచుతారు. దీంతో వ్యవసాయ పనులు వేగంగా, నాణ్యతతో పూర్తవుతాయి. రైతులకు కలిగే ప్రయోజనాలు ఖరీదైన వ్యవసాయ యంత్రాలు కొనుగోలు చేయాల్సిన అవసరం ఉండదు. అద్దె ప్రాతిపదికన తక్కువ వ్యయంతో యంత్రాలు లభిస్తాయి. సాగు పనులు సకాలంలో పూర్తవడంతో దిగుబడి పెరుగుతుంది. కూలీల కొరత సమస్యకు పరిష్కారం లభిస్తుంది. వ్యవసాయ ఖర్చులు తగ్గి రైతుల ఆదాయం పెరిగే అవకాశం ఉంటుంది. చిన్న, సన్నకారు రైతులు కూడా ఆధునిక వ్యవసాయ సాంకేతికతను వినియోగించే అవకాశం కలుగుతుంది. రైతు సంఘాలకు ఆదాయ వనరు ఈ కస్టమ్ హైరింగ్ సెంటర్ ద్వారా రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘానికి స్థిరమైన ఆదాయం సమకూరడంతో పాటు, గ్రామీణ మహిళా సంఘాలు, రైతు సంఘాల ఆర్థిక స్వావలంబనకు కూడా ఇది దోహదపడనుంది. వ్యవసాయ యాంత్రీకరణను గ్రామీణ స్థాయికి చేరవేసి, రైతుల సాగు వ్యయాన్ని తగ్గించి, అధిక దిగుబడులు సాధించేలా ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో భాగంగా ఆనందపురంలో ఏర్పాటు చేసిన ఈ కస్టమ్ హైరింగ్ సెంటర్ రైతులకు ఎంతో ఉపయోగకరంగా మారనుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## గిరి ప్రదక్షిణ భక్తులకు సౌత్ కోస్ట్ రైల్వే ఎంప్లాయిస్ సంఘం ఫలహారం పంపిణీ

మాధవధార , జూలై 28 ప్రభాతవార్త



వరాహ నరసింహస్వామి గిరి ప్రదక్షిణ సందర్భంగా సౌత్ కోస్ట్ రైల్వే ఎంప్లాయిస్ సంఘం వారి ఆధ్వర్యంలో అల్పాహారాన్ని అసిస్టెంట్ జనరల్ సెక్రెటరీ మూల మహేష్ (బంగారం) పర్యవేక్షణలో మాధవధార 60 అడుగుల రోడ్డులో మంగళవారం ఏర్పాటు చేశారు. ఎన్ఎఫ్ఐఆర్ జనరల్ సెక్రెటరీ మర్రి రాఘవయ్య ఆదేశాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలియజేశారు. జోనల్ ప్రెసిడెంట్ టీవీ చంద్రమౌళి, నాగేశ్వరరావు, సత్యనారాయణ, పాపారావు, బ్రాంచ్ కార్యదర్శి పాల్గొన్నారు. భక్తులకు అల్పాహారాన్ని పంపిణీ చేసిన మహేష్‌కు భక్తులు అభినందనలు తెలిపారు.

## 62వ వార్డులో రూ.2 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

గాజువాక,జూలై 28,ప్రభాతవార్త



విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గణబాబు సహకారంతో 62వ వార్డులో రూ.2 కోట్లకు పైగా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు వార్డు అధ్యక్షుడు మజ్జి మాలినాయుడు మంగళవారం శంకుస్థాపన చేశారు. త్రినాథపురంలో రూ.49.54 లక్షలతో రిటైనింగ్ వాల్స్, సీసీ రోడ్లు, డ్రైనేజీ మరమ్మత్తులు, దుర్గానగర్‌లో రూ.45.25 లక్షలతో రిటైనింగ్ వాల్స్, టీడీపీ కాలనీలో రూ.43.75 లక్షలతో రిటైనింగ్ వాల్స్, అంబేద్కర్ కాలనీలో రూ.45.50 లక్షలతో రిటైనింగ్ వాల్స్, అల్లూరి సీతారామరాజు కాలనీలో రూ.15.95 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ మరమ్మత్తులు, మెట్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన నిర్వహించారు. ఎమ్మెల్యే గణబాబు ఆదేశాల మేరకు చేపట్టిన ఈ పనులు పూర్తయితే వార్డులో మౌలిక సదుపాయాలు మరింత మెరుగుపడతాయని మజ్జి మాలినాయుడు తెలిపారు. కార్యక్రమంలో వార్డు నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

## శ్రీ జగన్నాథుని హుండీ ఆదాయం రూ.24.62లక్షలు

విశాఖపట్నం, జూలై 27, ప్రభాతవార్త



విశాఖపట్నం టౌన్ కొత్తరోడ్లో వేంచేసియున్న శ్రీ జగన్నాథ స్వామి దేవస్థానం వారి రథయాత్ర మహోత్సవాలలో భాగంగా మంగళవారం స్వామి వారి సంప్రోక్షణ పీఠారోహణం మరియు హుండీల లెక్కింపు జరిగింది. సోమవారం ఉదయం 10గంటలకు ప్రధాన ఉత్సవ అధికారి టి అన్నపూర్ణ ఆలయ ఈఓ టి.రాజగోపాల్ రెడ్డి, విశాఖ జిల్లా తనిఖీదారు ఎం శ్రీధర్, ధర్మ కర్తల మండలి చైర్మన్ ఎస్ రాజ్ కుమార్ మరియు సభ్యులు బి సత్యనారాయణ, ఆర్ రాము, ఎస్ జ్యోతి, యు ఆదిలక్ష్మి, పి కళ్యాణి, ఎమ్ రమణి, ఎన్ భాస్కర్, బి విజయదుర్గ, మంత్రి శాలివాహన్ మరియు పోలీసు వారి సమక్షంలో హుండీలు తెరిచి లెక్కింపు చేయగా, రథయాత్ర పది రోజులకుగాను హుండీ ఆదాయం రూ 24,62,145 వచ్చింది ఈ సంవత్సరం రథయాత్ర మహోత్సవాలలో హుండీల ఆదాయం క్రిందటి సంవత్సరం కంటే రూ 5,19,575 అధికంగా వచ్చింది. వచ్చే నెల 6 న దేవస్థానం వద్దనే 5000 మందికి మహా అన్నదానం కార్యక్రమం జరుగుతుంది. శ్రీ స్వామి వారి రథయాత్ర మహోత్సవాలను ఘనంగా నిర్వహించడంలో పూర్తి సహాయ సహకారాలు అందించిన పోలీస్ శాఖ వారికి, రెవిన్యూ శాఖ వారికి, గ్రేటర్ విశాఖ నగరపాలక సంస్థ వారికి, హెల్త్ శాఖ వారికి, ఫైర్ డిపార్ట్మెంట్ వారికి, రోడ్లు భవనాల శాఖ వారికి, విద్యుత్ శాఖ వారికి, ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులందరికీ కార్యనిర్వహణాధికారి టి.రాజగోపాల్ రెడ్డిధన్యవాదములు తెలిపారు.

## గిరి ప్రదక్షిణ భక్తులకు వాసవిక్లబ్ వారి ఫలహారం పంపిణీ

విశాఖపట్నం, జూలై 28 ప్రభాతవార్త



వరాహ నరసింహస్వామి గిరి ప్రదక్షిణ సందర్భంగా వాసవిక్లబ్ ఇంటర్నేషనల్, విశాఖపట్నం వారి ఆధ్వర్యంలో హెచ్. బి. కాలనీ లాస్ట్ బస్ స్టాప్ వద్ద గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులకు ఇడ్లీ, టమాటా బాత్ వంటి పలహారములు తయారుచేసి అందించారు. మంగళవారం సాయంత్రం 5 గంటల నుండి నిర్వహిం చిన ఈ కార్యక్రమాన్ని ప్రముఖ వ్యాపారవేత్త కంకటాల కృష్ణారావు – కుమారి దంపతులు ప్రారంభించారు. సుమారు 35 వేల ఇడ్లీలు, టమాటా బాత్ భక్తులకు అందజేశారు. ఈ సందర్భంగా వాసవిక్లబ్ ప్రతినిధులు సుగ్గ శివకుమార్, పూసర్ల సురేష్ కుమార్ కంకటాల సతీష్ లు మాట్లాడుతూ ఆర్యవైశ్యుల ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల్లో భాగంగా గిరి ప్రదక్షిణ భక్తులకు బలవర్ధకమైన ఫలహారం పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. సంఘం సభ్యులు స్వచ్ఛందంగా విరాళ రూపంలో అందించిన పచారీ సరుకులు మరియు నగదు మొత్తంతో భక్తులకు ప్రసాదం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవిక్లబ్, ఆర్యవైశ్య యువజన సంఘం, వాసవికళ్యాణమండప సంఘం, కన్యకా పరమేశ్వర దేవాలయం ప్రతినిధులు ఆరిశెట్టి దినకర్, దోమావెంకట బాలాజికుమార్, దుర్గా సోమేశ్వరరావు, పి.ఎస్.ఆర్. కిషోర్, బొడ్డు రఘు, వెదుళ్ళపల్లి బాబురావు, శ్రీనివాస రావు, కె.వి.రమణ, పూసర్ల సంజీవరావు, నల్లూరి నూకరాజు, సి.హెచ్. వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## బొత్సపేట గ్రామంలో అలుముకున్న విషాదఛాయలు

పద్మనాభం, జూలై 28, ప్రభాతవార్త



విజయనగరం జిల్లా చెల్లూరు వద్ద జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పద్మనాభం మండలం బొత్స పేట కి చెందిన నలుగురు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అమ్ముకున్నాయి. ఎన్నడూ లేని విధంగా ఈ ప్రమాదం జరగడంతో గ్రామం అంతా ఒక్కసారిగా ఉలిక్కిపడింది. అయితే పోలీసుల కథనం ప్రకారం ఇదే గ్రామానికి చెందిన 16 మంది రాయగడ మజ్జి గౌరమ్మ తల్లి దర్శనార్థము సోమవారం రాత్రి ఒక వ్యాన్ లో బయలుదేరి చెల్లూరు దగ్గర జాతీయ రహదారిపై ఆగి ఉన్నారు. అదే సమయంలో వెనకనుంచి వచ్చిన లారీ వ్యాను బలంగా ఢీకొట్టడంతో వ్యాన్ లో ఉన్న 16 మందిలో చింతపల్లి రామనాయుడు, మజ్జి నారాయణరావు, 10 సంవత్సరాల వయసు గల బి మోహన్ నాయుడు అక్కడికక్కడే మృతి చెందారు. చికిత్స పొందుతూ ఇదే గ్రామానికి చెందిన మజ్జి పైడితల్లి కూడా మృతి చెందిందని ఎంపీటీసీ చందక పైడినాడు చెప్పారు. మిగిలిన వారు కూడా తీవ్రంగా గాయపడ్డారు. విజయనగరంలో పలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను భీమిలి వైసిపి ఇన్చార్జి చిన్న శ్రీను, అనంత పద్మనాభ స్వామి సంక్షేమ సేవా సంఘం అధ్యక్షులు డి గోపి బాబు పరామర్శించి కుటుంబ సభ్యుల ను ఓదార్చి ధైర్యం చెప్పారు. అలాగే గోపి బాబు గ్రామంలో ఉన్న మృతదేహాల వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు రమణ పాల్గొన్నారు.

## సేరీఖండం గ్రామం వద్ద విజయనగరం రోడ్డులో అసంపూర్తి కల్వర్టు వల్ల నిలిచిపోయిన ట్రాఫిక్

పద్మనాభం, జూలై 28, ప్రభాతవార్త



మండలంలో షేరిట్ అన్న గ్రామం వద్ద విజయనగరం, సింహాచలం రోడ్‌లో ఉన్నఅసం పూర్తి కల్వర్టు వల్ల మంగళవారం ట్రాఫిక్ సమస్య తలెత్తింది. అయితే సింహాచలం గిరి ప్రదక్షిణకి విజయనగరం జిల్లా నుంచి ఉదయం నుంచి పలు వాహనాలపై భక్తులు పద్మనాభం మీదగా తరలి వెల్లారు. ఈ నేపథ్యంలో శేరిఖండం గ్రామం వద్ద అసంపూర్తి కల్వర్టు నిర్మాణం వల్ల పక్కన అప్రోచ్ రోడ్డును ఏర్పాటు చేశారు. ఇది గాతల పట్టడమే కాకుండా ఇరికగా ఉండడంతో మంగళవారము రద్దీగా తిరిగిన వాహనాలు కిలోమీటర్ దూరంలో నిలిచిపోయాయి. దీంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. పద్మనాం పోలీసులు గిరి ప్రదక్షణ విధులకు వెళ్లడంతో పోలీసులు ఎవరూ లేక ప్రయాణికులే ట్రాఫిక్ సమస్యను తీర్చుకున్నారు. అలాగే ఈ అప్రోచ్ రోడ్‌లో సాయంత్రం రెండు వాహనాలు ఢీకొనడం వల్ల ఏర్పడిన ట్రాఫిక్ సమస్య తో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ కలవర్టును త్వరగా పూర్తిచేసి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## ఈఎస్ఐ చట్టాలపై అవగాహన ఉండాలి

### కోరమాండల్ ఇంటర్నేషనల్‌లో కాంట్రాక్టర్లకు సదస్సు

గాజువాక, జూలై 28,ప్రభాతవార్త :



కాంట్రాక్టు కార్మికులకు చట్టపరంగా అందాల్సిన సామాజిక భద్రతపై ప్రతి ఒక్కరికీ పూర్తి అవగాహన ఉండాలని ఈఎస్ఐ అసిస్టెంట్ డైరెక్టర్ జి.వేణుమాధవ్ తెలిపారు. విశాఖపట్నం లోని కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థలో 'సామాజిక భద్రతా సంహిత-2020' నిబంధనలపై సోమవారం కాంట్రాక్టర్ ప్రతినిధులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఈఎస్ఐ నిబంధనలు, యజమానులు, కాంట్రాక్టర్ల బాధ్యతలను వివరించారు. చట్టపరమైన అంశాలను సులభంగా అమలు చేసే విధానాలపై ఆచరణాత్మక సూచనలు చేశారు. గాజువాక ఈఎస్ఐ బ్రాంచ్ మేనేజర్ పి.రమేష్ కుమార్ మాట్లాడుతూ కార్మికుల సంక్షేమానికి సంస్థలు కట్టుబడి ఉండాలన్నారు. కార్యక్రమంలో కంపెనీ హెచ్ఆర్ ఏవీపీ కె.వి.వి.వై.ఎస్.నారాయణ, సీనియర్ జీఎం ఆర్.శ్రీనివాసరావు, మేనేజర్ జి.గిరిధర్, 60 మందికి పైగా కాంట్రాక్టర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## 30న చలో కలెక్టరేట్‌కు తరలిరండి.. పోస్టల్ ఆవిష్కరణ

గాజువాక - ప్రభాతవార్త



సిఐటియు మల్కాపురం ఆఫీసులో కనీస వేతనం 26,వేల రూపాయలు అమలు చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో వ్యాప్తంగా ఈనెల 30న కార్యక్రమం నిర్వహిస్తుంది. ఈ సందర్భంగా చలో కలెక్టరేట్ పోస్టల్ ఆవిష్కరణ సిఐటియు విశాఖ జిల్లా ఉపాధ్యక్షులు ఎం. జగ్గు నాయుడు ఆవిష్కరించారు ఆయన మాట్లాడుతూ హెచ్పిసిఎల్ షిప్పియార్డు డాక్ యార్డ్ కిప్ బిల్డింగ్ సెంటర్ ఎస్ బి సి కోరమండల్ నేవీ ఉద్యోగ కాలనీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు ప్రభుత్వ జీవో ప్రకారం జీతాలు ఈఎస్ఐ, పి ఎఫ్ ప్రతి నెల టైం కు జీతాలు ఓటీ డబుల్, పండగ సెలవులు బోనస్ పని ప్రదేశాల్లో మంచినీరు మరుగుదొడ్లు భోజన విశ్రాంతి గదుల సదుపాయం స్థానికులకు ఉపాధి ప్రమాదాలు జరిగితే నష్టపరిహారం ఏవి ఈ కంపెనీలో అమలు కావడం లేదు ఇ ఎస్ ఐ పిఎఫ్ లో మోసాలు చేస్తున్నారు ఈ సదుపాయాలు కార్మికులు అడిగితే పని నుండి తొలగిస్తున్నారు. సెటిల్మెంట్ మెంట్ ఇవ్వడం లేదు. ఈ సమస్యలన్నీ పరిష్కారం చేయడం కోసం కంపెనీ యాజమాన్యాల దృష్టికి తీసుకువెళ్లి చట్టపరమైన హక్కులు అమలు చేయని కాంట్రాక్టర్లపై యజమానులు చర్యలు తీసుకునే విధంగా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారం కోసం జరిగే ధర్నాలు కార్మికులంతా పాలు కావాలని అన్నారు. కార్మికులకు నష్టం కలిగించే 4లేబర్ కోడ్స్ రద్దు చేయాలని పళ్ళు సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తున్నామని తెలిపారు ఈ పోస్టల్ ఆవిష్కరణలో సీఐటీయూ మల్కాపురం జోన్ ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మణమూర్తి జోన్ నాయకులు కె పెంటారావు పి పైడిరాజు రామారావు,రాంబాబు అప్పలనాయుడు శివ బద్రి, సత్యారావు, చిన్నమనాయుడు అప్పారావు తదితరులు పాల్గొన్నారు

## వైఎస్ఆర్సిపి అధినేత జగన్‌ను కలిసిన బెందాళం పద్మావతి

విశాఖపట్నం, జూలై 28, ప్రభాతవార్త



వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో వైఎస్సార్సీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా వైయస్సార్సీపి రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి బెందాళం పద్మావతి కలిశారు. ఈ సంద ర్భంలో కూటమి ప్రభుత్వం మహిళల పట్ల చేస్తున్న అకృత్యా లను, అన్యాయాలను తీవ్రంగా ప్రతిఘటిస్తున్నట్లు ఆమె జగన్‌కు వివరించారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న అనుచిత విధానాలపై మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పద్మావతికి వైఎస్ జగన్ సూచించారు.

## ప్రతీ ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కల్గి ఉండాలి

### శ్రీకనకమహాలక్ష్మి దేవస్థానం డైరెక్టర్ సాలాపు రామారావు

గాజువాక,జూలై 28,ప్రభాతవార్త



ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని శ్రీ కనకమహాలక్ష్మి దేవస్థానం డైరెక్టర్, 72వ వార్డు టీడీపీ నాయకుడు సాలాపు రామారావు అన్నారు. ఆషాఢ పౌర్ణమి గిరిప్రదక్షిణను పురస్కరించుకుని శ్రీ లక్ష్మి నరసింహ స్వామి భక్తుల కోసం ఆయన ఆర్థిక సహాయంతో స్వీట్ల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా గిరిప్రదక్షిణలో పాల్గొనే భక్తులకు ఈ విధంగా సేవలు అందించడం ఎంతో సంతోషాన్నిస్తుందన్నారు. స్వామివారిని దర్శించుకునేందుకు వెళ్లే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఈ పంపిణీ చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాల్ ప్రాక్టీస్‌కు సహకరిస్తే పరీక్ష కేంద్రం రద్దు చేస్తాం..

విశాఖపట్నం, జూలై 28, ప్రభాతవార్త

ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం పరిధిలో జరుగుతున్న పరీక్షలలో మాల్ ప్రాక్టీస్‌కు సహకరించే కళాశాలల్లో పరీక్ష కేంద్రాలను రద్దు చేస్తామని దూర విద్యా కేంద్రం సంచాలకులు ఆచార్య డి.ఏ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం దూరవిద్య పరీక్ష కేంద్రాల తనిఖీలో భాగంగా ఆయన స్వాడ్ బృందంతో కలిసి గజపతినగరంలోని ఒక కళాశాలలో ఆకస్మికంగా తనిఖీలు జరిపారు. ఆ సమయంలో చూచిరాతకు పాల్పడుతున్న 38 మంది విద్యార్థులను గుర్తించి వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. అదేవిధంగా విద్యార్థులకు సహకరిస్తున్న కళాశాలపై సైతం క్రమశిక్షణ చర్య తీసుకోవాలని ఉన్నతాధికారులకు దూర విద్యా కేంద్రం అధికారులు సిఫారసు చేశారు. మాల్‌ప్రాక్టీస్ కి సహకరించే కళాశాలలపై విశ్వవిద్యాలయ పరంగా కఠిన చర్యలు తీసకుంటామని స్పష్టం చేశారు. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా ప్రస్తుతం జరుగుతున్న పరీక్షల షెడ్యూల్ ముగిసిన వెంటనే ఈ పరీక్ష కేంద్రంపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. విద్యార్థులు విశ్వవిద్యాలయ నిబంధనలకు అనుగుణంగా పరీక్షలకు హాజరు కావాలని, ఎటువంటి అనైతిక చర్యలకు పాల్పడవద్దని అధికారులు తెలిపారు. తల్లిదండ్రుల సైతం తమ పిల్లల ప్రవర్తనను గమనించాలని వారికి తగిన మార్గ నిర్దేశం అందించాలని సూచించారు.

## శ్రీహరిపురం మహాత్మాగాంధీ వ్యాపార సముదాయంలో పశు మాంసం అమ్మకాలను నిరోధించాలి

### ఎమ్మెల్యే, కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేస్తాం -ఫిష్ మార్కెట్ కమిటీ హెచ్చరిక

గాజువాక,జూలై 28,ప్రభాతవార్త



శ్రీహరిపురంలో మార్కెట్ లో గత నాలుగు దశాబ్దాలుగా ప్రశాంత వాతావరణంలో నడుస్తున్న చేపల మార్కెట్ ప్రాంగణంలో పశు మాంసం విక్రయాలు చేపట్టడానికి సిద్ధమవుతున్న వారిని వెంటనే నిరోధించాలని మార్కెట్ అధ్యక్షురాలు ఎం.నూకమ్మ డిమాండ్ చేశారు. విశాఖపట్నంలోని ఏ ఇతర చేపల మార్కెట్‌లోనూ ఇటువంటి అమ్మకాలు జరగడం లేదని ఆమె స్పష్టం చేశారు. స్థానికంగా చుట్టుపక్కల పలు దేవాలయాలు ఉన్నందున భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా ప్రవర్తించవద్దని, మార్కెట్ తరపున ఇటువంటి విక్రయాలు జరిపేవారికి హెచ్చరికలు జారీ చేస్తున్నామని తెలిపారు. విక్రయాలు నిరోదించాలి లేని పక్షాన పెద్ద ఎత్తున ఎదుర్కొంటామని,ఈ విషయమై స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్ విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులకు బుధవారం వినతిపత్రాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

## క్యాంపస్ సెలెక్షన్స్‌లో ప్లేస్‌మెంట్ సాధించిన విద్యార్థులను అభినందించిన ఏయూ వీసీ

### రూ.12 లక్షల ప్యాకేజీ ఉద్యోగాలు సాధించిన విద్యార్థినులు

విశాఖపట్నం, జూలై 28, ప్రభాతవార్త

ఆంధ్ర విశ్వవిద్యాలయం మహిళా ఇంజనీరింగ్ కళాశాలలోని ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ (ఈఈఈ) విభాగం (2022-26 బ్యాచ్) విద్యార్థినులు రోషినిషా బేగం, ఆర్. నవ్యలు ప్రముఖ సంస్థ 'స్నేడర్ ఎలక్ట్రిక్' క్యాంపస్ సెలెక్షన్లలో రూ. 12 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలు సాధించారు. ప్రతిష్టాత్మకమైన సంస్థలో ఈ ఉపాధి అవకాశాలు సాధించిన విద్యార్థినులను ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.పి. రాజశేఖర్ తన కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య జి.పి. రాజశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిభతో ఇటువంటి అంతర్జాతీయ సంస్థల్లో ఉద్యోగాలు సాధించడం విశ్వవిద్యాలయానికి గర్వకారణమన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రతీ విద్యార్థికి ఉపాధి అవకాశాలను కల్పించే విధంగా ఏయూ కృషి చేస్తోందన్నారు. విద్యార్థిగా ఉన్న సమయంలో ఉపాధి సాధనకు అవసరమైన నైపుణ్యాలను అందించే కార్యక్రమాలను సైతం నిర్వహిస్తున్నామన్నారు. రోషినిషా బేగం 'స్నేడర్ ఎలక్ట్రిక్'తో పాటు వేదాంతు, ఎఎం /ఎన్ఎస్ కంపెనీల నుండి ఉద్యోగ అవకాశం పొందగా, ఆర్. నవ్య 'స్నేడర్ ఎలక్ట్రిక్'తో పాటు ఎల్ అండ్ టీ సంస్థలో ఉద్యోగ అవకాశం సాధించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఆర్.పద్మశ్రీ, తదితరులు పాల్గొన్నారు. వీరిని కళాశాల ఆచార్యులు, విద్యార్థులు అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.

## గిరి ప్రదక్షిణ భక్తులకు సిఎంఆర్ ప్రసాద వితరణ

విశాఖపట్నం, జూలై 28 ప్రభాతవార్త



శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి గిరి ప్రదర్శన సందర్భంగా భక్తులకు సీతమ్మధార వెంకటేశ్వర స్వామి గుడి దగ్గర సీఎంఆర్ సంస్థ ఏర్పాటుచేసిన భారీ ప్రసాద వితరణ, స్వామివారి ఆలయ నమూనా విగ్రహాన్ని సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి ప్రసాదాలవితరణ కేంద్రాన్ని ప్రారంభించారు. స్వామి వారి ప్రసాద్ వితరణ రేపు సాయంత్రం వరకు కొనసాగుతుందని శ్రీ వరాహలక్ష్మీనరసింహస్వామి వారి ఆశీస్సులతో ప్రజల సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీఎంఆర్ సంస్థ నిర్వాహకులు. మాడా. లింగమూర్తి. శంకర్రావు. లింగేశ్వరరావు. స్థానిక రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## ఇంటింటికీ కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారం

### గంటా శ్రీనివాసరావు ఆదేశాలతో ఆరో వార్డులో డోర్ టు డోర్ ప్రచారం

పిఎం పాలెం, జూలై 28, ప్రభాతవార్త



భీమిలి నియోజకవర్గ మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించే లక్ష్యంతో విశాఖ నగరంలోని ఆరో వార్డులో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఇంటింటికీ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఆరో వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గరే గురునాథ్ నాయకత్వంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. మహిళలకు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, నెలకు రూ.4 వేలు వృద్ధాప్య పెన్షన్‌ను ప్రతి నెల ఒకటో తేదీన అందజేయడం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, "తల్లికి వందనం" పథకం కింద ఇంటిలో ఉన్న ప్రతి అర్హ విద్యార్థికి రూ.15 వేల ఆర్థిక సాయం, రైతు భరోసా వంటి పథకాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా సీసీ రోడ్లు, డ్రైనేజీలు వంటి మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రజలకు వివరించారు. రాష్ట్రం ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ, ఇచ్చిన హామీలను అమలు చేస్తూ సంక్షేమం, అభివృద్ధిని సమన్వయంతో ముందుకు తీసుకెళ్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని నాయకులు పేర్కొన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, వాటి పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి దాసరి శ్రీనివాసరావు, ఆరో వార్డు కార్యదర్శి లోడగల జానకిరామ్, బీసీ సెల్ అధ్యక్షుడు రెడ్డి సత్యనారాయణ, మహిళా అధ్యక్షురాలు పెంటకోట బబ్బేలు, కుప్పాక రామకృష్ణ, పోతిన రాము, మామిడి రమణ, పోతిన నరేష్, గవిడి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే సమస్యలు పరిష్కరించండి

**• కేంద్ర మంత్రి సోమన్నకు అనంతపురం ఎంపి అంబికా లక్ష్మీనారాయణ వినతి**

**అనంతపురం, జులై 28 ప్రభాతవార్త బ్యూరో:** అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న రైల్వే సమస్యల పరిష్కారం, ప్రయాణికులకు మెరుగైన రైల్వే సౌకర్యాల కల్పన, రైల్వే మౌలిక వసతుల అభివృద్ధి లక్ష్యంగా అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, న్యూఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్నని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పలు కీలక అంశాలపై వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా అనంతపురం జిల్లా ప్రజలు చాలా కాలంగా ఎదురుచూస్తున్న రైల్వే సంబంధిత సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లిన ఎంపి, రైళ్ల నిలుపుదలలు, కొత్త రైలు సర్వీసులు, సమయాల పునరుద్ధరణ, అండర్ పాస్‌లు, ఫ్లైఓవర్లు, స్టేషన్ల అభివృద్ధి వంటి అంశాలపై సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా అనంతపురం, గుత్తి, గుంతకల్లు, కల్లూరు, రాయలచెరువు ప్రాంతాల్లో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు నిలుపుదల కల్పించాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు. అలాగే ఉదయం వేళ బెంగళూరుకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, గుంతకల్లు నుంచి ఉదయం 7 గంటలకు బయలుదేరి బెంగళూరుకు చేరుకుని, తిరిగి మధ్యాహ్నం 3 గంటలకు బెంగళూరు నుంచి



గుంతకల్లుకు వచ్చే విధంగా కొత్త ప్యాసింజర్ రైలును ప్రారంభించాలని కోరారు. అదేవిధంగా ప్రస్తుతం ప్రత్యామ్నాయ రోజుల్లో మాత్రమే నడుస్తున్న కొండవీడు ఎక్స్‌ప్రెస్‌ను ప్రతిరోజూ నడిపేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. బెంగళూరు-విజయవాడ మధ్య అనంతపురం మీదుగా కొత్త వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభించాలి విజ్ఞప్తి చేశారు. తుంగభద్ర ఎక్స్‌ప్రెస్ (17607)ను కర్నూలు వరకు కాకుండా గుంతకల్లు వరకు పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా అనంతపురం రైల్వే స్టేషన్‌లో రాజధాని ఎక్స్‌ప్రెస్ (22691/ 22692), యశ్వంత్‌పూర్ - బీదర్ ఎక్స్‌ప్రెస్ (16571/ 16572) కు నిలుపుదల కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే బెంగళూరు వెళ్లే ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారవేత్తలకు అనుకూలంగా ఉదయం సర్వీసు, తిరుగు ప్రయాణానికి మధ్యాహ్నం బెంగళూరు నుండి సౌకర్యవంతమైన రైలు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతపురం మీదుగా నడుస్తున్న మెము రైలు (66559/ 66560)లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతం ఉన్న 12 కోచ్‌లకు అదనంగా మరో నాలుగు కోచ్‌లు జోడించాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ వినతిని సానుకూలంగా స్వీకరించిన కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్న, అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన అన్ని అంశాలను రైల్వే బోర్డు అధికారులతో సమీక్షిస్తామని తెలిపారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల సమయంలోనే రైల్వే బోర్డు అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ప్రతి అంశాన్ని పరిశీలించి సాధ్యమైన మేరకు పరిష్కార చర్యలు చేపడతామని హామీ ఇచ్చారని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ తెలిపారు.

# పవన్ ఆదేశం.. సాగునీరు విడుదల

**• కలెక్టర్‌తో ఫైవ్ మాన్ కమిటీ సభ్యుల చర్చలు.. • రోజుకు వెయ్యి క్యూసెక్కుల నీరు**

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జులై 28 ప్రభాతవార్త:** కాకినాడ జిల్లా పిఠాపురం ఆయకట్టుకు సాగునీరు విడుదల చేయకుండా వరి స్థానంలో ఆరుతడి పంటలు వేసుకోమని ఇరిగేషన్ వ్యవసాయ అధికారులు చెప్పా పెట్టకుండా నివేదిక విడుదల చేశారు. ఈ నేపథ్యంలో ఆయకట్టు రైతులు సాగునీటి సంఘాల అధ్యక్షులు ఫైవ్ మాన్ కమిటీ సభ్యులు పవన్ కళ్యాణ్ కార్యాలయ అధికారులు సోమవారం ఆర్ అండ్ బి అతిథి గృహంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రైతులు అధికారుల నియంత్రత్వ నిర్ణయాలపై విరుచుకుపడ్డారు. ఈ విషయాన్ని డిప్యూటీ సిఎం కార్యాలయ అధికారులు పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. రైతుల సమస్యపై స్పందించిన డి.సిఎం తక్షణమే పిఠాపురం ఆయకట్టుకు నీటిని విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఎకరాకు నీరందించే బాధ్యత అధికారులదేనని హెచ్చరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్ జల వనరుల శాఖ అధికారులు, ఫైవ్ మాన్ కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ హరిప్రసాద్, కాకినాడ ఎంపి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి బాబు, ఓదూరి కిషోర్, జగంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, కాకినాడ



రూరల్ ఎమ్మెల్యే పంతంనానాజీ, ప్రాజెక్ట్ చైర్మన్లు సాగునీటి సంఘాల అధ్యక్షులు రైతులతో మంగళవారం ప్రత్యేక సాగునీటి సలహా మండలి సమావేశం ఏర్పాటు సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో ముందుగా ఫైవ్ మాన్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ పిఠాపురం రైతులు కష్టాల్లో ఉన్నారని నారుమడులు ఎండిపోతున్నా యని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అవసరమైతే నీటి కోసం రైతులు కూడా తిరిగేందుకు తాము సిద్ధంగా ఉన్నా మన్నారు. ప్రతి గ్రామంలో లస్కర్లు రైతులు అధికారులతో కలిసి కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. రాబోయే రోజుల్లో వర్షపాతం మరింత తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున రైతులందరూ పంట ఇన్సూరెన్స్ కట్టుకునేలా అవగాహన కల్పిస్తామన్నారు. నీటిమట్టం తక్కువ కాకుండా చూస్తూ తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టామని ఈ సందర్భంగా తెలియజేశారు. ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్వయంగా ఈ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తారని చెప్పారు. దీనిపై జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ స్పందిస్తూ అవసరమైతే ఎగువ ప్రాంతానికి నీటిని నిలిపివేసి పిఠాపురానికి ప్రాధాన్యం ఇస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో ఇచ్చిపుచ్చుకునే ధోరణితో సానుకూల వాతావరణం ఏర్పడటంతో ఏలేరు జలాశయం నుంచి విడుదల చేసే నీటిని వంతుల వారివిధానంలో ఎలా పంపిణీ చేయాలన్న ఎజెండాపై అధికారులు ప్రజా ప్రతినిధులు చర్చించారు. ఏలేరు జలాశయంలోని నీటిని ఖరీఫ్ పంట పూర్తి కాలం 120 రోజులుగా నిర్ధారించి పిఠాపురం పెద్దాపురం కిర్లంపూడి ఆయకట్టులకు నీరు అందించేందుకు షెడ్యూలు తయారు చేశారు. సమావేశంలో జల వనరుల శాఖ ఇఎన్‌సి వెంకటేశ్వరరావు, ఎస్ఇ శ్రీనివాసరావు, ఇఇ శేషగిరి, ఏలేరు ప్రాజెక్టు చైర్మన్ బస్సా వీరబాబు, వైస్ చైర్మన్ వూట నాని బాబు, ఈస్టన్ డెల్టా చైర్మన్ మురాలశెట్టి సునీల్ కుమార్, రైతులు పాల్గొన్నారు.



## అవుట్ సోర్సింగ్ విధానం రద్దు చెయ్యాలి

**• విఆర్ఎలకు పదోన్నతులు కల్పించి నియమించాలి**

**• ఎపి విఆర్ఎ వెల్ఫేర్ అండ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గుజ్జుల ఈశ్వరయ్య**

**విజయవాడ, జులై 28 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ శాఖలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో కలెక్టరేట్, ఆర్డిఓ కార్యాలయాలు నందు కంప్యూటర్ ఆపరేటర్, ఆఫీస్ సబార్డినేట్, డ్రైవర్, వాచ్‌మెన్ పోస్టుల నందు కొత్తగా రిక్రూట్ చేసి నియమించాలనే ప్రభుత్వం ప్రతిపాదనను వెంటనే విరమించుకోవాలని ఎపి విఆర్ఏ వెల్ఫేర్ అండ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గుజ్జుల ఈశ్వరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దశాబ్దాలు కాలంగా గ్రామాలను తహశీల్దార్ కార్యాలయాలను నమ్ముకుని ప్రభుత్వంకు వెట్టి చాకిరీ చేస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకు(విఆర్ఏ)లకు పదోన్నతులు కల్పించి వెంటనే నియమించాలన్నారు. గ్రామ ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఎన్నో విశేష విస్తృత సేవలు విఆర్ఎలు నిర్వహిస్తున్నారని వివరించారు. పదోన్నతుల కోటాలో కూడా చాలా వ్యత్యాసం ఉందని, ప్రస్తుతం ఉన్న 30శాతంను 70శాతంగా పెంచి విఆర్ఎలకు పదోన్నతులు కల్పించి వెంటనే నియామకాలు చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు నల్లిపోగు నాగేశం. రాష్ట్ర కార్యదర్శి కోమటిగుంట్ల శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# ఆక్వా ఫీడ్ ధరలు తగ్గించాలి

**• రౌండ్ టేబుల్ సమావేశంలో కౌలు రైతుల సంఘం డిమాండ్**

**విజయవాడ, జులై 28 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో విజయవాడ ప్రెస్ క్లబ్‌లో కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య అధ్యక్షతన ఆక్వా రైతుల సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. రైతు నేతలు మాట్లాడుతూ ఆక్వా రైతులు తీవ్ర సంక్షోభంలో ఉన్నారని, ఈ సంక్షోభం నుంచి ఆక్వా రైతులను ఆదుకోవడానికి తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం సమగ్రమైన విధి, విధానాలు రూపొందించాలని డిమాండ్ చేశారు. పి.జమలయ్య అధ్యక్షోపన్యాసంలో ఎన్నికల సందర్భంగా కూటమి నేతలు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. జోన్, నాన్ జోన్‌తో సంబంధం లేకుండా ఆక్వా రైతులందరికీ యూనిట్ విద్యుత్తును రూ.1.50 పైసలకే అందించాలని, పెండింగ్‌లో ఉన్న విద్యుత్ కనెక్షన్లను తక్షణమే మంజూరు చేయాలని, నిరంతరం త్రీఫేస్ విద్యుత్తును అందించాలని కోరారు. పెరిగిన ఫీడ్ ధరలు పూర్తిగా తగ్గించాలని లేదా ఆ భారాన్ని ప్రభుత్వమే సబ్సిడీ రూపంలో భరించాలని విజ్ఞప్తి చేశారు. మన దేశ అవసరాలు దృష్టిలో పెట్టుకొని దేశీయ రైతాంగం నష్టపోకుండా సోయాబీన్ దిగుమతి అనుమతించాలని కోరారు. తక్కువ ప్రీమియంతో రొయ్యల సమగ్ర బీమా పథకం రూపొందించి అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ మిషన్ మాజీ వైస్ చైర్మన్ ఎంఎస్ నాగిరెడ్డి, రైతు సంఘం సీనియర్ నాయకులు వై. కేశవరావు, జిల్లా ఆక్వా రైతు సంఘం నాయకులు రామ చంద్రరావు, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు యలమందారావు, కోనసీమ జిల్లా ఆక్వారైతు సంఘం నాయకులు గద్దం ప్రభాకర్, రైతుసంఘం నాయకులు ఎం.వెంకట్ రెడ్డి, అఖిల భారత కిసాన్ మహాసభ అధ్యక్షులు తోట ఆంజనేయులు, జాగృతి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరీదు ప్రసాద్‌బాబు, ఆంధ్ర ప్రదేశ్ రైతు కూలీ సంఘ నాయకులు సింగోతు నాగేంద్రరావు, పశ్చిమగోదావరి జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి వై వి ఆనంద్, అంబేద్కర్ కోనసీమ జిల్లా రైతు సంఘం అధ్యక్షులు సిహెచ్ తాతారావు, బాపట్ల రైతు సంఘం జిల్లా నాయకులు సూర్యనారాయణ రెడ్డి, కాకినాడ జిల్లా ఆక్వా రైతు సంఘం నాయకులు సురేష్ కొమార్తి శ్రీనివాసులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో రైతు కూలి సంఘం ఆంధ్రప్రదేశ్ కృష్ణా జిల్లా నాయకులు జె.జగన్, వైసిపి ఎన్టీఆర్ రైతు విభాగం జిల్లా అధ్యక్షులు శివాజీ, కౌలు రైతుల ఎన్టీఆర్ జిల్లా సంఘం ఉపాధ్యక్షులు పెయ్యల వెంకటేశ్వరరావు, ఏలూరు జిల్లా రైతు సంఘం నాయకులు చెంగల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య




## విద్యార్థుల భవిష్యత్తుకు ప్రేమతో సైకిళ్లు

**• 7,300 సైకిళ్ల పంపిణీ చేసిన కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు**

**కళ్యాణదుర్గం, జులై 28 ప్రభాతవార్త:** ప్రజాప్రతినిధిగా అభివృద్ధి పనులు చేయడం ఒక బాధ్యత అయితే, సమాజంలోని బలహీన వర్గాల భవిష్యత్తు కోసం సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగించడం నిజమైన ప్రజాసేవకు నిదర్శనం. అలాంటి సేవా దృక్పథంతో కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మరోసారి తన ప్రత్యేకతను చాటుకున్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు పడుతున్న ఇబ్బందులను గుర్తించి, వారి చదువుకు ఆటంకం కలగకుండా ఉండాలనే లక్ష్యంతో ఎస్సార్సీ ట్రస్ట్ ద్వారా రూ.5 కోట్ల వ్యయంతో 7,300 సైకిళ్లను పంపిణీ చేయడం నియోజకవర్గంలో ప్రశంసలు అందుకుంటోంది. మంగళవారం అనంతపురం జిల్లా కళ్యాణ దుర్గ నియోజకవర్గం శెట్టూరు మండలం ములకలేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో 9, 10 తరగతులు, ఇంటర్మీడియట్ చదువుతున్న గ్రామీణ విద్యార్థులకు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు స్వయంగా సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామీణ విద్యార్థులు దూర ప్రాంతాల నుంచి పాఠశాలలకు నడుచుకుంటూ రావాల్సిన పరిస్థితులు వారి చదువుపై ప్రభావం చూపుతున్నాయని, అలాంటి సమస్యలను దృష్టిలో పెట్టుకుని ప్రేమతో సైకిళ్లను అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు సైకిళ్లు ఇవ్వడమే కాకుండా, చదువు పూర్తయ్యాక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా తిమ్మసముద్రం వద్ద 4వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ ప్రాజెక్టు ద్వారా కళ్యాణదుర్గం ప్రాంత యువతకు పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎమ్మెల్యే సురేంద్రబాబు పేర్కొన్నారు.

# లోకేష్ రాజీనామా చేయకుంటే తిరుగుబాటే

**• యువత ఆకాంక్షలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం • వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి • యువత విద్యార్థి సమస్యలపై భారీ అనంతలో భారీ ర్యాలీ**

**అనంతపురం(సిటీ), జులై 28 ప్రభాత వార్త:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వహించిన డిఎస్సీలో పెద్ద ఎత్తున అవినీతి చోటు చేసుకుందని దీనికి నైతిక బాధ్యత వహించి మంత్రి నారాలోకేష్ రాజీనామా చేయకపోతే ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదని వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట రామిరెడ్డి హెచ్చరించారు. రాష్ట్రంలో దగా పడ్డ డిఎస్సీ అభ్యర్థులకు అండగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన, విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో అనంతపురం నగరంలో భారీ ర్యాలీని నిర్వహించారు. సప్తగిరి సర్కిల్‌లో మానవ హారంగా ఏర్పడి మంత్రి నారా లోకేష్‌కి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, పార్లమెంట్ పరిశీలకులు నరేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు విశ్వేశ్వర్‌రెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, మెట్టు గోవిందరెడ్డి, జడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మ, మాజీ ఎంపి గోరంట్ల మాధవ్, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు సాకే చంద్రశేఖర్, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర యాదవ్‌లతోపాటు పెద్ద ఎత్తున పార్టీ నేతలు, యువజన విద్యార్థి విభాగం నాయకులు పార్టీ శ్రేణులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ధర్నాను ఉద్దేశించి వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ డిఎస్సీ నియామకంలో స్పోర్ట్స్ కోటాలో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలుచోటు చేసుకున్నాయని, పరీక్షల విభాగంలోని ఉద్యోగుల డిఎస్సీలో ఎంపికైనట్లు ఆధారాలతో బయపడ్డాయన్నారు. వీటిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లు నోరు మెదపడం లేదన్నారు. డిఎస్సీలో జరిగిన అక్రమాలకు నైతిక బాధ్యత వహించి విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఆగ్రహానికి గురై రాష్ట్ర ప్రభుత్వ పతనం తప్పదని ఆయన హెచ్చరించారు.



ఈ కార్యక్రమంలో యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమ్మడి మధన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు నరేందర్‌రెడ్డి, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శులు రాజేష్‌రెడ్డి, మాజీ మేయర్ మహ్మద్ వసీం, వైసిపి బిసి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బిసి రమేష్‌గౌడ్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వెన్నం శివారెడ్డి, అనుబంధ సంఘాల జిల్లా అధ్యక్షులు సైఫుల్లా బేగ్, ఓబిరెడ్డి, బాబు, ఎగ్గుల అమర్‌నాథ్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలమూరు శ్రీనివాసరెడ్డి, నగర అధ్యక్షులు చింత సోమశేఖర్‌రెడ్డి, విద్యార్థి యువజన విభాగం నేతలు సాయిదత్త, కైలాష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## అసత్యాల వైసిపికి రాజకీయ సమాధి తప్పదు

**ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు**



**రాయదుర్గం, జులై 28 ప్రభాతవార్త:** అబద్ధాలు, అసత్యాల పునాదులపై ప్రారంభమైన వైసిపికి రాజకీయ సమాధి తప్పదని, వైసిపి తన ప్రస్థానంలో కీలకమైన అంశాల్లో ఏనాడూ నిజం చెప్పిన పాపాన పోలేదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో అత్యంత పకడ్బందీగా డిఎస్సీ పోటీ పరీక్ష నిర్వహిస్తే పదేపదే సత్యదూరమైన ఆరోపణలు చేయడం ఆ పార్టీ నీచ సంస్కృతికి నిదర్శనమని దుయ్యబట్టారు. అనంతపురం జిల్లా రాయదుర్గం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, డిఎస్సీపై వైసీపీ వైఖరిని ఆయన తీవ్రంగా ఎండగట్టారు. అక్రమాలు జరిగాయని నిరూపించదగ్గ స్పష్టమైన ఆధారాలు ఉంటే బహిరంగ చర్చకు రావాలని నారా లోకేష్ చేసిన సవాలును జగన్ ఎందుకు స్వీకరించలేదని నిలదీశారు. బహుశా నిజం చెబితే జగన్ తల వేయి ముక్కలు అవుతుందేమో..! అన్న శాపం ఏమైనా ఉందేమోనని ఎద్దేవా చేశారు. డిఎస్సీపై అసత్య ఆరోపణలు చేయడం వైసీపీ దుర్మార్గ ధోరణికి నిదర్శనమన్నారు. ఇలాంటి ఆరోపణలతో ఆ పార్టీకి రాజకీయ సమాధి తప్పదని ఎమ్మెల్యే కాలవ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పరిశీలకులు గుర్రప్ప, సెంట్రల్ స్టోర్ అధ్యక్షుడు పూజరి శివ పాల్గొన్నారు.

## తిరుపతి ఎయిర్‌పోర్ట్ అదానికి కట్టబెట్టే కుట్ర

**• మాజీ కేంద్రమంత్రి డాక్టర్ చింతా మోహన్ ఆరోపణ**



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న మాజీ కేంద్రమంత్రి చింతామోహన్

**వెంకటగిరి, జులై 28, ప్రభాతవార్త:** తిరుపతి విమానాశ్రయాన్ని ఆదానికి అమ్మే ప్రయత్నం కేంద్ర ప్రభుత్వం చేస్తున్నట్లు మాజీ కేంద్రమంత్రి, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ చింతా మోహన్ ఆరోపించారు. వెంకటగిరిలోని కేంద్రీయ విద్యాలయాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కాలజ్ఞానం ముందు, అమరావతి, మావిగన్ నిలబడదని అన్నారు. ఒకాయన అమరావతి అంటున్నాడు. మరొకరు మావిగన్ అంటున్నాడు. 300 సంవత్సరాల క్రితం పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కాలజ్ఞానంలో తిరుపతి ముఖ్యపట్టణం అవుతుందన్నారు. ఇప్పటి వరకు ఆయన చెప్పిందల్లా జరిగింది. రాజధాని విషయంలోనూ ఏనాటికైనా వీరబ్రహ్మం గారు చెప్పిన మాటలు నిజమవుతాయన్న సంపూర్ణ నమ్మకం, విశ్వాసం నాకుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తిరుపతి విమానాశ్రయం విషయంలో జోక్యం చేసుకుంటే, నష్టం తప్పదని హెచ్చరించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినీ, విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ స్కూల్ ప్రిన్సిపల్ ఆనంద గణపతి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## డిఎస్సీపై వైసిపి ఫేక్ ప్రచారం



**తిరుపతి(హెల్త్), జులై 28 ప్రభాతవార్త:** రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి మెగా డిఎస్సీ నిర్వహించి 16,347 మందికి ఉపాధ్యాయులుగా అవకాశం కల్పించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కి దక్కుతుందని రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం చెప్పారు. అధికారంలో ఉన్నప్పుడు ఒక్క డిఎస్సీని కూడా నిర్వహించకుండా, ఒక్క టీచర్ పోస్టును కూడా భర్తీ చేయని వైసిపి ప్రభుత్వం, ఇప్పుడు మెగా డిఎస్సీ ద్వారా నిరుద్యోగుల జీవితాలలో వెలుగులు నింపిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ని రాజీనామా చేయమనే అర్హత లేదన్నారు. వైసిపి నేతలు రాష్ట్రంలో అశాంతిని అలజడిని సృష్టించడానికి విద్యార్థులను, నిరుద్యోగులను రెచ్చగొట్టేలా వ్యవహరించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు ఆముదాల తులసి, ఎస్ శంకర్, సత్తు మధుసూదన్ యాదవ్, వడ్డెర శ్రీరాములు, అరుణాచలం తదితరులు పాల్గొన్నారు.

## డిఎస్సీపై జగన్‌వి మోసపూరిత మాటలు: గంటా



**విశాఖపట్నం, జులై 28 ప్రభాతవార్త:** ఎన్నికల్లో ప్రతి ఏటా జాబ్ కేలండర్, డిఎస్సీ హామీతో 2019లో అధికారంలోకి వచ్చి నిరుద్యోగులను అయిదేళ్ల పాటు నిలువునా మోసం చేసిన జగన్మోహన్ రెడ్డి మళ్లీ అదే మేకవన్నె పులి వేషాలకు తెర తీశారని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్టు 16,347 పోస్టుల మెగా డిఎస్సీ ఫైలుపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తొలి సంతకం చేస్తే 240 కేసులు వేసి మోకాలడ్డడానికి దిగజారుడు యత్నాలు చేశారన్నారు. పారదర్శకంగా నిర్వహించిన మెగా డిఎస్సీపై విషం చిమ్మడానికి జగన్ చేస్తున్న ప్రయత్నాలను ప్రజలు అసహ్యించుకుంటున్నారని పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వ పాలనలో ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వని జగన్మోహన్ రెడ్డికి మెగా డిఎస్సీ గురించి మాట్లాడే అర్హతే లేదన్నారు. 14 డిఎస్సీలలో 1,96,619 టీచర్ పోస్టులను భర్తీ చేసిన ఘనచరిత్ర తెలుగుదేశం పార్టీకి ఉందని, తాను విద్యా శాఖ మంత్రిగా 2014, 2018, 2019లలో డిఎస్సీల ద్వారా 16,701 మందిని రిక్రూట్ చేసుకుని యువత భవిష్యత్‌కు భరోసా ఇచ్చామని తెలిపారు. నారా లోకేష్ విద్యాశాఖ మంత్రిగా కేవలం 150 రోజుల్లో మెగా డిఎస్సీ నియామకాలు పూర్తి చేసి. రెండో డిఎస్సీకి సన్నద్ధమవుతున్నారని, మెగా డిఎస్సీ గురించి చేస్తున్న పిచ్చి ప్రేలాపనల నిగ్గు తేల్చే చర్చ కోసం డేట్, టైం చెప్పాలని లోకేష్ చేసిన సవాల్‌ను స్వీకరించే దమ్ముందా అని జగన్మోహన్ రెడ్డిని ప్రశ్నించారు. కేవలం రాజకీయ లబ్ధి పొందాలనే ఆలోచనతో నీట్ పరీక్షా పత్రం లీక్‌కి మెగా డిఎస్సీ నియామక ప్రక్రియకి లింక్ పెట్టి ప్రజల దృష్టిలో అభాసుపాలయ్యారని గంటా శ్రీనివాసరావు ఎద్దేవా చేశారు.

## అమెరికాలో ప్రవాసాంధ్రులతో చెవిరెడ్డి భేటీ



**తిరుపతి, జులై 28 ప్రభాతవార్త:** రాష్ట్ర రాజకీయాల్లో కీలక నాయకుడిగా గుర్తింపు పొందిన వైఎస్ఆర్‌సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుటుంబంతో కలిసి అమెరికా పర్యటనకు వెళ్లడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. సోమవారం అమెరికా చేరుకున్న చెవిరెడ్డి కుటుంబానికి ఎన్ఆర్ఐలు విమానాశ్రయంలో ఘన స్వాగతం పలకడం విశేషం. స్థానిక తెలుగు సంఘాల ప్రతినిధులు శుభాకాంక్షలు తెలియజేస్తూ జ్ఞాపికలను అందజేశారు. ప్రవాసాంధ్రుల నుంచి లభిస్తున్న ఆదరణపై చెవిరెడ్డి కుటుంబం హర్షం వ్యక్తం చేస్తూ, విదేశాల్లో ఉన్నా ఆంధ్రప్రదేశ్‌తోనే అనుబంధం కొనసాగుతుందని పేర్కొన్నారు.

## శ్రీశైలం ధర్మకర్తల మండలి సమీక్ష సమావేశం

**శ్రీశైలంప్రాజెక్టు, జులై 28 ప్రభాతవార్త:** శ్రీశైలం మహాపుణ్యక్షేత్రంలో ధర్మకర్తల మండలి సమీక్ష సమావేశం మంగళవారంనాడు పరిపాలన భవన సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. శ్రీశైలదేవస్థానం ధర్మకర్తల మండలి ఆధ్యక్షులు పోతుగుంట రమేష్‌నాయుడు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావుల అధ్యక్షతన సమావేశం జరిగింది. కాగా సమీక్ష సమావేశంలో ఆలయ ఆదికారులతో కూడా సమీక్షించి పలు అంశాలపై సలహాలు,సూచనలు చేశారు. ఈ సమావేశంలో మొత్తం 45 అంశాలు చర్చించారు. వీటిలో 39 అంశాలు ఆమోదించబడగా 6అంశాలను వాయిదా వేశారు. సమావేశంలో అజెండా అంశాలతో పాటు శాకంభరీ ఉత్సవ నిర్వహణ, శ్రావణ మాసోత్సవాలు, సహస్ర ఘట్టాభిషేకం కార్యక్రమాల గురించి చర్చించారు. కాగా సమావేశంలో తీసుకున్న ముఖ్యమైన నిర్ణయాల గురించి మండలి ఆధ్యక్షులు రమేష్ నాయుడు వివరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే కూటమి ధ్యేయం

కొమరాడ ,జులై 28 ,ప్రభాతవార్త:



ప్రజా సంక్షేమం కోసమే కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మండల టీడీపీ కన్వీనర్ ఎస్. ఉదయ శేఖర్ పాత్రుడు అన్నారు. మంగళవారం పాలెం గ్రామ పంచాయితీ కార్ల గండ గ్రామంలో రెండేళ్ల పాలనలో ప్రజలకు అందిన సంక్షేమ పథకాలను వివరించే డోర్ టు డోర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శేఖర్ పాత్రుడు మాట్లాడుతూ ప్రజా సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు నిరాటంకంగా కొనసాగిస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ బలరాంతో పాటు పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైయస్ జగన్మోహన్ రెడ్డికి ఘన స్వాగతం పలకాలి

బొబ్బిలి, జులై 28, ప్రభాతవార్త:



వైఎస్ జగన్ పర్యటనకు ఘన స్వాగతంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ఈ నెల 30వ తేదీ (గురువారం) మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ఉదయం 10 గంటలకు విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకుని, అక్కడి నుంచి రోడ్డు మార్గంలోవిజయనగరం మీదుగా శ్రీకాకుళం వెళ్లిమాజీ మంత్రిసిదిరిఅప్పలరాజునిపరామర్శించనున్నారు.ఈ సందర్భంగా ప్రియతమ నాయకులు శ్రీ వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి గారికి ఘన స్వాగతం పలికేందుకు బొబ్బిలి నియోజకవర్గం నుంచి చేపట్టాల్సిన ఏర్పాట్లపై బొబ్బిలి మాజీ శాసనసభ్యులు శంబంగి వెంకట చిన అప్పలనాయుడు గారు ఈరోజు బొబ్బిలి వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయంలో నాలుగు మండలాల ముఖ్య నాయకులతో కలిసి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహింఅలాగే బొబ్బిలి నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన ఎస్ఈసీ సభ్యులు, రాష్ట్ర పార్టీ కార్యదర్శులు, మండల పార్టీ అధ్యక్షులు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, జిల్లా, నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు, రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ స్థాయి పార్టీ కమిటీ సభ్యులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, మాజీ కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మహిళా ప్రజాప్రతినిధులు, సోషల్ మీడియా కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తమకు కేటాయించిన ప్రాంతాల్లో నిర్ణీత సమయానికి హాజరై, శ్రీ వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి గారికి ఘన స్వాగతం పలకాలి అన్నారు.

## వెదుళ్ళవలసలో ఏనుగుల సంచారం

గరివిడి, జులై 28,ప్రభాత వార్త:



మండలంలోని వెదుళ్ళవలసలో మంగళవారం దాట్ల నారాయణ మూర్తి రాజుకి చెందిన పొలంలో ఏనుగులు సంచరించాయి. రెండు ఎకరాలు చెరుకు పంటను ఏనుగులు ధ్వంసం చేశాయి.ప్రజలు ఏనుగులు చూసేందుకు తరలి వెళ్లగా,రైతులు తమ పంట పొలాలు కి నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కాగా మెరకముడిదాం మండలం వైపు ఏనుగులు పయనించడంతో వెదుళ్ళవలస వాసులు ఊపిరి పీల్చుకున్నారు.

## ఏపీఎస్ఆర్టీసీ కాంట్రాక్ట్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

సాలూరు, జులై 28 ప్రభాతవార్త :



ఆర్టీసీ కాంట్రాక్ట్ ఉద్యోగులకు వేతనాలు పెంచాలని అలాగే ఉద్యోగ భద్రత కల్పించాలని కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది.మంగళవారం ఈ మేరకు ఆర్టీసీ డిపో ఆవరణలో సీఐటీయూ ఎన్.వై నాయుడు ఆధ్వర్యంలో ఈ నెల 30 ఇంకా 31 తేదీలలో కలెక్టరేట్ వద్ద జరగబోయే దర్నా జయప్రదం చేయాలనే ప్రచార కరపత్రాలు విడుదల చేసారు. అనంతరం నాయుడు మాట్లాడుతు రాష్ట్రంలో ఏపీఎస్ఆర్టీసీ పరిధిలోని అన్ని డిపోలలో ఉన్న అద్దె బస్ డ్రైవర్లు ఇంకా మెకానికల్ సెక్షన్ లో ఉన్న కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగుల కనీసవేతనం 26 వేలు చెల్లించాలని కోరారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల పట్ల వివక్షగా వ్యవహరిస్తుందని ఆరోపించారు.మరడాన శ్రీను,సురేష్,మురళి,గోపి,జేడి, వెంకటి, తదితరులు పాల్గొన్నారు.

## వాయిస్ ట్రస్ట్ సంస్థ ద్వారా “మిషన్ సేఫ్ సాలూరు”

సాలూరు ,జులై 28, ప్రభాతవార్త :



యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడడం అలాగే సైబర్ నేరాలపై అవగాహన కల్పించడం లక్ష్యంగా వాయిస్ ట్రస్ట్ “మిషన్ సేఫ్ సాలూరు” లో యువశక్తి, భవిష్యత్ భారత్” పేరుతో యువజన చైతన్య కార్యక్రమం అధ్యక్షుడు బెవర. నాగార్జున నిర్వహించారు.మంగళవారం శివాలయం రోడ్‌లో ఉన్న కళ్యాణ మండపంలో జరిగిన ఈ ప్రోగ్రాంకి ముఖ్య అతిథులుగా హజరైన రంభ రజనీకాంత్ మాట్లాడుతు సమాజంలో సేవాభావం,బాధ్యతను యువతలో పెంపొందించాలనే సంకల్పంతో విజనరీ ఆర్గనైజేషన్ ఇన్‌స్పైరింగ్ చేంజ్ ఎవ్రీవేర్ (వాయిస్ ట్రస్ట్)ఏర్పాటైందని స్పష్టం చేసారు.టౌన్ సీఐ అప్పలనాయుడు, డా. గణేష్,సంజీవ్ నాయుడు, మహలక్ష్మీ,శివలెంక. ప్రసాద్,శ్రావణ్ కుమార్,నవీన్, గుప్తేష్,వినయ్,సుశాంత్, తదితరులు పాల్గొన్నారు.

## మహేంద్రపురం చెక్‌డ్యామ్ రజతోత్సవ వేడుకల్లో కురుపాం ఎమ్మెల్యే

గరుగుబిల్లి, జులై 28, ప్రభాతవార్త :



పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం మండలం మహేంద్రపురం గ్రామంలో ప్రపంచ ప్రకృతి వనరుల పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం నాడు మహేంద్రపురం చెక్‌డ్యామ్ రజతోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే శ్రీమతి తోయక జగదీశ్వరి గారు ముఖ్య అతిథిగా హాజరై విస్తరించిన చెక్‌డ్యామ్‌ను ప్రారంభించారు. వెలుగు (సెర్ప్) ఆర్థిక సహకారంతో, జట్టు ట్రస్టు నిర్వహణలో 2000 సంవత్సరంలో నిర్మించబడిన ఈ చెక్‌డ్యామ్ గత 25 సంవత్సరాలుగా మహేంద్రపురం గ్రామ ప్రజలకు సాగు, తాగునీటి అవసరాలను తీర్చడంలో కీలక పాత్ర పోషిస్తోంది. చెక్‌డ్యామ్ రజతోత్సవాన్ని పురస్కరించుకుని జట్టు ట్రస్టు సహకారంతో గ్రామ ప్రజలు శ్రమదానం చేసి చెక్‌డ్యామ్‌ను విస్తరించడం విశేషమని పలువురు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ, ప్రకృతి వనరుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో చెక్‌డ్యామ్‌లు, నీటి సంరక్షణ నిర్మాణాలు కీలకమని, భవిష్యత్ తరాలకు నీటి వనరులను అందించాలంటే ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తృతంగా చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల భాగస్వామ్యంతో చేపట్టిన ఈ చెక్‌డ్యామ్ విస్తరణ గ్రామాభివృద్ధికి ఆదర్శంగా నిలుస్తుందని ఎమ్మెల్యే గారు పేర్కొన్నారు. ప్రభుత్వం కూడా గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.

## ఏ ఒక్కరికీ ఇబ్బంది కలగకుండా చూసుకోవాలి

### టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి కిమిడి మల్లిక నాయుడు

చీపురుపల్లి ,జులై 28, ప్రభాతవార్త :



ఆగస్టు 1న విజయనగరం జిల్లా భోగాపురంలో ప్రారంభం కానున్న విమానాశ్రయానికి చీపురుపల్లి నియోజకవర్గం నుండి తరలి వెళుతున్న ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలవకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కిమిడి మల్లిక నాయుడు అధికారులకు సూచించారు.. మంగళవారం నాడు చీపురుపల్లి పార్టీ కార్యాలయంలో అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీపురుపల్లి నియోజకవర్గం నుంచి వెళ్లే ప్రతి ఒక్కరికీ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి -- టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్ నాయుడు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చరిత్రలో మరో మైలురాయిగా నిలిచే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని ఆయన కోరారు.ఆగస్టు 1, 2026న భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో, మంగళవారం చీపురుపల్లి క్యాంప్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చీపురుపల్లి నియోజకవర్గం నుంచి వేలాదిమంది ప్రజలు ఈ చారిత్రక కార్యక్రమానికి హాజరు హాజరయ్యారు.

## గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధనలో ఎం.వీ.జీ.ఆర్ అధ్యాపకుడు భాను

విజయనగరం ,జులై 28, ప్రభాతవార్త :



విజయనగరంలోని ఎం.వీ.జీ.ఆర్ ఇంజనీరింగ్ కళాశాల మేనేజ్మెంట్ స్టడీస్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ (హెచ్.ఆర్), శిక్షణ, ప్లేస్మెంట్ అధికారి అయిన డా. ఎమ్. వీ వీ. భాను, “ఒకే సమయంలో అత్యధిక సంఖ్యలో రచయితలు తమ సొంత పుస్తకాలపై సంతకాలు చేయడం” అనే కార్యక్రమంలో పాల్గొని, ఒక చారిత్రాత్మక గిన్నిస్ ప్రపంచ రికార్డులో భాగమయ్యారు. డా. భాను “మీ గతిని మీ ఆధీనంలో ఉంచుకోండి: సవాళ్లను బలంగా మార్చుకోవడం” అనే స్ఫూర్తిదాయక పుస్తకాన్ని రచించారు. ఇది అక్టోబర్ 2025లో ‘ఎవిన్సుబ్ పబ్లికేషన్” ద్వారా ప్రచురించబడింది. ఆయన చేసిన ఈ సాహిత్య కృషికి గుర్తింపుగా, లండన్ ఆర్గనైజేషన్ ఆఫ్ స్కిల్స్ డెవలప్మెంట్ లిమిటెడ్ (యూకే)’ సహకారంతో ‘ఈ.ఎస్.ఎన్ పబ్లికేషన్స్’ నిర్వహించిన గిన్నిస్ వరల్డ్ రికార్డ్ ప్రయత్నంలో ఈ నెల 26న న చెన్నైలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 1,752 మంది రచయితలు ఒకే సమయంలో తమ పుస్తకాలపై సంతకాలు చేయడం ద్వారా కొత్త గిన్నిస్ ప్రపంచ రికార్డును నెలకొల్పారు. ఇది 2019లో యూ.ఏ.ఈ. లోని షార్జా అంతర్జాతీయ పుస్తక ప్రదర్శనలో 1,502 మంది రచయితలు నెలకొల్పిన గత రికార్డును అధిగమించింది. భారతదేశం నలుమూలల నుండి విద్యాసంస్థలకు చెందిన రచయితలను ఒకచోట చేర్చడం ద్వారా పఠనం, రచన, పరిశోధన, సాహిత్య నైపుణ్యాన్ని ప్రోత్సహించడం ఈ కార్యక్రమం యొక్క లక్ష్యం. ఈ సందర్భంగా డా. భాను మాట్లాడుతూ ఈ ప్రతిష్టాత్మక అంతర్జాతీయ గుర్తింపు తమ సంస్థకు గర్వకారణమని, విద్యా సమాజానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ సందర్భంగా ఆయనను ఎంవిజిఆర్ యాజమాన్యం, అధ్యాపకులు విద్యార్థులు అభినందించారు.

## పీఎం సభను విజయవంతం చేయాలి

దత్తిరాజేరు, జులై 28, ప్రభాతవార్త



అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సభను విజయవంతం చేయాలని మండల పార్టీ అధ్యక్షులు చప్ప చంద్రశేఖర్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పి.ఎం సభను విజయవంతం చేసేందుకు మన మండలానికి 81 బస్సులో 4వేలు మందిని తీసుకువెళ్లాలని కార్యకర్తలకు తెలిపారు. ఏఏ గ్రామాలకు ఎన్ని బస్సులు చదివి వినిపించారు. తెల్లవారి 6: గంటలకు అన్ని గ్రామాల్లో బస్సులు బయలుదేరించాలన్నారు డ్వాక్రా మహిళలు ఫీల్డ్ అసిస్టెంట్లు ఆశ కార్యకర్తలు అందరిని తప్పనిసరిగా తీసుకురావాలని కార్యకర్తలకు సూచించారు వచ్చిన జనాభా కానీ సౌకర్యాలు కల్పించామని ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారన్నారు. నియోజకవర్గశీ లోని దత్తిరాజేరు మండలానికి పేరు తెచ్చేలా ప్రతి కార్యకర్త పనిచేయాలన్నారు ప్రతి ఒక్కరూ విమానాశ్రయాన్ని చూడాలన్నారు దేశంలో నెంబర్ వన్‌గా నిర్మించి ప్రధానమంత్రి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. దీనికి ప్రతి ఒక్కరు సహకారాన్ని అందించి మంత్రిగారి గుర్తుండిపోయేలాగా జనాలను సమీకరణ చేసి తీసుకురావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు . మండల క్లస్టర్ కోఆర్డినేటర్లు పెద్దింటి మోహన్ మిత్తి రెడ్డి ఈశ్వరరావు బోడ సింగ్ సత్యనారాయణ టిడిపి సీనియర్ నాయకులు మిత్తిరెడ్డి రామ గేదెల మంగమ్మ మిత్తిరెడ్డి లక్ష్మి, వంగ పండు కృష్ణ పాల్గొన్నారు.

## పొలం పిలుస్తోంది కార్యక్రమం

గరుగుబిల్లి ,జులై 28, ప్రభాతవార్త :



మండలంలోని వల్లరిగుడభ , చినగుడబ, రాయండోరవలస గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో “పొలం పిలుస్తోంది” కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. రైతులకు క్రాప్ ఇన్సూరెన్స్, ఈ పంట , పంటల యాజమాన్యం, సమతుల్య ఎరువుల వినియోగం, వర్షాభావ పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చీడపీడలు మరియు వ్యాధుల సమగ్ర నివారణ (ఖ్రావీ), భూసార పరీక్షల ప్రాముఖ్యత, ప్రభుత్వ వ్యవసాయ పథకాలపై అవగాహన కల్పించడం జరిగింది. కార్యక్రమంలో వ్యవసాయ అధికారిని జ్యోష్ణతో పాటు పలువు రైతులు పాల్గొన్నారు.

## భూ సర్వేతో సమస్యలు పరిష్కారం

కురుపాం, జులై 28ప్రభాతవార్త:



భూమి సర్వే తో భూములు మధ్య ఉండే సమస్యలు తొలగిపోయి పరిష్కారం జరుగుతుందని మండల సర్వేర్ రవికుమార్ అన్నారు. మంగళవారం కురుపాం మండల కేంద్రంలో గల శివన్నపేట గ్రామ సచివాలయంలో మండల సర్వేర్ రవికుమార్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి రీసర్వేపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టి, అనంతరం సచివాలయంలో జరిగిన సమావేశంలో రీసర్వే ప్రాముఖ్యతను రైతులకు వివరించారు.ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ, రీసర్వే ద్వారా భూముల హద్దులు ఖచ్చితంగా నమోదు కావడంతో పాటు భూ వివాదాలు తగ్గి, భూ రికార్డుల్లో పారదర్శకత పెరుగుతుందని తెలిపారు. రైతులు సర్వే సమయం లో అవసరమైన పత్రాలతో హాజరై అధికారులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో సెక్రటరీ జగదీష్ సర్వే సంతోష్ కుమార్ వీఆర్వో కృష్ణ రైతులు, గ్రామస్థులు,రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

పాచిపెంట, జులై 28, ప్రభాతవార్త.

పాచిపెంట మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మండలంలో గల విద్యుత్తు దీర్ఘకాలిక సమస్యలు పరిష్కార వేదిక బుధవారం ఉదయం నుండి నిర్వహించినట్లు విద్యుత్ ఏఈ సింహాచలం తెలిపారు. డి ఈ ఆదేశాలు మేరకు మాతమూరులో విద్యుత్ సిబ్బందితోపాటు ఏ ఈ మంగళవారం ఉదయం గ్రామంలో విద్యుత్ వినియోగదారులు పరిష్కార వేదికను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని మైకు పెట్టి గ్రామంలో ప్రచారం చేశారు. విద్యుత్ వినియోగదారులు విద్యుత్ మీటర్లు నూతనంగా మంజూరు కొరకు లో వోల్టేజ్ సమస్య విద్యుత్ బిల్లులో అధిక నమోదులు తదితర అనేక విద్యుత్ సమస్యలపై ఇబ్బంది పడుతున్న వినియోగదారులు అర్జీలను పాచిపెంటలో ఉదయం 10:30 నుండి పరిశీలించి సత్వర చర్యలు చేపడతారని ఆయన తెలిపారు. విద్యుత్ సమస్యలతో ఉన్న వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండలంలో పనిచేస్తున్న లైన్ ఇన్స్పెక్టర్ , విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాలనపై కరపత్రాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

బలిజిపేట ,జులై 28, ప్రభాత వార్త :



బలిజిపేట మండలం పెద్దింపేట గ్రామంలో కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన అభివృద్ధి పనులపై ఆయన అక్కడి ప్రజలకు వివరించారు. సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథకంలోకి తీసుకువెళ్లేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అహర్నిశలూ కష్టపడి పనిచేస్తున్నారని తెలిపారు. వర్షం లో తడుస్తూ ఎమ్మెల్యే తమ ప్రచారాన్ని కొనసాగించారు. బిందెల డాన్స్, మరగాళ్ల నృత్యంతో ప్రజలు ఎమ్మెల్యే ను గ్రామంలో ఇంటింటికి తీసుకువెళ్లారు. ప్రజల కోరిక మేరకు గ్రామంలోని రామమందిరం నిర్మానానికి ప్రభుత్వం తరపున రూ. 40 లక్షలు, తన స్వంత నిధులు రెండు లక్షలు ఇస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. గ్రామంలో తాగునీటి ఇబ్బందులు లేకుండా తక్కువ సమయంలో పరిష్కరిస్తామని ఆయన మహిళలకు హామీ ఇచ్చారు.ప్రభుత్వం గడచిన రెండేళ్లలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, తల్లికి వందనం, దీపం-2, స్త్రీ శక్తి, చేనేతలకు 200, 500 యూనిట్ల ఉచిత విద్యుత్, ఆటో డ్రైవర్లకు ఏటా రూ. 15,000/-, అన్నదాత సుఖీభవ కింద రైతుకు ఏటా రూ. 20వేలు, 269 అన్నా క్యాంటీన్ల ద్వారా రూ. 5/- లకే భోజనం, పేదలకు 5 లక్షల ఇళ్ళు, మత్యకారులు సేవలో ఏటా రూ. 20 వేలు అందజేస్తున్నదన్నారు. అరుకు పార్లమెంట్ ఉపాధ్యక్షులు బోరాడ రామ్మోహన్ నాయుడు మండల పెద్దపాప నాయుడు మధ్య అప్పారావు కురిటి శ్రీనివాసరావు ( బుజ్జి) వాసు పెదంకలాం ప్రాజెక్ట్ చైర్మన్ గౌర్నాయుడు సతీష్ రామారావు రామ్మోహన్ రావు రెడ్డి సత్యనారాయణ, కూటమి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## కరపత్రాల పంపిణీ

దత్తిరాజేరు, జులై 28, ప్రభాతవార్త :



మండల కేంద్రమైన దత్తిరాజేరు గ్రామంలో కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా అభివృద్ధి కరపత్రాలను తెలుగుదేశం మండల పార్టీ నాయకులు మంగళవారం ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలును ప్రజలకు వివరించారు. ప్రభుత్వం ఎన్నికల సమయం లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిందన్నారు తల్లికి వందనం శ్రీ శక్తి పింఛన్లు పెంపు వంటి కార్యక్రమాలు ప్రజలకు వివరించారు ఇంకా మూడేళ్లలో ప్రభుత్వం ప్రతి కుటుంబానికి పార్టీ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు పవన్ కళ్యాణ్ లోకేష్ న్యాయం చేస్తారన్నారు. నిరుద్యోగులకు కంపెనీలు తీసుకొచ్చి ఉద్యోగాలు కల్పిస్తారని తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు చెప్ప చంద్రశేఖర్ మాజీ వైస్ఎంపీపీ పెద్దింటి మోహన్ టిడిపి సీనియర్ నాయకులు మిత్తిరెడ్డి రామ క్లస్టర్ కోఆర్డినేటర్లు మిత్తిరెడ్డి ఈశ్వరరావు బోడసింగి సత్యనారాయణ కార్యకర్తలు , తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం పార్వతీపురం మన్యం
వార్త

## దుప్పట్లు పంపిణీ చేసిన ఎస్ఐ రమేష్

కురుపాం, జులై 28, ప్రభాతవార్త :



కమ్యూనిటీ పోలీసులలో భాగంగా పేద గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు నీలకంఠాపురం సబ్ ఇన్స్పెక్టర్ వి రమేష్ నాయుడు అన్నారు మంగళవారం ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు పోలీస్ స్టేషన్ పరిధిలో గల దబ్బ భాను కూడా కు చెందిన 30 మంది పేద గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు దొర, చిన్నారావు, కిరణ్లు పాల్గొన్నారు.పెద్ద బండ రాయి ని తొలగించిన పోలీస్ సిబ్బంది మండలం లో సిరికొండ సందిగూడ రోడ్డు మధ్యలో పడిపోయిన పెద్ద కొండరాయిని జెసిబి సహాయంతో నీలకంఠపురం పోలీసుల తొలగించారు. మంగళవారం వర్షాలు కారణంగా కొండలపై నుండి బండ రాళ్లు పడి రాకపోకలకు పోకలకు ఇబ్బంది కలిగింది. దీంతో ఎస్సై రమేష్ నాయుడు చారువతోపోలీస్ సిబ్బంది వాహనాలకు ఇబ్బంది లేకుండా వాటిని తొలగించారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు దొర, కిరణ్, హోంగార్డు రామారావు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి : ఎమ్మెల్యే కోళ్ల

శృంగవరపుకోట,జులై28,ప్రభాతవార్త..



కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు.మంగళవారం మండలంలోని సంతగైరమ్మపేటలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో ఎమ్మెల్యే కోళ్ల పాల్గొని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గురించి ఇంటింటికీ వెళ్ళి ఆమె ప్రజలకు కరపత్రాలను అందించి వివరించారు. సీఎం చంద్రబాబు రాష్ట్రాభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలిపారు.విద్యాశాఖలో రాష్ట్ర విద్యాశాఖమంత్రి లోకేష్ బాబు కొత్త సంస్కరణలు తీసుకువచ్చారని ఆమె కొనియాడారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు,కార్యకర్తలు,ప్రజలు పాల్గొన్నారు.

## ప్రతీ విద్యార్థి క్రీడా స్ఫూర్తి కలిగి ఉండాలి : ఎమ్మెల్యే కోళ్ల

శృంగవరపుకోట,జులై28,ప్రభాతవార్త



ప్రతీ విద్యార్థిలో క్రీడా స్ఫూర్తి కలిగి ఉండాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు.మంగళవారం ఎస్.కోట ప్రభుత్వ హైస్కూల్లో రాష్ట్ర ప్రభుత్వం కోటి రూపాయలతో శాప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అమరావతి చాంపియన్ షిప్ పోటీలను ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కోళ్ల మాట్లాడుతూ క్రీడల్లో మంచి ప్రతిభను చాటి జాతీయ అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని క్రీడాకారులకు ఆమె సూచించారు.నియోజకవర్గ క్రీడా కోఆర్డినేటర్ పి.శ్రీరాములు మాట్లాడుతూ అండర్-17,అండర్-24,విభాగాల్లోఖోఖో,కబడ్డీ,బాడ్మింటన్,చెస్,వాలీబాల్ యోగా పోటీలు నిర్వహిస్తున్నామని ఇందులో ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరగనున్న జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.కార్యక్రమంలో ఎంఈఓ జగదీశ్వరరావు,పలువురు టీడీపీ నాయకులు,జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు జి.లక్ష్మణరావు,వివిధ మండలాల కోఆర్డినేటర్లు,వ్యాయామ ఉపాధ్యాయులు,క్రీడాకారులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంలో దళిత బాలికలకు రక్షణ ఏది?

నెల్లిమర్ల, జులై 28, ప్రభాతవార్త



రాష్ట్రంలో దళిత బాలికలకు రక్షణ లేకుండా పోయిందని జై భీమ్రావు భారత పార్టీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పంపల నరసయ్య కనిగిరి శ్రీనివాసరావు విమర్శించారు. నెల్లిమర్లలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. కేవలం నాలుగు రోజులు ముందు మెగా పిటిఎమ్ మీటింగ్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రి లోకేష్ సమక్షంలో అద్భుత ప్రసంగం చేసిన పోలవరం జిల్లా ఆదివాసి విద్యార్థిని మొర్రం శివాని ఆత్మహత్యకు పాల్పడడం దిగ్భ్రాంతికి గురి చేసిందని అన్నారు. ఈ సంఘటనపై విచారణ జరిపించి నిందితులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. అలాగే పోలవరం జిల్లా రాజవొమ్మంగి మండలం జడ్డంగి గ్రామానికి చెందిన గిరిజన బాలిక అంజలీదేవి తీవ్ర జ్వరంతో మరణించిందని, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత సొంత నియోజకవర్గ గోరంట్లకు చెందిన బాలిక అత్యాచారాన్ని గురై గర్భం దాల్చిందని ఈ సంఘటన కూడా ప్రభుత్వం సీరియస్గా తీసుకొని నిందితులను కఠినంగా శిక్షించాలని, ఎస్ సి, ఎస్ టి బాలికలకు స్త్రీలకు ప్రభుత్వపరంగా అండ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. బాధితులకు చరో 25 లక్షలు వంతన పరిహారం అందజేయాలని నేను నరసయ్య, శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నాయకుడు గొంప ఆదినారాయణ పాల్గొన్నారు.

## గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు

రామభద్రపురం, జులై 28,ప్రభాత వార్త :



రామభద్రపురం మండలం జాన్నివలస,కొట్టక్కి గ్రామంలో బొబ్బిలి సబ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం మధుసూదన్ రావు ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది . కార్యక్రమంలో పంటల బీమా మరియు రసాయనిక వినియోగం మరియు ప్రస్తుత ఎలనినో పరిస్థితుల్లో వరి పంటకు బదులుగా ఆరుతడి పంటలు అయినటువంటి పెసర మినుము కంది రాగి వంటి పంటలు సాగు చేసుకోవాలని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి అమరా శివ మాట్లాడుతూ మొక్కజొన్న మరి ప్రత్తి పంటల బీమా జులై 31 వ తారీకు తో పూర్తి అవుతుంది కావున ఆసక్తి ఉన్న రైతులు ప్రీమియం కట్టుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది జి సౌజన్య, యు స్వాతి వ్యవసాయ విస్తరణ అధికారి బి సతీష్ , రైతులు పాల్గొన్నారు.

## పశువులకు రక్త నమూనాలు సేకరించాలి

వేపాడ, జులై 28 ప్రభాతవార్త:

పశువులకు రక్త నమూనాలు సేకరించి పేడ పరీక్షలు చేసి వ్యాధి నిర్ధారణ తరువాత వైద్యం అందించాలని శృంగవరపుకోట ఏరియా పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ బి చలపతిరావు సూచించారు. మంగళవారం వేపాడ పశువైద్య చికిత్సాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశు వైద్య చికిత్సాలయానికి వస్తున్న పశువులకు తప్పనిసరిగా పరీక్షలు చేసినప్పుడే మంచి ఫలితాలు వస్తాయని సూచించారు. రైతు సేవా కేంద్రాల్లో ఏ హెచ్ ఏ లశీతా రైతులకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారిని డాక్టర్ కోరాడ గాయత్రి, ఏహెచ్ఎలు ,గోపాల మిత్రులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతి

చీపురుపల్లి, జులై 28, ప్రభాతవార్త :

చీపురుపల్లి పట్టణ శివారులో గల శ్రీ కనకమాలక్ష్మి ఆలయ సమీపంలోని బస్సు షెల్టర్లు లో గుర్తుతెలియని సాధువు మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. ఈ మేరకు చీపురుపల్లి పోలీసులు మంగళవారం నాడు పరిశీలించారు. చీపురుపల్లిలోని శివ ఆలయ ప్రాంగణంలో భిక్షాటన చేసుకుంటూ బ్రతికేవారని.. ఇటీవల అనారోగ్యం పాలు కావడంతో చీపురుపల్లి పట్టణ శివారులోని కనకమాలక్ష్మి ఆలయ ప్రాంగణానికి వెళ్లి.. బస్సు సెంటర్లో ప్రాణాలు విడిచినట్లు స్థానిక సమాచారం. ఈ మేరకు స్థానిక మానవీ యత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు బివి గోవిందరాజులతోపాటు., అనాధ శవాలకు తన వంతు సహాయం చేస్తూ ఓ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి నారాయణ కూడా మృతదేహాన్ని పూడ్చిపెట్టారు.

## టాటా ఏసీ వ్యాన్ ఢీకొని వ్యక్తి దుర్మరణం

బలిజిపేట, జులై 28, ప్రభాతవార్త :

గొల్ల వీధి మలుపు వద్ద తెర్లాం మండలం ఆమిటి గ్రామం కొప్పల వెలమ కులానికి చెందిన మరడానా అప్పలస్వామి ( 52) అను ఆ సామి బలిజిపేట వ్యవసాయ పనులు నిమిత్తమే మోటార్ సైకిల్ పై వచ్చి తిరిగి పని ముగించుకుని ఇంటికి బయలుదేరి మార్గమధ్యంలో సుమారు మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో బలిజిపేట గొల్ల వీధి వద్ద మలుపు వద్ద ఉంగరాడ మెట్ట దగ్గర నుంచి టాటా ఏసీ వ్యాన్ కొబ్బరిబండాలతో తిరుగు బలిజిపేట రావడంతో వ్యాను ఢీకొని మరడానా అప్పలస్వామి అక్కడకు అక్కడే మృతి చెందాడు వ్యాన్ డ్రైవర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసును స్థానిక ఏఎస్ఐ రవణ దర్యాప్తు చేస్తున్నారు . మృతదేహాన్ని పంచనామా నిమిత్తం పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

29-7Pg9th cheli.qxd:29-7Pg9th cheli.qxd 1/1/02 6:45 AM Page 1



# వ్యాసమహర్షి పుట్టిన రోజే 'గురుపూర్ణిమ'



ప్రతి సంవత్సరం ఆషాడశుద్ధ పౌర్ణమి రోజున గురుపూర్ణిమ జరుపుకుంటారు. ఈరోజున గురుపూజోత్సవం జరిపి గురువులకు కానుకలు బహుమతులు సమర్పించి వారిని సత్కరించి వారి ఆశీర్వాదాలు తీసుకుంటారు. తమ జీవితానికి దిశానిర్దేశం చేసి, ముక్తివైపు నడిపించినందుకు ప్రతిఫలంగా ఇలా చేస్తారు. ఈరోజు వ్యాసమహాముని పుట్టిన రోజు కాబట్టి దీనికంత ప్రాముఖ్యత ఉంది. ఈరోజు చాలా మంది ప్రజలు రోజంతా ఉపవాసం ఉంటారు. సూర్యోదయం వేళ ఉపవాసం ఆరంభించి, చంద్రోదయం వేళకు ఉపవాసం ముగుస్తారు. గురువును భగవంతునికి భక్తునికి మధ్య సంధానకర్తగా భావిస్తుంటారు. వేదవ్యాసుని మానవజాతి కంతటికీ మంచి ఆధ్యాత్మిక వారసత్వాన్ని మిగిల్చి వెళ్లాడు. కాబట్టి ఆయన్న మానవవాలి కంతటికీ గురువుగా భావిస్తుంటారు. వేదవ్యాసుని పూర్వనామం కృష్ణ ద్వైపాయనుడు. వేదకాలపు సంస్కృతినంతా నాలుగు వేదాల్లో ఆయన సంకలనం చేసిన తర్వాత ఆయన్ను వేదవ్యాసుడిగా పిలవడం ప్రారంభించారు. వేదాలతో పాటు మహాభారతం, మహాభాగవతంతో పాటు అష్టాదశ పురాణాలు రచించాడు వ్యాసుడు. వ్యాసుడు సప్తచిరంజీవుల్లో ఒకడు. దక్షిణ భారతదేశంలో కొన్ని ప్రాంతాల్లో పూర్ణిమ వ్రతాన్ని ఆదిశక్తి పేరిట ఆచరిస్తుంటారు. ఈపర్వ దినం సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. పూర్ణిమనాడు కొంతమంది సత్యనారాయణవ్రతాన్ని లేదా పూజను నిర్వహిస్తుంటారు. షిరిడీ సాయినాధుని ఆలయాల్లో నేటి నుంచి మూడు రోజుల పాటు గురుపూర్ణిమ వేడుకలను ఘనంగా నిర్వహిస్తారు. చరిత్ర..వ్యాసులు మహాభారత రచయిత. పరాశర ఋషి ఓ మత్స్యకారుని కుమార్తె సత్యవతికి జన్మించిన రోజు కాబట్టి ఈరోజును వ్యాసపూర్ణిమగా కూడా జరుపుకుంటారు. వేద వ్యాసుడు తన కాలంలో ఉన్న అన్ని వేద స్తోత్రాలను సేకరించి వాటి లక్షణాలను ఆచారాలలో ఉపయోగించడం ఆధారంగా వాటిని నాలుగు భాగాలుగా విభజించడం ద్వారా వేద అధ్యయనాల కారణానికి గొప్ప సేవచేశాడు. తర్వాత వాటిని తన నలుగురు ముఖ్య శిష్యులైన పైల. వైశంపాయన, జైమిని సమంతులకు బోధించాడు. ఈ విభజించడం సవరించడం వలన ఆయనకు గౌరవ ప్రదమైన 'వ్యాస' లభించింది. ఆయన వేదాలను ఋగ్, యజుర్, సామ, అధర్వ అని నాలుగు భాగాలుగా విభజించారు. గురుపౌర్ణమి సందర్భంగా హిందూమతం, బౌద్ధమతం, జైనమతంలో వివిధ రకాలుగా గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించుకోవడం సంప్రదాయం. నేపాల్‌లో ట్రీనోక్ గుహపూర్ణిమ పాఠశాలల్లో పెద్దరోజు. ఈరోజు నేపాలీలకు ఉపాధ్యాయ దినోత్సవం. విద్యార్థులు తమ ఉపాధ్యాయులను రుచికరమైన వంటకాలు,దండలు స్వదేశీ బట్టతో తయారు చేసిన టోపి అని పిలిచే ప్రత్యేక టోపీలను అందజేస్తారు.. వ్యాసపౌర్ణమిరోజు పూజా విధానం..కొత్త అంగవస్త్రం మీద (నేలమీద పరచి) బియ్యం పోస్తారు. ఆ బియ్యంపైన నిమ్మకాయలు ఉంచుతారు. శంకరులు అతని నలుగురు శిష్యులు వచ్చి దానిని అందుకుంటారని నమ్మకం. పూజ అయ్యాక ఆ బియ్యం తీసుకెళ్ళి పిడికెడు చొప్పున తమ ఇండ్లలో బియ్యంలో కలుపుతారట. బియ్యం, కొత్త వస్త్రం లక్ష్మి చిహ్నం. నిమ్మపళ్ళు కార్యసిద్ధికి సూచన. నిమ్మపళ్ళు లక్ష్మి కటాక్షానికి చిహ్నం. దక్షిణాదిన కుంభకోణంలో శృంగేరిలో శంకర మఠాలలో వ్యాసపూర్ణిమ ఎంతో వైభవంగా జరుపుకుంటారు. అయితే ఈరోజున దేశంలోని మహర్షులంతా వ్యాసుని రూపంలో ఉన్న తమ గురువుని కొలుస్తారని పండితులు చెబుతారు. వైష్ణవపురాణం ప్రకారం దానం చేస్తే ఆషాడ పూర్ణిమనాడు విష్ణులోకం పొందుతారట. వ్యాసుడు సకల కళానిధి. సకలశాస్త్రవేత్త, శస్త్ర చికిత్స వేది, మేధానిధి, వైద్యపరుడు, ఆత్మ విద్యానిధి, ఈరోజున అష్టాదశ పురాణ నిర్మాత అయిన వ్యాసుని తప్పక పూజించాలి.

# నైపుణ్యంతోనే గెలుపు

తమ కలల్ని నెరవేర్చు కుంటూ కోరుకున్న ఉద్యోగంలో కుదురుకున్నా.. పదోన్నతులు అందు కోవడంలో కొందరు వెనకబడుతుంటారు. ఇలాంటప్పుడు పనితీరుని సమీక్షించుకోవడం చాలా అవసరం అదెలాగంటే..

**లక్ష్యాలకు తగ్గ ప్రణాళిక:** ప్రతి ఒక్కరికీ కొన్నిన లక్ష్యాలు ఉండాలన్నది నిజమే అయినా.. వాటిని సాధించడానికి మీ దగ్గర సరైన ప్రణాళిక ఉందో లేదో చూసు కోండి. ఎందు కంటే విజయ తీరాలకు చేరిన వారందరికీ స్పష్టమైన ఆలోచన, ప్లాన్ తప్పనిసరిగా ఉంటాయి మరి. అదీ డాక్యు మెంటేషన్ అయి ఉండాలి. లేదంటే మీ ఆలోచనలన్నీ నీటి మీద రాతలే అవు తాయి. కాలంతో పోటీ పడాలి:. ప్రణాళిక వేసు కోగానే విజయం మీ చెంతకి వచ్చేయదు. కాలం పై పట్టు, పనిపై అవ గహన కూడా ఉండాలి. ఎంత కష్టమైనా సరే, అనుకున్న గడువు కంటే ముందు చేయగలగాలి. ఇది ఒక్కసారిగా అలవడకపోవచ్చు. కానీ, ప్రయత్నిస్తే సాధ్యమే. ఎందుకంటే ఈ రోజుల్లో ప్రతి ఒక్కరూ కాలం కంటే వేగంగా పరుగెడితేనే గమ్యాన్ని చేరుకునేది. ఉద్యోగంలో చేరాం హమ్మయ్య అనుకుని సరిపెట్టేసుకోకండి. ఎప్పటికప్పుడు మార్కెట్ పోకడల్ని తెలుసుకుంటూ నైపుణ్యాలను ఒంట పట్టించు కోవాలి. ప్రముఖ సంస్థలు అప్పుడప్పుడూ శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటుచేస్తుంటాయి. అలాంటి వాటిని వినియోగించుకుని నైపుణ్యాలతో పాటు వన నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలి. చిన్న విజయానికే పొంగిపోవడం, వెనకబడినప్పుడు కుంగిపోవడం సరికాదు. ఎట్టి పరిస్థితుల్లోనూ మానసిక స్థైర్యాన్ని కోల్పోకూడదు. పొరపాటు జరిగితే కారణాలను నిశితంగా పరిశీలించుకోవాలి. విశ్లేషించుకుని.. మరోసారి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అప్పుడపనిలో నైపుణ్యం సాధించడంతో పాటు పదోన్నతులూ అందుకోగలుగుతారు. ▫



# 'పట్టు'దలతో 'నీట్'గా మెడికోలుగా..



కలలు కనడంతోనే సరిపోదు. వాటిని నిజం చేసుకోవడంలోనూ పడే శ్రమ ఒక జీవితానికి సరిపోక పోవచ్చు. ఐనా పట్టుదలతో సాధించలేనిదేదీ ఉండదని ఓ మహిళామ తల్లి నిరూపించింది. సంకల్పం ఉంటే చాలు దానికి వయసుతో నిమిత్తం లేదని ఆమె నమ్మింది అందుకే కూతురితో కలిసి 'నీట్'గా స్వయం కృషితో చదివి పోటాపోటీగా ఉత్తీర్ణత సాధించింది. ఇప్పుడి ద్దరూ వైద్య విద్యలో సహవిద్యార్థులు. వారిద్దరూ ఒకేసారి ప్రతిష్టాత్మక 'నీట్' పరీక్షలో ఉతీర్ణత సాధించారు. రాబోయే తరంలో కాబోయే డాక్టర్లుగా మెడికోలుగా సహ విద్యాభ్యాసం చేస్తున్న ఆ తల్లీ కూతుర్ల సంకల్పం, విజయ ప్రస్థానం మహిళా లోకానికి ఆదర్శప్రాయమే.తమిళనాడులో తెన్కాశికి చెందిన ఆముదవల్లి, మణిమన్నన్‌కు చిన్నప్పటి నుంచి డాక్టర్ కావాలనే బలమైన కోరిక. ఆర్థిక ఇబ్బందుల వల్ల తన ఆకాంక్షను పక్కన పెట్టేశారు. ఏ నాటికైనా సాధించలేక పోతానా? అనుకుంటూనే ఫిజియోథెరపిస్ట్‌గా సరిపెట్టుకున్నారు. ఆమె కూతురు సంయుక్త వైద్య విద్యనభ్య సించడం కోసం 'నీట్' పరీక్షకు సిద్ధమ య్యారు. ఆముదవల్లి మనసాగలేదు. తానూ చదువుకోవాలన్న ఉత్సా హం ఉరిమురిమి పడుతోంది. మనసటు లాగేసింది. కుమార్తై పరీక్షల కోసం రాత్రింబవళ్లు చదువుతుంటే తల్లి అముదవల్లి కూడా అవే పుస్తకాలు చదవడం ప్రారంభిం చారు. ఆ క్రమంలో కుమార్తైకు చదువు చెప్పే ఉద్దేశంతో మొదలైన ఆసక్తి ఆముదవల్లిలో చిన్ననాటి కల వెన్ను తట్టి లేపింది దాంతో ఆమె, కూతురితో కలిసి 'నీట్' రాసేందుకు ఏర్పాట్లు చేసుకొంది. ఇద్దరూ కలిసి ఒకేచోట కూర్చుని సందేహాలను నివృత్తి చేసుకుంటూ, ఒకరికొకరు గురువుగా పరీక్షకు సిద్ధమ య్యారు. ఇటీవల విడుదలైన 'నీట్' ఫలితాలలో వీరిద్దరి శ్రమకు తగిన ఫలితం దక్కింది. తల్లి ఆముదవల్లి 147 మార్కులు సాధించి తన సొంత ఊరికి దగ్గరలోనే ఓ ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు దక్కించుకుంది. కుమార్తై సంయుక్త 450 మార్కులతో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి కౌన్సిలింగ్‌లో సీటు పొందింది. ఆ తల్లీకూతుర్ల విజయ గాధ వింటేనే ఎందరికో స్ఫూర్తి కలిగిస్తోంది.

# గంటల తరబడి ఒకే చోట? వామ్మో



ఈ రోజుల్లో ఉద్యోగం చేసే మహిళల సంఖ్య ఎక్కువగానే ఉంది. వాళ్లలో చాలామంది క్షణం తీరికలేని పనిలో నిమగ్నమవుతున్నారు. అలా ఆఫీసులో గంటల తరబడి కూర్చోవడం వల్ల ఆరోగ్యం మీద తీవ్ర ప్రభావం చూపుతుంది. ఆఫీసుకి వెళ్లిన వెంటనే కూర్చుంటారు. ఆపై పని కారణంగా లేవలేని పరిస్థితి అలా గంటల కొద్దీ కూర్చోవడం వల్ల శరీరంలో కణాలు బలహీనపడతాయి. దీని కారణంగా రోగనిరోధక వ్యవస్థ ప్రభావితమవుతుంది. మెడ, వెన్నునొప్పి సమస్యలు మొదలవు తాయి. కాబట్టి, ఎంత బిజీగా ఉన్నా, పని మధ్యలో కొంత విరామం తీసుకోవడానికి ప్రయత్నించాలి. పని ముగిసిన తర్వాత కొదిపాటి వ్యాయామం చేస్తూ ఉంటే కండరాలు చురుకుగా పని చేస్తాయి. నిరంతరం ఒకే చోట కూర్చొని పనిచేయడం వల్ల కెలోరీలు ఖర్చుకావు. దాంతో ఊబకాయం, బరువు పెరగడం జరుగుతుంది. పని మధ్యలో నీళ్లు తాగుతూ, విరామం సమయంలో నడవడం చేస్తుండాలి. ఇల్లు లేదా ఆఫీసులో ఎక్కువసేపు ఒకే భంగిమలో కూర్చోవడం వల్ల మోకాళ్లు, నడుము నొప్పి వచ్చే అవకాశం కూడా ఎక్కువగా ఉంటుంది.

# బేసన్ ఖీర్



**కావలసినవి:** శనగపిండి: అర కప్పు, నెయ్యి: అర కప్పు, పాలు: లీటరు, చక్కెర: ఒక కప్పు, తరిగిన డ్రైఫ్రూట్స్ (బాదం, జీడిపప్పు, పిస్తా, కిస్మిస్): అర కప్పు, యాలకుల పొడి: అర టీస్పూన్, ఎల్లో ఫుడ్ కలర్: చిటికెడు.

**తయారీ:** స్టవ్ మీద కడాయి పెట్టి నెయ్యి వేయాలి. వేడయ్యాక శనగపిండి వేసి పచ్చివాసన పోయేలా వేయించాలి. ఆ పిండిలో తరిగిన డ్రైఫ్రూట్స్, యాలకుల పొడి వేసి మరికాసేపు వేయించాక పాలుపోసి మరగనివ్వాలి. మరుగుతున్న మిశ్రమంలో చక్కెర, ఎల్లో ఫుడ్ కలర్ జోడించి దగ్గర పడేంతవరకు ఉడికించి దించుకుంటే సరిపోతుంది.

చెలి
మహిళ సంబంధిత అంశాలపై వ్యాసాలు ఆహ్వానిస్తున్నాం..
ఈ మెయిల్: Cheli@vaartha.com

తెర

# 'కొరియన్ కనకరాజు'.ఆడియన్స్ నవ్వుతూనే ఉంటారు: రితిక నాయక్



**డైరెక్టర్ ఈ కథ చెప్పినప్పుడు మీకు బాగా నచ్చిన అంశం ఏమిటి?**
కొరియా వెళ్లడం నన్ను మొదట ఆకట్టుకుంది. (నవ్వుతూ) ఎందుకంటే నాకు కొరియన్ కల్చర్, అక్కడి సినిమాలు, కొరియన్ డ్రామాలు అంటే చాలా ఇష్టం. ఇందులో నేను చేసిన పాత్రకు, నా వ్యక్తిత్వానికి కూడా కొన్ని పోలికలు ఉన్నాయి. ఇది కేవలం కమర్షియల్ పాత్ర మాత్రమే కాదు. చాలా డిఫరెంట్‌గా ఉంటుంది.

**కథల ఎంపిక విషయంలో మీరు చాలా సెలెక్టివ్‌గా ఉంటారా?**
అవును. నాకు చాలా ఓపిక ఉంది. మంచి స్క్రిప్ట్ కోసం ఎంతకాలమైనా ఎదురుచూడగలను. ఒక పాత్రకు నేను 100 శాతం న్యాయం చేయగలనని అనిపిస్తేనే అంగీకరిస్తాను.

**ఈ సినిమాలో మీ పాత్ర ఎలా ఉండబోతోంది?**
ఈ సినిమాలో నేను సెల్ఫ్ ఇండిపెండెంట్, చాలా మోడరన్ అమ్మాయిగా కనిపిస్తాను. ఇప్పటివరకు నేను చేసిన పాత్రలన్నింటికంటే ఇది చాలా మోడరన్ క్యారెక్టర్.

**వరుణ్ తేజ్‌తో కలిసి పనిచేయడం ఎలా అనిపించింది?**
వరుణ్ తేజ్ చాలా హార్డ్‌వర్కింగ్ పర్సన్. తన వృత్తి పట్ల ఎంతో డెడికేషన్ ఉంటుంది. ఇటీవల కొన్ని ప్యాచ్‌వర్క్ షూట్స్ చేశాం.

**షూటింగ్ ఎక్స్‌పీరియన్స్ గురించి చెప్పండి?**
అనంతపురంలో కొంత భాగం షూటింగ్ చేశాం. అలాగే కజకిస్థాన్, కొరియాలో షూటింగ్ చేశాం. మొత్తం షూటింగ్ జర్నీ చాలా బ్యూటిఫుల్ ఎక్స్‌పీరియన్స్‌గా నిలిచిపోయింది.

**యూవీ క్రియేషన్స్‌తో కలిసి పనిచేయడం ఎలా అనిపించింది?**
యూవీ క్రియేషన్స్‌తో పనిచేయడం చాలా మంచి ఎక్స్ పీరియన్స్. షూటింగ్ సమయంలో ఒకసారి నేను అనారోగ్యానికి గురయ్యాను. ఆ సమయంలో నిర్మాతలు నా గురించి ఎంతో కేర్ తీసుకున్నారు.

**ఇతర భాషల్లో కూడా సినిమాలు చేయాలనుకుంటున్నారా?**
మంచి స్క్రిప్ట్ కోసం ఎదురుచూస్తున్నాను. అవకాశం వస్తే తప్పకుండా అన్ని భాషల్లో పనిచేయాలని ఉంది. కానీ తెలుగుకే నా మొదటి ప్రాధాన్యత.

**భవిష్యత్తులో ఎలాంటి పాత్రలు చేయాలనుకుంటున్నారు?**
మంచి కథ, పాత్రకు ప్రాధాన్యం ఉన్న అన్ని రకాల సినిమాలు చేయాలని ఉంది.

# 'డూప్'లొద్దు! 'రిస్క్'తో..













తెలుగు చిత్రసీమలో నిన్నమొన్నటి, నేటి తారల మధ్య అంతరం ఎప్పుడు కన్పిస్తునే ఉంటుంది. తొలితరం మూకీ నుంచి ప్రారంభమైన టాకీలోకి వచ్చేసరికి నటనే ప్రధానంగా అఖిల తెలుగు ప్రేక్షకుల ఆదరణ, మలి తరం నటనతోపాటు స్వయం కృషితో నాట్యాభినయంతో ప్రేక్షకులకు దగ్గరయ్యారు. నేటి తరం సరికొత్త పోకడలతో ప్రేక్షకాదరణకోసం ట్రెండ్ మార్చింది. విపరీతమైన 'రిస్క్'లు చేసి సినిమాల్ని విజయవంతం చేయడమే ప్రధానంగా భావిస్తున్నారు. ఎడాపెడా వచ్చేవి వస్తున్నవి ఇక 'పాన్' ఇండియా చిత్రాలే కనుక ప్రపంచ వ్యాప్తంగా దక్షిణాది చిత్రాలను విశ్వవ్యాప్త చిత్ర రాజాలుగా విస్తృత సొంతం చేసుకుంటున్నాయి. ఈ తరం హీరోలు ప్రతి ఒక్కరూ నటనకే ప్రాధాన్యత కాకుండా తాము ధరించే ప్రాతల్లో వైవిధ్యత కనపడే విధంగా రూపకల్పన చేసు కొంటున్నారు. ఒకప్పుడు ఫైట్స్ చేయాలంటే 'డూప్'లుండేవారు. ఇప్పుడు స్వయంగా వారే యుద్ధ విన్యాస చిత్రీకరణలో పాల్గొంటున్నారు. ఏమైతే సాహసానికి వారే ప్రతినిధులుగా 'హీరోదాత్తత'ను చూపిస్తున్నారు. పాత్రోచితంగా బరువు తగ్గడాలు, వ్యాయామంపై దృష్టి, డైట్, గడ్డం, స్టైల్, మేకప్ అన్నింటిలోనూ విభిన్నత చూపిస్తున్నారు. వాటికెంతో ఆసక్తి, పట్టుదల కలిగి ఉన్నవారే చిత్రసీమలో రాణిస్తున్నారు. ఈ క్రమంలో అఖండుడు 'బాలకృష్ణ','పెద్ది' రాంచరణ్ తేజ్, 'ఓజి' పవన్‌కళ్యాణ్, టైగర్ జూనియర్ ఎన్‌టిఆర్‌లు రిస్క్‌ఫైట్‌లు, నటనలతో 'సర్జరీ'ల వరకు వచ్చారు. వారలాంటి ఇబ్బందికి గురవుతున్నరంటే ఆయా పాత్రల్లో జీవిస్తు న్నారనే చెప్పాలి. వారి శ్రమ అందులో కనపడుతుంది. అందుకే ప్రేక్షక జనం వారినారాధిస్తున్నారు. థియేటర్‌లో ఈలలు వేస్తున్నారు, కేరింతలు కొడుతున్నారు. ఇవేమీ చేయకూండా కేవలం వారసత్వంలోనో, అదృష్టవశాత్తునో హీరోలైపోయారంటే నమ్మలేం. సినీ పరిశ్రమలో అందం, ఫిట్‌నెస్,యవ్వనాన్ని కాపాడుకోవడం.. ఇవన్నీ ప్రథమ ప్రాధాన్యతలోనే ఉంటాయి. మన చిత్రాల్లో మన హీరోలకు ఎంతమందినైనా చితకబాదే సన్నివేశా లుంటాయి. డూప్‌లతో సరిపెడితే సరి. కానీ నేటి తరం హీరోలు తామే స్వయంగా చిత్రీకరణలో ఉంటామనడమే చిక్కొచ్చిపడింది. కొందరు సినీ యువ హీరోలి ప్పుడు 'సర్జరీ'ల బాటపట్టారు. మెగాస్టార్ చిరంజీవి 'మన శంకరవరప్రసాద్' చిత్ర ప్రమోషన్స్ సమయంలో 'మోకాలి నొప్పి'కి సర్జరీ చేయించుకు న్నారనే వార్త 'హల్‌చల్' అయింది. మొన్నీమధ్య నందమూరి బాలకృష్ణ కాకినాడలో షూటింగ్‌లో ఉండగా జారి పడితే ఫ్యాక్చర్‌కు శస్త్ర చికిత్స చేయించు కున్నారు. పవర్‌స్టార్ పవన్‌కళ్యాణ్ ముంబాయి ఆసుపత్రిలో రెండు భుజాలకు సర్జరీ. మెగాపవర్‌స్టార్ రామ్‌చరణ్‌కు కోయం బత్తూరులో మణికట్టుకు ఆర్థోపెడిక్ వైద్యం విశిష్ట చికిత్సలు చేసే వైద్యునిగా పేరొందిన డాక్టర్ రాజశేఖర్ శస్త్ర చికిత్స చేసారు. ఈ శాస్త్ర చికిత్సలో అమెరికాలోని మయామికి చెందిన ప్రముఖ హ్యాండ్ అండ్ రిస్ట్ సర్జన్ డాక్టర్ అలెహాంద్రో బాడియా ప్రత్యేకంగా పాల్గొన్నారు. అంతకు ముందు 1982లో బాలీవుడ్ నటుడు అమితాబ్‌బచ్చన్ 'కూలీ' చిత్రం షూటింగ్‌లో ప్రాణాంతక ప్రమాదం జరగా 'సెలబ్రిటీల శస్త్ర చికిత్సలపై అప్పట్లోనే చర్చ మొదలైంది. సాధారణంగా ఇలాంటివి జరిగినప్పుడు ఆయా కధానాయకుల అభిమానులు ఆ హీరోల ఆరోగ్యం కోసం వేయి దేవుళ్లకు మొక్కుతుంటారు. ఇప్పుడు అదే జరిగింది. స్టార్‌డమ్' వెనుక కష్టాలు, పట్టుదల, ఉంటేనే ఆ రంగంలో రాణిస్తారన్నది సర్వవిదితం. యాక్షన్ సీన్స్‌లో తామే స్వయంగా పాల్గొనాలన్న జిజ్ఞాస కారణంగా జూనియర్ ఎన్టీయార్ కూడా సర్జరీ చేయించుకున్నారని ఫిల్మ్ ఇండస్ట్రీ టాక్. చిత్రాలు, చిత్ర కథానాయకులు, పాత్ర ధారులు ప్రేక్షకులకు వినోదాన్ని, విజ్ఞానాన్ని, సమాజపు అడుగుజాడల్ని ప్రత్యక్షంగా అందచేయా లని సంకల్పించనందున వారి శ్రమ ఊరికే పోరాదు.

# 'చెన్నై లవ్ స్టోరీ' సక్సెస్ మీట్‌లో నాగచైతన్య





హీరో కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరి ప్రియ జంటగా నటించిన "చెన్నై లవ్ స్టోరీ" సినిమా అన్ని వర్గాల ప్రేక్షకుల ఆదరణతో ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. ఒక బ్యూటిఫుల్ లవ్ స్టోరీతో ఆకట్టుకున్నా రంటూ సినిమా చూసిన ప్రతి ఒక్కరూ స్పందిస్తున్నారు. దర్శకుడు, నటుడు దేవిప్రసాద్ మాట్లాడుతూ చెన్నై లవ్ స్టోరీ లాంటి మంచి ప్రేమ కథా చిత్రానికి ఘన విజయాన్ని అందించిన ప్రేక్షకులకు థ్యాంక్స్ దర్శకుడు, నటుడు కరుణ కుమార్ మాట్లాడుతూ సినిమాల ట్రెండ్ మారుతున్నా, ఎప్పటికీ మారనివి ప్రేమ కథలు మాత్రమే. అలా వచ్చిన మంచి ప్రేమ కథా చిత్రం చెన్నై లవ్ స్టోరీ. లిరిక్ రైటర్ అనంత శ్రీరామ్ మాట్లాడుతూ ఏ నిర్మాతలైనా ఆదివారం వరకు గుండెల మీద చేయి వేసుకుని ఉంటారు. సోమవారం వారిలో ఉత్కంఠ మొదలవు తుంది. మైత్రీ శశి మాట్లాడుతూ చెన్నై లవ్ స్టోరీ సినిమాకు నైజాంలో మార్నింగ్ షోస్ 40 లక్షల గ్రాస్ వస్తే మ్యాట్నీకే 90 లక్షలకు పెరిగింది. అంటే ఈ సినిమాను ప్రేక్షకులు ఎంత ఫాస్ట్ గా రిసీవ్ చేసుకున్నారు అనేది తెలుస్తోంది. హీరో నాగచైతన్య మాట్లాడుతూ ఈ ఈవెంట్ కు వచ్చినందుకు నాకు థ్యాంక్స్ చెబుతున్నారు. నాకు కృతజ్ఞతలు చెప్పాల్సిన అవసరం లేదు. ఈ వేదిక మీద మీ అందరి సక్సెస్ సెలబ్రేట్ చేయడం నాకు హ్యాపీగా ఉంది.

# ఆదర్శ కుటుంబం హౌస్ నెం.47' AK47లో స్వర్ణగా శ్రీనిధి శెట్టి పరిచయం



విక్టరీ వెంకటేష్ పోషించిన చిట్టిబాబు పాత్ర పరిచయానికి ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించిన నేపథ్యంలో, 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం. 47' (AK47) చిత్ర బృందం ఈ ఆదర్శ కుటుంబంలోని మరో కీలక సభ్యురాలిని పరిచయం చేసింది.ఈ చిత్రంలో శ్రీనిధి శెట్టి 'స్వర్ణ' పాత్రలో నటిస్తున్నారు. చిట్టిబాబుకు భార్యగా, చిరునవ్వే చిరునామాగా ఉండే ఓ ఆప్యాయమైన మధ్యతరగతి ఇల్లాలిగా ఆమె పాత్ర ప్రేక్షకుల హృదయాలను హత్తుకోనుంది. చిట్టిబాబు-స్వర్ణల మధ్య ఉండే అనుబంధం, చిలిపి సంభాషణలు, అనురాగం, కుటుంబ విలువలు సినిమాకు మరింత ఆత్మను, ఆహ్లాదాన్ని అందించనున్నాయి.విడుదలైన ఈ క్యారెక్టర్ గ్లింప్స్‌లో నివేదా పేతురాజ్, ప్రముఖ హాస్యనటుడు సత్య కొన్ని క్షణాలు కనిపిస్తూ చిత్రంలోని వినోదాత్మక వాతావరణాన్ని మరింత ఆసక్తికరంగా మలిచారు. ఇప్పటికే విడుదలైన పాత్ర పరిచయాలు ప్రేక్షకుల్లో విశేష ఆసక్తిని రేకెత్తించగా, త్వరలోనే యువినా పార్థవిను సంపూర్ణగా, రాజా ప్రజ్వల్ను 'సర్వ'గా చిత్ర బృందం పరిచయం చేయనుంది.

# KJQ (కింగ్ జాకీ క్వీన్) ట్రైలర్ రిలీజ్



సక్సెస్ ఫుల్ నిర్మాత సుధాకర్ చెరుకూరి SLV సినిమాస్ బ్యానర్ పై నిర్మించిన పీరియడ్ క్రైమ్ డ్రామా KJQ(కింగ్ జాకీ క్వీన్). 1990ల నాటి నేప థ్యంలో సాగే ఈ చిత్రంలో దసరా, దిగర్ల్‌ఫ్రెండ్ చిత్రాలతో గుర్తింపు పొందిన దీక్షిత్ శెట్టి హీరోగా నటిస్తున్నారు. వీరితో పాటు నూతన నటుడు శశి ఓదెల, యుక్తి తరేజా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. గత ఏడాది కన్నుమూసిన దర్శకుడు రీరీకి ఇది చివరి చిత్రం. ఆయన క్రియేటివిటీ, సినిమా పట్ల ఆయనకున్న అంకితభావానికి ఇది ఒక నివాళిగా నిలుస్తుంది. దావూద్ ఇబ్రహీం, అజ్మల్ కసబ్, మదర్ థెరిసాలతో పోలుస్తూ ప్రధాన పాత్రలను పరిచయం చేసే ఆకట్టుకునే వాయిస్‌ఓవర్‌తో ట్రైలర్ ప్రారంభమవుతుంది. పరిస్థితులు ఒక మనిషిని క్రూర మృగంగానో, గొప్ప మహర్షిగానో లేదా సాధారణ మనిషి గానో ఎలా మారుస్తాయో ఇది సూచిస్తుంది, దీక్షిత్ శెట్టి, శశి ఓదెల, యుక్తి తరేజా పోషించిన పాత్రలకు బలమైన పునాదిని వేస్తుంది. దీక్షి త్ శెట్టి అద్భుతమైన నటనతో కథను తన భుజాలపై మోశారు, ఆయన స్క్రీన్ ప్రెజెన్స్, నటన కథనానికి ఎంతో బలాన్ని చేకూర్చాయి. నూతన నటుడు శశి ఓదెల తన నటనతో ఆకట్టుకుని మంచి ముద్ర వేశారు, దర్శకుడు రీరీ ఎమోషన్స్ సంఘర్షణలు, ఆసక్తి కరమైన సన్నివేశాల కలయికతో ఈ పీరియడ్ క్రైమ్ డ్రామాను అద్భుతంగా మలిచారు

# 'శ్రీ శ్రీ' నుంచి 'బొమ్మ బొమ్మ' సాంగ్ రిలీజ్



వెర్సటైల్ హీరో దుల్కర్ సల్మాన్ ప్రస్తుతం నూతన దర్శకుడు రవి నెలకుదిటి దర్శకత్వంలో రూపొందుతున్న క్రేజీ ఎంటర్‌టైనర్ శ్రీ శ్రీ బిజీగా ఉన్నారు. ప్రతిష్టాత్మక ఎస్‌ఎల్వి సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్, నిర్మాణ సంస్థకు 10వ ( SLV10) మైల్ స్టోన్ చిత్రంగా నిలుస్తోంది. ఇషాన్ సక్సేనా ఈ చిత్రానికి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. దుల్కర్ సల్మాన్, పూజా హెగ్డే తొలిసారి జంటగా నటిస్తున్న ఈ సినిమా ప్రేమ, వినోదం, భావోద్వేగాలతో కూడిన రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే విడుదలైన వర్కింగ్ స్టిల్స్, ఫస్ట్ లుక్ పోస్టర్ మంచి స్పందన అందుకోగా, తాజాగా ఈ సినిమా మ్యూజికల్ జర్నీని ప్రారంభిస్తూ తొలి పాట 'బొమ్మ బొమ్మ'ను మేకర్స్ విడుదల చేశారు. రైల్వే స్టేషన్‌లో బెంచ్‌పై కూర్చున్న దుల్కర్ సల్మాన్, ప్లాట్‌ఫామ్‌పైకి పూజా హెగ్డే అడుగుపెట్టిన క్షణమే ఆమెకు మెస్మరైజ్ అవుతాడు . అక్కడి నుంచి ఇద్దరి అందమైన ప్రేమ ప్రయాణాన్ని, ఆనంద క్షణాలను, వారితో పాటు ఉండే ఓ బృందాన్ని ఈ పాటలో అందంగా చూపించారు.సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ మరోసారి మనసును హత్తుకునే మధురమైన మెలోడీని అందించారు. ఆహ్లాదకరమైన ట్యూన్, అందమైన ఆర్కెస్ట్రేషన్‌తో ఈ పాట ఆకట్టుకుంటుంది.అనంత శ్రీరామ్ తన సాహిత్యంతో ప్రేమలో మునిగిపోయిన ఓ యువకుడి భావాలను కవితాత్మకంగా ఆవిష్కరిస్తూ, కథానాయిక అందం, ఆమె ప్రత్యేకతను ఎంతో అందంగా వర్ణించారు.

## శ్రీకాకుళం-1 డిపోలో చోదకులకు అవగాహన సదస్సు



**శ్రీకాకుళం, జూలై 28, ప్రభాతవార్త :**

రహదారి భద్రతా వారోత్సవాలలో భాగంగా మంగళవారం శ్రీకాకుళం-1 డిపో గ్యారేజ్ ఆవరణలో గల సమావేశ మందిరంలో రహదారి భద్రతపై అవగాహన సదస్సు మరియు శిక్షణా కార్యక్రమం నిర్వహించబడినది. ఈ కార్యక్రమంలో జిల్లాలో గల 4 డిపోల నుండి చోదకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సదస్సులో రహదారి నియమాలను పాటించడం, వేగ నియంత్రణ, మద్యం సేవించి వాహనం నడపరాదని, ప్రయాణీకుల భద్రత, వాహన నిర్వహణ తదితర అంశాలపై చోదకులకు వివరంగా ప్రాంతీయ రవాణా అధికారి గంగాధర్ అవగాహన కల్పించారు. ప్రమాదాలను నివారించి సురక్షిత ప్రయాణం అందించాల్సిన బాధ్యత చోదకులపైనే ఉందని, ప్రతి ఒక్కరూ భద్రతా నిబంధనలను కఠినంగా పాటించాలని, జిల్లా ప్రజా రవాణా అధికారి, అప్పలనారాయణ సూచించారు. కార్యక్రమం చివరలో ప్రయాణీకులు మరియు ఉద్యోగుల క్షేమం కొరకు భద్రసూక్తి పారాయణం చేయబడినది. కార్యక్రమంలో చోదకులతో పాటు, సూపర్ వైజర్లు, అసోసియేషన్ ప్రతినిధులు, మెకానికల్ సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం : విప్ అశోక్



**కంచిలి, జూలై 28, ప్రభాతవార్త :**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తుందని ప్రభుత్వ విప్ ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. మంగళవారం కంచిలి మండలం జాడుపూడి కేజీబీవీ, కంచిలి అంబేద్కర్ గురుకుల పాఠశాలలో సుమారు మూడు కోట్ల రూపాయల విలువ గల నూతనంగా నిర్మించిన అదనపు తరగతి భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఆంధ్ర రాష్ట్రం అభివృద్ధిలో కుంటుపడిపోయిందని, రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని, దొరికింది తడవుగా దోచుకున్నారని అన్నారు. జాడుపూడి కేజీబీవీలో ఉపాధ్యాయులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అలాగే కంచిలి గురుకుల పాఠశాలలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం పాఠశాలలో కిచెన్ షెడ్, డార్మెటరీలను పరిశీలించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ దాసరి రాజు సోషల్ వెల్ఫేర్ అధికారిని యశోద లక్ష్మి, ఎంపీడీవో వి.తిరుమలరావు, ఎంఈఓ సప్పతి శివరాం ప్రసాద్, జాడుపూడి మాజీ సర్పంచ్ పిలక చిన్నబాబు, మండల పార్టీ అధ్యక్షులు మాదిన రామారావు, బంగారు కురయ్య, పైల పురుషోత్తం రెడ్డి, జగదీష్ పట్నాయక్, మద్దిల ఆనంద్, ప్రిన్సిపాల్ ఎన్వి రమణయ్య, కేజీబీవీ ప్రిన్సిపాల్ పి.వాణి కుమారి వివిధ శాఖల అధికారులు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఉద్యోగి కష్ట కాలంలో అండగా నిలిచిన లక్కీ షాపింగ్ మాల్



**పలాస, జూలై 28, ప్రభాతవార్త :**

మానవత్వం ఇంకా సజీవంగానే ఉందని నిరూపించే ఘటన పలాసలో చోటుచేసుకుంది. గత మూడు సంవత్సరాలుగా లక్కీ షాపింగ్ మాల్‌లో సేల్స్‌మ్యాన్‌గా విధులు నిర్వహిస్తున్న జ్యోతిష్ కుమార్‌కు చిన్నతనంలోనే తండ్రి, అక్క మృతి చెందగా, ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న తల్లి కూడా మంగళవారం కన్ను మూశారు. కుటుంబంలో అండదండలు ఎవరూ లేక దిక్కుతోచని పరిస్థితిలో ఉన్న జ్యోతిష్‌కుమార్‌కు లక్కీ షాపింగ్ మాల్ యాజమాన్యం, మేనేజ్‌మెంట్, సిబ్బంది అండగా నిలిచారు. తల్లి అంత్యక్రియలను స్వయంగా నిర్వహించడమే కాకుండా, దహన సంస్కారాలకు అవసరమైన ఏర్పాట్లు చేసి ఆర్థిక సహాయాన్ని కూడా అందించారు. ఈ సందర్భంగా సహోద్యోగులు మాట్లాడుతూ కష్టసమయంలో ఒక కుటుంబ సభ్యుడిలా జ్యోతిష్‌కుమార్‌కు అండగా నిలవడం తమ బాధ్యతగా భావించామని తెలిపారు. లక్కీ షాపింగ్ మాల్ యాజమాన్యం చూపిన మానవత్వం, ఉద్యోగిపై కనబరిచిన ఆప్యాయతను స్థానికులు అభినందించారు.

## బహిరంగ చర్చకు మేము సిద్ధం

### వైసీపీ సమన్వయకర్త శ్యాం ప్రసాద్ రెడ్డి



**కవిటి, జూలై 28, ప్రభాతవార్త :**

మత్స్యకారుల సామాజిక ఆర్థిక రాజకీయ సంక్షేమ అభివృద్ధికి బహిరంగ చర్చకు మేము సిద్ధమంటూ ఇచ్ఛాపురం నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త శ్యాం ప్రసాద్ రెడ్డి ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. సోమవారం ఇచ్ఛాపురం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ డాక్టర్ అశోక్ మత్స్యకారుల అభివృద్ధి, బీమా సౌకర్యాలపై పత్రికల ద్వారా విసిరిన సవాల్‌పై మేము బహిరంగ చర్చకు సిద్ధమేనని గత 40 ఏళ్ల కాలంలో టిడిపి చేసిన అభివృద్ధి ఐదేళ్లలో వైఎస్ఆర్సిపి చేసిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమేనని పిలుపునిచ్చారు. మత్స్యకారులకు ఎవరు ఎటువంటి కార్యక్రమాలు చేపట్టారు, ఎటువంటి సంక్షేమ కార్యక్రమాలు రూపొందించారు, ఎవరి హయాంలో మత్స్యకారులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించారు, వలసల నివారణకు ఎవరు ఎటువంటి చర్యలు తీసుకున్నారు చర్చించడానికి మేము సిద్ధమని అన్నారు.

## రణస్థలంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం



**రణస్థలం, జూలై 28, ప్రభాతవార్త :**

రణస్థలం పంచాయతీ పరిధిలో గల బండిపాలెం రైతు భరోసా కేంద్రంలో మంగళవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి డి.విజయ్ భాస్కర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం రైతుల సంక్షేమానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఎల్ నినో ప్రభావంతో వాతావరణంలో మార్పులు వలన వర్షపాతం తగ్గినందున రైతులంతా తప్పనిసరిగా పంటలు భీమా చేసుకోవాలని ఆయన సూచించారు. రైతు వాటాగా ప్రీమియం మొత్తం మొక్క జొన్న పంటకు ఎకరాకు రూ.66లు, వరి పంటకు ఎకరాకు రూ.160లు చెల్లించవలసిందిగా సూచించారు. పంటలు నష్టపోయిన యెడల మొక్క జొన్న పంటకు ఎకరా రూ.33000, వరి పంటకు ఎకరాకు రూ.40,000లు బీమా రక్షణ మొత్తం రైతులు పొందడం జరుగుతుందని ఆయన తెలిపారు. మొక్క జొన్న పంటకు ఈ నెల 31లోగా, వరి పంటకు వచ్చే నెల15 లోగా అర్హులైన రైతులంతా భీమా నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు ఎమ్.సునీత, వై.రాజశేఖర్, విఏఏ పి.వంశీ కుమార్, రైతులు కరిమజ్జి అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ



**సంతబొమ్మాళి, జూలై 28, ప్రభాతవార్త :**

మండల కేంద్రం సంతబొమ్మాళి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో గల భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు సమగ్ర శిక్ష ద్వారా ఉపకరణాల మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు జె. చిన్నవాడు, డి.అర్జునుడు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాబూరావు, సహిత విద్య ఉపాధ్యాయులు బి.భాస్కరరావు, అచ్యుతరావు, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ జి.కిరణ్ కుమార్, అలాగే దివ్యాంగ విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## లద్దెపురుగు నివారణకు ఇమామెక్టిన్ బెంజిమేట్ పిచికారీ చేయాలి



**కోటబొమ్మాళి, జూలై 28, ప్రభాతవార్త :**

ఖరీఫ్ మెట్ట ప్రాంతంలో రైతులు సాగు చేస్తున్న వేరుశనగ పంటకు వ్యాధి చెందుతున్న లద్దెపురుగు నివారణకు ఇమామెక్టిన్ బెంజిమేట్ 100 గ్రాముల మందులను ఒక ఎకరాకు పిచికారి చేయాలని జిల్లా ఆత్మ పీడీ కె.జగన్మోహన్‌రావు అన్నారు. ఆయన మంగళవారం మండలం సౌడాం గ్రామంలో కెవీకె కో-ఆర్డినేటర్ కె.భాగ్యలక్ష్మి, ఏఆరఎస్, రాగోలు శాస్త్రవేత్త పి.ఉదయ్‌బాబుతో కలిసి పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొని రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధిక యూరియా వాడకం వలన వర్షాభావ పరిస్థితులలో కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎస్.గోవిందరావు, వీఏఏ రాంబాబు, ఎంపీటీసీ పట్ట సింహాచలం, రైతులు పాల్గొన్నారు.

## టీఎన్‌ఏ కార్యాచరణ ప్రణాళిక శిక్షణ



**టెక్కలి, జూలై 28, ప్రభాతవార్త :**

టెక్కలి డివిజనల్ డెవలప్మెంట్ అధికారిని ఏ.అలివేలు మంగమ్మ అధ్యక్షతన డివిజన్‌లోని అన్ని మండలాల పంచాయతీ అభివృద్ధి అధికారులు, డిజిటల్ అసిస్టెంట్స్‌లతో టీఎన్ఏ కార్యాచరణ ప్రణాళిక శిక్షణ కార్యక్రమం డీడీఓ కార్యాలయ సమావేశపు మందిరంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పంచాయతీ పరిపాలనలో నిర్వర్తించవలసిన విధి విధానాలను, ఏ.పీ.పీఆర్ చట్టంపై అవగాహనను తెలియజేయడం జరిగింది. శిక్షణలో టెక్కలి ఎంపీడీఓ ఎం.రేణుక, పరిపాలన అధికారిని ఏ.ఉమాసుందరి, టెక్కలి డివిజన్‌లోని అన్ని మండలాల పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

## నేడు గురుపౌర్ణమి వేడుకలు

**ఆమదాలవలస, జూలై 28, (ప్రభాతవార్త):**

ఆమదాలవలస మండలం కట్యాచార్యులపేట గ్రామంలో ఉన్న షిరిడి సాయిబాబా ఆలయంలో బుధవారం గురుపౌర్ణమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు శ్రీ సాయి ధ్యాన మందిర కమిటీ సభ్యులు ఎన్ని రామచంద్రరావు తెలిపారు. ఉదయం సాయిబాబాకు అభిషేకాలు, అర్చన, ఆరాధన పూజ మహోత్సవాలు నిర్వహించి, మధ్యాహ్నం ఆలయం ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో భక్తులకు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని తెలియజేశారు.

## వైకాపా అరాచకాలను వివరిస్తూ... అభివృద్ధిని తెలియజేస్తూ

### -ఇంటింటికీ తెలుగుదేశంలో ఉత్సాహంగా పాల్గొన్న పార్టీ శ్రేణులు



**కోటబొమ్మాళి, జూలై 28 ,ప్రభాతవార్త :**

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పిలుపు మేరకు తెదేపా శ్రేణులు ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. మంగళవారం కోటబొమ్మాళి మేజర్ పంచాయతీలో రాష్ట్ర కళింగ కోమటి కార్పొరేషన్ అధ్యక్షుడు బోయిన గోవిందరాజులు ఆధ్వర్యంలో మండల పార్టీ అధ్యక్షుడు బోయిన సత్యశ్రీనివాస్ స్థానిక టిడిపి నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్ళి వైకాపా అరాచకాలను వివరిస్తూ.. రెండేళ్ల కూటమి హయాంలోని అభివృద్ధిని ప్రజలకు వివరించారు. జనాలను ఆప్యాయంగా పలకరిస్తూ అక్కడకక్కడ అర్జీలు తీసుకున్నారు.కార్యక్రమంలో దేశం నాయకులు కోరాడ గోవింద, తంగుడు కృష్ణస్వామి, పాత్రుని గోపి, బి.రంగా, బొమ్మాళి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలం లఖందిడ్డి గ్రామంలో నీటి సంఘం అధ్యక్షుడు కర్రి అప్పారావు పార్టీ శ్రేణులతో కలిసి సంక్షేమ పథకాలు వివరించారు.

## భావనపాడులో 'ఇంటింటికి టీడీపీ' కార్యక్రమం



**సంతబొమ్మాళి, జూలై 28, ప్రభాతవార్త :**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే లక్ష్యంతో చేపట్టిన 'ఇంటింటికీ టీడీపీ' కార్యక్రమం సంతబొమ్మాళి మండలంలో కొనసాగింది. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సుగ్గు శాంతిస్వరూప్ రెడ్డి ఆధ్వర్యంలో భావనపాడు, మర్రిపాడు, ఇజ్జువరం పంచాయతీలలో మంగళవారం ఇంటింటికీ టీడీపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం గత రెండు సంవత్సరాల్లో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ నిర్ణయాలను ప్రజలకు వివరించారు. అలాగే ప్రజల అభిప్రాయాలు, స్థానిక సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలియజేశారు. మండల పిఏసియస్ అధ్యక్షులు కూచెట్టి కాంతారావు, మాజీ అధ్యక్షులు అట్టాడ రాంప్రసాద్, రెడ్డి అప్పన్న, పంగ అసిరినాయుడు, సూరాడ ధనరాజు, అప్పిని వెంకటేష్, సవ్వాన ప్రసాద్, బొడ్డేపల్లి సత్యనారాయణ, భై తులసిదాసు, కూచెట్టి భాను ప్రకాష్, తెదేపా నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా 'ఇంటింటికీ కూటమి' కార్యక్రమం



**పలాస, జూలై 28, ప్రభాతవార్త :**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇంటింటికీ తెలుగు దేశం' కార్యక్రమంలో భాగంగా మంగళవారం పలాస నియోజకవర్గంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని ప్రచారం నిర్వహించారు. స్థానిక శాసనసభ్యురాలు సవర గోవిందపురంలో హాజరవ్వగా ఎమ్మెల్యే శిరీష ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని వివిధ గ్రామ పంచాయతీల్లో ఉత్సాహభరిత వాతావరణంలో చేపట్టినట్లు స్థానిక నేతలు తెలిపారు. మంగళవారం ఉదయం నుంచే అంబుగాం గ్రామ పంచాయతీ పరిధిలోని బొడ్డులూరు, దున్నూరు గ్రామ పంచాయతీ పరిధిలోని నొల్లూరు, అలాగే తాళ్ళగురంటి గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్దకొస్తా, తాళ్ళగురంటి, బలరాంపురం గ్రామాల్లో నాయకులు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వివిధ పంచాయతీల నుంచి ముఖ్య సీనియర్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ నిధులు రూ.10 లక్షలు మంజూరు

**ఇచ్ఛాపురం, జూలై 28, ప్రభాతవార్త :**

మండలంలో రెండు పంచాయతీలకు జిల్లా పరిషత్ నిధులు 10 లక్షల రూపాయలు మంజూరైనట్లు జడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మ రెడ్డి చెప్పారు. తులసిగాంలో 5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం, తేలుకుంచిలో రూ.5లక్షలతో శ్మశాన వాటిక షెల్టర్ నిర్మాణంనకు నిధులు మంజూరైనట్లు తెలిపారు.

## మిర్తి బట్టి అభివృద్ధిపై ఆరోపణలు తగవు

### -మీడియా సమావేశంలో టీడీపీ నాయకులు ధ్వజం



**ఆమదాలవలస, జూలై 28, (ప్రభాతవార్త)**

ఆమదాలవలస మండలం తోటాడ రెవిన్యూ పరిధిలో ఉన్న మిర్తి బట్టి కాలువ అభివృద్ధిపై వైసీపీ నాయకులు ఆరోపణలు చేయడం తగదని నారాయణపురం ఆనకట్ట చైర్మన్ సనపల డిల్లేశ్వరరావు తెలిపారు. టిడిపి కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రైతుల ఇబ్బందులను గుర్తించి కూటమి ప్రభుత్వం మిర్తి బట్టి కాలువ అభివృద్ధికి చర్యలు తీసుకుందని స్పష్టం చేశారు. గత వైకాపా ప్రభుత్వంలో చేయలేని అభివృద్ధి పనులను ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చేయడంతో ఓర్వలేని కొందరు వైసీపీ నాయకులు అర్ధరహితంగా మాట్లాడడం తగదని అన్నారు. కాలువలో చెత్తాచెదారం పేరుకుపోవడం వలన, ఆక్రమణలకు గురికావడంతో సాగునీరు నిల్వచేరి పంట పొలాలు ముంపుకు గురి కావడం వలన రైతులు ఈ సమస్యపై ప్రభుత్వానికి వినతి పత్రం అందజేశారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు కాలువ పరిధిలో ఉన్న ఆక్రమణలు తొలగించి, కాలువకు రెండు వైపులా రక్షణ గోడ నిర్మించడం జరుగుతుందన్నారు. దీనిపై ఎటువంటి సందేహాలు ఉన్న కాలువ నిర్మాణాన్ని పరిశీలిస్తే ఆధారాలు లభిస్తాయని తెలిపారు. ఎటువంటి ఆధారాలు లేకుండా ఆక్రమణ చేస్తున్నారని లేనిపోని విమర్శలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కూటమి తర్వాత అధికారం చేపట్టిన వెంటనే ఇరిగేషన్ వ్యవస్థను ప్రక్షాళన చేసి, కాలువాలను అభివృద్ధి చేసి రైతులకు సాగునీరు పుష్కలంగా అందించడం జరుగుతుందన్నారు. ఇప్పటికైనా వైకాపా నాయకులు విమర్శలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, టిడిపి మండల అధ్యక్షుడు నూక రాజు, టిడిపి రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్, హనుమంతు బాలకృష్ణ పాల్గొన్నారు.

## కనీస వేతనాలకై ఆశా వర్కర్ల పోరుబాట



**కొత్తూరు, జూలై 28, ప్రభాతవార్త :**

ఉద్యోగ భద్రత కల్పిస్తూ, కనీస వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 31వ తేదీన కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న మహాధర్నాలో ఆశా వర్కర్లందరూ పెద్ద ఎత్తున పాల్గొంటారని ఏపీ ఆశా వర్కర్ల యూనియన్ (సిఐటియు) నాయకులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం కొత్తూరు మండలం కురిగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) వైద్యాధికారి డాక్టర్ పెద్దిన ప్రసన్న కుమార్‌కు ఆశా వర్కర్ల యూనియన్ ప్రతినిధులు సమ్మె నోటీసుతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు కె.జ్యోత్స్న, ఎస్.గౌరమ్మ, పద్మ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లకు కనీస వేతనం అమలు చేయడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించి, వారి హక్కులను పరిరక్షించాలని కోరారు. అలాగే గ్రూప్ ఇన్సూరెన్స్ తదితర సదుపాయాలను ప్రభుత్వం వెంటనే వర్తింపజేయాలన్నారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసమే జూలై 31న కలెక్టర్ కార్యాలయం వద్ద మహాధర్నా చేపడుతున్నామని, కార్యక్రమంలో ఆశా వర్కర్లందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు నిర్మల, శ్రీలత, లక్ష్మి , తదితరులు పాల్గొన్నారు.

## విమానాశ్రయ ప్రారంభోత్సవం విజయవంతం చేయాలి

### -చీరాల శాసన సభ్యులు కొండయ్య



**కోటబొమ్మాళి, జూలై 28, ప్రభాతవార్త:**

ప్రధానమంత్రి మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రమం అగస్టు 1న ప్రారంభం కానున్న సందర్భంగా కూటమి నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని చిరాల శాసన సభ్యులు కొండయ్య తెలిపారు. ఆయన మంగళవారం స్థానిక ఎన్టీఆర్ భవనంలో మండల దేశం నేతలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తనకు కార్యక్రమానికి జిల్లాకు జనసమీకరణ కార్యక్రమానికి ఇన్‌చార్జ్‌గా నియమించారని టెక్కలి నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మండల టిడిపి పార్టీ అధ్యక్షుడు బోయిన సత్యశ్రీనివాస్, పీఏసీఎస్ డైరెక్టర్ సాసుమంతు అనంద్, టీడీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు చింతల సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.



కంచిలి మండలం కొల్లూరు పంచాయతీ కర్తలి గ్రామంలో మంగళవారం భూలోకమాత సంబరం జరిగింది. కార్యక్రమంలో ఐటీడీపి కంచిలి మండలం అధ్యక్షులు వాసాల రమేష్ రెడ్డి, మాజీ సర్పంచ్ సూర్యనారాయణ రెడ్డి, గ్రామ పెద్దలు, యువత ప్రజలు పాల్గొన్నారు.

**- ప్రభాతవార్త - కంచిలి**

# శ్రీకాకుళం వార్త



## ప్రకృతి వ్యవసాయంతోనే పంటలకు రక్షణ



**కొత్తూరు, జూలై 28, ప్రభాతవార్త :**

మండలంలోని మారుమూల గిరిజన గ్రామం అల్తీ పంచాయతీలో మాస్టర్ ట్రైనర్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ విధానాలపై రైతులకు ప్రత్యక్ష అవగాహన నిర్వహించారు. ఇందులో భాగంగా రైతుల చేత వరి నారును బీజామృతంతో శుద్ధి చేయించి, నారు కొసలు తుంచి, వరుస క్రమంలో నాట్లు వేయించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్ సూర్యనారాయణ మాట్లాడుతూ వరి నాటే ముందు నారు కొసలను తుంచడం వల్ల కాండం తొలిచే పురుగు గుడ్ల సముదాయాన్ని ప్రాథమిక దశలోనే నివారించవచ్చని తెలిపారు. అలాగే వరుస క్రమంలో నాట్లు వేయడం ద్వారా పంటకు గాలి, వెలుతురు బాగా తగిలి మొక్కలు బలంగా పెరిగి అధిక సంఖ్యలో పిలకలు వస్తాయని వివరించారు. కార్యక్రమంలో ఫీల్డ్ మాస్టర్ ట్రైనర్ చిన్నమ్మి, ఐసిఆర్‌పి వెంకటరావు, వెలుగు ఎన్‌జీఓ కార్యకర్త ఆఫీస్‌తో పాటు స్థానిక రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## జగన్మోహన్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయండి

### వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులకు పేరాడ తిలక్ పిలుపు



**టెక్కలి, జూలై 28, ప్రభాతవార్త :**

మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఈ నెల 30న శ్రీకాకుళం పర్యటనకు వస్తున్న సందర్భంగా ప్రతి ఒక్క వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త పాల్గొని పర్యటనను విజయవంతం చేయాలని టెక్కలి నియోజకవర్గ ఇన్చార్జి పేరాడ తిలక్ పిలుపునిచ్చారు. మంగళవారం టెక్కలి పార్టీ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు పై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించిదన్నారు. అందువల్ల శ్రీకాకుళంలోని అంపోలు జైలులో రిమాండ్‌లో ఉన్న అప్పలరాజుని ఆ రోజు మధ్యాహ్నం 12 గంటలకు ములాఖత్‌లో జగన్ కలుస్తారని తిలక్ వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వ పాలనతో ఇంటింటా సంక్షేమం

### -ప్రజలకు వివరించిన ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్ కూన



**ఆమదాలవలస, జూలై 28, (ప్రభాతవార్త)**

కూటమి ప్రభుత్వ పాలనతోనే ఇంటింటా సంక్షేమం, అభివృద్ధి జరుగుతుందని ఆమదాలవలస ఎమ్మెల్యే, రాష్ట్ర పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ తెలిపారు. పొందూరు మండలం కనిమెట్ట పంచాయతీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన 'రెండేళ్ల నమ్మకం సంక్షేమ విజయాలు ప్రజా పాలన-ఇంటింటికీ అభివృద్ధి' కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పరిపాలన సాగుతోందని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకురావడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.







## బూరగాంలో 'పొలం పిలుస్తోంది'

**కంచిలి, జూలై 28, ప్రభాతవార్త :**

బూరగాం రైతు సేవా కేంద్రం పరిధిలో పొలం పిలుస్తుంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఏవో కొంకేన సురేష్ మాట్లాడుతూ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన గూర్చి వివరిస్తూ ఆగస్టు 15 వరకు గడువుందని, అలాగే పంట రుణం తీసుకోని ప్రతి రైతు ఎకరానికి 160 రూపాయలు చెల్లించి 40 వేల వరకు పంట కోత ప్రయోగాల దిగుబడుల ఆధారంగా నష్టాన్ని అంచనా వేసి పొందవచ్చని సూచించారు.గ్రామ వ్యవసాయ సహాయకులు పవన్, రైతులు పాల్గొన్నారు.




## మత్స్యకారులపై కూటమి కక్ష



**కంచిలి, జూలై 28, ప్రభాతవార్త :**

మత్స్యకారులపై కూటమి ప్రభుత్వం కక్ష గట్టి రాజకీయం చేస్తోందని నియోజకవర్గ వైకాపా నాయకులు ధ్వజమెత్తారు. స్థానిక రాధాకృష్ణ మందిరంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, నియోజకవర్గ ఇన్చార్జ్ సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి, రాష్ట్ర బీసీ సంఘం కార్యదర్శి నర్త నరేంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందన్నారు. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుపై తప్పుడు కేసును నమోదు చేసి నిర్బంధించారన్నారు. కార్యక్రమంలో కంచిలి ఎంపీపీ పైల దేవదాసు రెడ్డి, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు ఉలాల భారతి, ఇప్పిలి కృష్ణారావు, ఇచ్ఛాపురం నియోజకవర్గ యువజన అధ్యక్షులు నర్త ప్రేమ్ కుమార్, తడక జోగారావు, దుర్గాసి ధర్మారావు, గుమ్మడి రామదాస్ తదితరులు పాల్గొన్నారు.









# క్లీన్‌స్వీప్ చేసినా మారని తీరు

## నాలుగు పొరపాట్లతో టీమిండియా




**న్యూఢిల్లీ:** జింబాబ్వేతో జరిగిన టి20 సిరీస్‌ను టీమిండియా 3-0తో క్లీన్‌స్వీప్ చేసి అదరగొట్టింది. అయితే 2028 ప్రపంచకప్ లక్ష్యంగా సాగుతున్న ఈ కీలక ప్రయాణంలో ప్రయోగాలు చేయకపోవడం తీవ్రంగా నిరాశపరిచింది. ఈ పర్యటనలో అత్యంత ప్రతిభావంతుడైన ఫాస్ట్ ఆల్‌రౌండర్ సూర్యాన్ష్ షెడ్జ్‌ను పక్కన పెట్టడం పెద్ద లోపం. కేవలం మూడో మ్యాచ్‌లో మాత్రమే అతనికి అవకాశం దక్కింది. హార్దిక్ పాండ్యాకు తగిన ప్రత్యామ్నాయాన్ని వెతికే ప్రక్రియలో షెడ్జ్ లాంటి యంగ్‌స్టర్‌కు 3 మ్యాచుల్లోనూ ఛాన్స్ ఇవ్వాల్సింది. నితీష్ కుమార్‌కు గాయాలు, శివమ్ దూబె జట్టులో ఇంకా స్థానాన్ని ఖాయం చేసుకోకపోవడంతో షెడ్జ్ అత్యంత కీలకమైన ఆటగాడిగా మారే అవకాశముంది. ముస్తాక్ అలీ ట్రోఫీలో 5 వికెట్లు తీయడంతో పాటు, గత ఐపిఎల్‌లో విలువైన పరుగులు సాధించి తన ప్రతిభను నిరూపించు కున్నాడు. అలాగే శ్రీలంక ఎతో పోరులో అద్భుత ప్రదర్శన ఇచ్చాడు. బలహీనమైన జింబాబ్వేపై వరుస ఛాన్స్ ఇచ్చి ఉంటే అతడి బ్యాటింగ్, బౌలింగ్ నైపుణ్యాలపై స్పష్టత వచ్చేది. ఒకే ఒక్క మ్యాచ్ ఆధారంగా ఈ యువ ఆటగాడి సామర్థ్యాన్ని అంచనా వేయడం ఏమాత్రం సరైన పద్ధతి కాదు. అలాగే బ్యాటింగ్ ఆర్డర్‌ను మార్చడం ఎంతో ముఖ్యం. ఐసిసి టోర్నీల్లో పరిస్థితులకు అనుగుణంగా మారే జట్లే విజయం సాధిస్తాయి. అయితే ఈ సిరీస్‌లో భారత్ పాత పద్ధతిలోనే సాగడం గమనార్హం.

అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ ఓపెనర్లుగా రాగా, మూడో స్థానంలో ఇషాన్ కిషన్, నాలుగో స్థానంలో శ్రేయస్ అయ్యర్ బ్యాటింగ్‌కు వచ్చారు. నిరాశపరిచిన అభిషేక్ శర్మ స్థానంలో తిలక్ వర్మను ఓపెనర్‌గా పంపే ప్రయోగం చేయాల్సింది. ఇక పరుగులు చేయడానికి ఇబ్బంది పడుతున్న శివమ్ దూబేను ఆర్డర్‌లో ముందుకు పంపి క్రీజులో ఎక్కువ సమయం గడిపేలా చేసి ఉంటే అతడికి లయ చిక్కేది. మిడిలార్డర్‌లో రింకూ సింగ్‌ను కేవలం ఫినిషర్‌గానే కాకుండా ఇన్నింగ్స్‌ను నిలబెట్టే యాంకర్‌గా పరీక్షించేందుకు ఇది మంచి సమయం. ఐపిఎల్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు కష్టాల్లో పడినప్పుడు నాలుగో స్థానంలో వచ్చి ఇన్నింగ్స్ నిర్మించిన అనుభవం అతడికి ఉంది. ఈ సిరీస్‌లో అతడిని మూడో స్థానంలో ప్రమోట్ చేసి ఉంటే రింకూలో ఉన్న మరో కోణం బయటపడేది. భవి ష్యత్తులో టాప్ ఆర్డర్ బ్యాటర్లు గాయపడితే రింకూ లాంటి ఆటగాడు ఆ స్థానాన్ని భర్తీ చేయగలడనే నమ్మకం కుదిరేది.

మరోవైపు ఎడమచేతి వాటం స్పిన్నర్ హర్ష్ దూబేకు అరంగేట్రం చేసే అవకాశం దక్కకపోవడం మరో లోపం. రవీంద్ర జడేజా కెరీర్ ముగింపునకు చేరువవుతున్న వేళ సరైన ప్రత్యామ్నాయ స్పిన్నర్ కోసం వెతుకులాట సాగుతోంది. విజయ్ హాజారే ట్రోఫీ, ఐపిఎల్ 2026లో సత్తా చాటిన దూబేను తుది జట్టులోకి తీసుకుని ఉంటే భారత్‌కు మరొక నాణ్యమైన స్పిన్ బౌలర్ అందుబాటులోకి వచ్చేవాడు.




### శ్రీలంక పర్యటనకు..

## భారత్ టెస్ట్ టీమ్ ఖరారు

### జట్టులోకి బుమ్రా, సారాంశ్

**న్యూఢిల్లీ:** ఆగస్టు 15న ప్రారంభమయ్యే శ్రీలంకతో రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ కోసం భారత జట్టును మంగళవారం ప్రకటించారు. శుభ్‌మన్ గిల్ జట్టుకు నాయకత్వం వహించడం కొనసాగిస్తాడు, కేఎల్ రాహుల్ అతనికి డిప్యూటీగా ఉంటాడు. ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రాను జట్టులోకి తీసుకున్నారు, కానీ అతనిభాగస్వామ్యం ఫిట్‌నెస్ క్లియరెన్స్‌పై ఆధారపడిఉంటుంది. స్పిన్ బౌలింగ్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ కండరాల గాయం కారణంగా మొదటి టెస్టుకు దూరమవ్వగా, అతని స్థానంలో భారత జట్టులోకి సారాంశ్ జైన్‌ను తీసుకున్నారు. భారత్ జట్టులో శుభమన్ గిల్ (కెప్టెన్), కెఎల్ రాహుల్ (వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, రిషబ్ పంత్ (వికెట్‌కీపర్), సాయి సుదర్శన్, ధ్రువ్ జురెల్ (వికెట్‌కీపర్), రవీంద్రజడేజా, కుల్దీప్‌యాదవ్, మానవ్ సుతార్, జస్ప్రిత్ బుమ్రా, మొహమ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, గుర్నూర్‌బ్రార్, దేవదత్ పడిక్కల్, సరన్ష్ జైన్ ఉన్నారు.

### వరల్డ్ యూత్ క్లైంబిగ్ ఛాంపియన్..

## రికార్డు నెలకొల్పిన అమీరా



**న్యూఢిల్లీ:** భారతదేశానికి చెందిన 15 ఏళ్ల స్పీడ్ క్లైంబింగ్ ప్రతిభావంతురాలు అమీరా ఖోస్లా, ఇటలీలోని ఆర్కోలో మంగళవారం జరిగిన ఐఎఫ్ఎస్‌సి ప్రపంచ యూత్ క్లైంబింగ్ ఛాంపియన్‌షిప్స్-2026లో కొత్త భారత జాతీయ యూత్ రికార్డును నెలకొల్పి, ప్రపంచంలో ఆరవ స్థానంలో నిలిచి చరిత్ర సృష్టించింది. స్పీడ్ క్లైంబింగ్ ఈవెంట్ ఫైనల్స్‌లో అమీరా 7.60 సెకన్ల అద్భుతమైన సమయాన్ని నమోదు చేసి, తన వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శనను రెండుసార్లు మెరుగుపరుచుకుంది.

అంతకుముందు క్వాలిఫికేషన్ రౌండ్‌లో 7.74 సెకన్లను నమోదు చేసిన ఆమె, ఫైనల్‌లో మరింత వేగవంతమైన ప్రదర్శనను కనబరిచింది. ఆమె సాధించిన విజయం, ప్రపంచ యూత్ ఛాంపియన్‌షిప్‌లలో ఒక భారతీయ అథ్లెట్ సాధించిన అత్యుత్తమ ప్రదర్శనలలో ఒకటిగా నిలిచింది. క్లైంబింగ్‌తో పాటు, అమీరా అథ్లెటిక్స్‌లో కూడా తనదైన ముద్ర వేసింది. ఆమె నేషనల్ స్కూల్ గేమ్స్ 2024లో 100 మీటర్ల పరుగులో రజత పతకం గెలుచుకుంది.

2024 నుండి 2026 వరకు వరుసగా మూడు సంవత్సరాల పాటు 60 మీటర్ల పరుగులో ఢిల్లీ స్టేట్ ఛాంపియన్‌గా నిలిచింది. అలాగే ఈ ఛాంపియన్‌షిప్‌లో భారత జట్టులో శ్లోక్ దాదుకర్, నీల్ వార్కే, రుద్ర కరండికర్ కూడా ఉన్నారు. దాదుకర్ 6.76 సెకన్ల టైమింగ్‌తో 27వ స్థానంలో నిలవగా, వార్కే 7.33 సెకన్ల టైమింగ్‌తో 35వ స్థానాన్ని దక్కించుకున్నారు. కరండికర్ 8.47 సెకన్ల టైమింగ్‌తో 44వ స్థానంతో తన ప్రయాణాన్ని ముగించారు.







### కామన్వెల్త్ గేమ్స్‌లో

## షర్మిలకు స్వర్ణం శిల్పకు కాంస్యం

### అజయ్‌కు రజతం, బింద్యాకు కాంస్యం

**న్యూఢిల్లీ:** కామన్వెల్త్ గేమ్స్ మహిళల ఎఫ్57 షాట్‌పుట్ విభాగంలో షర్మిల, శిల్పలు కలిసి భారతదేశానికి చారిత్రాత్మక డబుల్ పోడియంను అందించారు. ఈవెంట్‌లో షర్మిల భారతదేశానికి మొట్టమొదటి స్వర్ణ పతకాన్ని అందించగా, శిల్ప కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. వీరు ఇద్దరూ కలిసి కామన్వెల్త్ గేమ్స్‌లో పారా అథ్లెటిక్స్ పతకం గెలిచిన తొలి భారతీయ మహిళలుగా నిలిచారు. షర్మిల తన ప్రచారాన్ని 9.48 మీటర్ల త్రోతో ప్రారంభించి, దానిని 9.58 మీటర్లకు మెరుగుపరిచి, ఆపై తన మూడవ ప్రయత్నంలో 9.81 మీటర్ల త్రోతో చివరికి స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది. ఆమె మిగిలిన మూడు ప్రయత్నాలలో 9.17 మీ, 9.37మీ, మరియు 9.60 మీ స్కోరుసాధించి, చాలా సునాయాసంగా స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. అయితే, శిల్ప పోడియంకు చేరుకున్న మార్గం మాత్రం అందుకు పూర్తి భిన్నంగా ఉంది. ఆమె మొదట 7.26 మీటర్ల అత్యుత్తమ ప్రదర్శనతో నాల్గవ స్థానంలో నిలిచింది, కానీ ఈవెంట్ ముగింపులో నైజీరియాకు చెందిన యూకారియా ఇయాజీని అనర్హురాలిగా ప్రకటించిన ఫలితంగా ఆమెకు కాంస్య పతకం లభించింది. వెయిట్‌లిఫ్టింగ్ పురుషుల 79 కేజీల విభాగంలో మలేషియా వెయిట్‌లిఫ్టర్‌తో హోరాహోరీగా తలపడిన అజయ్‌బాబు, చివరకు 330 కేజీల విభాగంలో కేవలం ఒకకిలో తేడాతో రజత పతకంతో సరిపెట్టుకున్నాడు. బింద్యారాణి 199 కిలోల బరువును ఎత్తి, మహిళల 58 కేజీల విభాగంలో కాంస్య పతకాన్ని గెలుచుకుని, వరుసగా తన రెండవ కామన్వెల్త్ గేమ్స్ పతకాన్ని కైవసం చేసుకుంది.

## కామన్వెల్త్‌లో.. సర్వేశ్‌కు రజతం



**న్యూఢిల్లీ:** కామన్వెల్త్ గేమ్స్‌లో భారత అథ్లెటిక్స్ చరిత్రలోనే అత్యంత స్ఫూర్తిదాయకమైన అధ్యాయాలలో ఒకదాన్ని సర్వేశ్ కుషారే లిఖించారు. 31 యేళ్ల కుషారే, ఫైనల్‌లో 2.25 మీటర్ల అత్యుత్తమ ఎత్తును అధిగమించి, కామన్వెల్త్ గేమ్స్ 136 యేళ్ల చరిత్రలో హైజంప్‌లో రజత పతకం గెలుచుకున్న తొలి భారతీయుడిగా నిలిచాడు. పురుషుల హైజంప్ ఫైనల్‌లో పాల్గొన్న ముగ్గురు భారతీయులలో సర్వేశ్ కుషారే ఒకడు. మిగతా ఇద్దరూ పతకాల పోటీ నుండి వైదొలగగా, అతను మాత్రం పోరాటం కొనసాగించి భారతదేశానికి పోడియం స్థానాన్ని సాధించిపెట్టాడు. హై జంప్‌లో కుషారే తన మొదటి ప్రయత్నంలోనే 2.20 మీటర్లతో సహా తన మొదటి నాలుగు ఎత్తులను అధిగమించి, బలమైన ఆరంభాన్ని ఇచ్చాడు. అయితే, 2.25 మీటర్ల వద్ద తన మొదటి రెండు ప్రయత్నాలలో విఫలమవడంతో అతను అకస్మాత్తుగా అగ్రస్థానం నుండి వెనుకబడ్డాడు. కానీ తన మూడవ ప్రయత్నంలో తీవ్రంగా పోరాడి, బార్‌ను అధిగమించి, భారతదేశానికి పతకాన్ని ఖాయం చేశాడు. జమైకాకు చెందిన స్వర్ణ పతక విజేత రొమైన్ బెక్‌ఫోర్డ్ లాగే, అతను 2.28 మీటర్ల వద్ద చేసిన మూడు ప్రయత్నాలలోనూ విఫలమైన ప్పటికీ, కౌంట్‌బ్యాక్ ఆధారంగా అప్పటికే రజత పతకాన్ని ఖాయం చేసుకున్నాడు. టోక్యోలో జరిగిన 2025 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లలో 2.28 మీటర్ల కొత్త వ్యక్తిగత అత్యుత్తమ రికార్డును నెలకొల్పాడు. ఆ ప్రదర్శన అతనికి ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లలో చారిత్రాత్మకమైన టాప్‌సిక్స్ స్థానాన్ని సంపాదించి పెట్టింది.

## జూన్ పారిశ్రామిక ఉత్పత్తి సూచీ 7.3% వృద్ధి



**ముంబయి,జులై 28:** దేశ పారిశ్రామిక రంగం జూన్ నెలలో గణనీయమైన పురోగతిని నమోదు చేసింది. తయారీ రంగం, మూలధన వస్తువులు (క్యాపిటల్ గూడ్స్), మౌలిక సదుపాయాల ఉత్పత్తి బలంగా పెరగడంతో పారిశ్రామిక ఉత్పత్తి సూచీ వార్షిక ప్రాతిపదికన 7.3 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇది గత 23 నెలల్లో అత్యధిక వృద్ధి రేటు కావడం విశేషం.మే నెలలో సవరించిన గణాంకాల ప్రకారం నమోదైన 5.1 శాతం వృద్ధితో పోలిస్తే జూన్‌లో పారిశ్రామిక ఉత్పత్తి గణనీయంగా పుంజుకుంది. మార్కెట్ అంచనాలు 6 శాతం ఉండగా, వాటిని అధిగమిస్తూ 7.3 శాతం వృద్ధి నమోదైంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అనిశ్చిత పరిస్థితులు కొనసాగుతున్నప్పటికీ దేశీయ పారిశ్రామిక కార్యకలాపాలు బలంగా కొనసాగుతున్నాయని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. ఐఐపిలో అత్యధిక వాటా కలిగిన తయారీ రంగం జూన్‌లో 7.8 శాతం వృద్ధిని నమోదు చేసి మొత్తం పారిశ్రామిక ఉత్పత్తికి ప్రధాన బలంగా నిలిచింది. దేశీయ డిమాండ్ బలంగా కొనసాగడం, కీలక పరిశ్రమల్లో ఉత్పత్తి పెరగడం ఈ వృద్ధికి దోహదపడింది. విద్యుత్, గ్యాస్ ఉత్పత్తి 10.6 శాతం పెరిగింది. పారిశ్రామిక కార్యకలాపాలు విస్తరించడంతో పాటు ఇంధన అవసరాలు పెరగడమే ఇందుకు కారణం. గనుల రంగం మాత్రం స్వల్పంగా 1 శాతం వృద్ధిని మాత్రమే నమోదు చేసింది. క్యాపిటల్ గూడ్స్ ఉత్పత్తి 14.2 శాతం పెరిగి అత్యంత వేగవంతమైన వృద్ధిని నమోదు చేసింది. పెట్టుబడులు, ఉత్పత్తి సామర్థ్య విస్తరణపై పరిశ్రమలు ఇప్పటికీ విశ్వాసంతో ముందుకు సాగుతున్నట్లు ఇది సూచిస్తోంది.మౌలిక సదుపాయాలు, నిర్మాణ రంగానికి సంబంధించిన వస్తువుల ఉత్పత్తి 7.5 శాతం పెరిగింది. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలమౌలిక సదుపాయాల ప్రాజెక్టులు వేగంగా కొనసాగుతున్నట్లు ఈ గణాంకాలు తెలియజేస్తున్నాయి. వినియోగదారుల మన్నికైన వస్తువుల ఉత్పత్తి 7.7 శాతం పెరగడం ద్వారా గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ ఉత్పత్తులపై వినియోగదారుల డిమాండ్ బలంగా కొనసాగుతోందని స్పష్టమైంది. ఇక నీటి సరఫరా, అనుబంధ సేవలు కూడా జూన్ నెలలో 6.1 శాతం వృద్ధిని నమోదు చేశాయి.

# ఐటిషేర్ల అండతో ఈక్విటీ నష్టాల కట్టడి




## స్వల్ప నష్టాలతోముగిసిన సెన్సెక్స్,నిఫ్టీ

**ముంబయి,జులై 28:** దేశీయ ఈక్విటీ మార్కెట్లు మంగళవారం రోజంతా పరిమిత శ్రేణిలో ట్రేడింగ్ అనంతరం స్వల్ప నష్టాలతో ముగిశాయి. ఐటీ షేర్లలో నమోదైన బలమైన కొనుగోళ్లు మార్కెట్లకు మద్దతు ఇవ్వగా, ఎఫ్ఎంసీజీ, కెమికల్స్, ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి సూచీలపై ప్రభావం చూపింది. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు తగ్గడం సానుకూలంగా మారినా, అమెరికా ఫెడరల్ రిజర్వ్ ద్రవ్య విధాన నిర్ణయానికి ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. బిఎస్ఇ సెన్సెక్స్ 69.86 పాయింట్లు తగ్గి 76,765.92 వద్ద ముగియగా, ఎన్ఎస్ఇ నిఫ్టీ 10.60 పాయింట్లు కోల్పోయి 23,985.35 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సూచీలో హిందుస్థాన్ యూనిలీవర్ 7.11 శాతం, ఐసిఐసిఐ బ్యాంక్ 1.94 శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 0.65 శాతం క్షీణించి సూచీలను దిగజార్చాయి.విస్తృత మార్కెట్లలో మాత్రం మిశ్రమ ధోరణి కనిపించింది. బిఎస్ఇ 150 మిడ్‌క్యాప్ సూచీ స్వల్పంగా 0.01 శాతం పెరగగా, బిఎస్ఇ 250 స్మాల్‌క్యాప్ సూచీ 0.47 శాతం తగ్గింది. మొత్తం ట్రేడైన షేర్లలో 1,528 షేర్లు లాభపడగా, 2,740 షేర్లు నష్టపోయాయి. 169 షేర్లలో ఎలాంటి మార్పు నమోదు కాలేదు. ఐటీ రంగంలో భారీ ర్యాలీమంగళవారం ట్రేడింగ్‌లో ఐటీ రంగం మార్కెట్‌కు ప్రధాన బలంగా నిలిచింది. నిఫ్టీ ఐటీ సూచీ 3.32 శాతం ఎగసి 30,418.35 వద్ద ముగిసింది. వరుసగా మూడు ట్రేడింగ్ సెషన్లలో ఈ సూచీ మొత్తం 6.61 శాతం లాభపడింది. ఐటీ కంపెనీల్లో కోఫోర్జ్ 10.16 శాతం ఎగిసి అగ్రస్థానంలో నిలవగా, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) 4.46 శాతం, ఎంఫాసిస్ 3.57 శాతం, టెక్ మహీంద్రా 3.49 శాతం, పర్సిస్టెంట్ సిస్టమ్స్ 3.22 శాతం, ఎల్‌టిఐ మైండ్‌ట్రీ 2.82 శాతం, ఇన్ఫోసిస్ 2.39 శాతం, ఒరాకిల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సాఫ్ట్‌వేర్ (ఒఎఫ్ఎస్ఎస్) 2.08 శాతం, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ 1.93 శాతం, విప్రో 1.41 శాతం చొప్పున లాభపడ్డాయి. త్రైమాసిక ఆర్థిక ఫలితాల ప్రభావంతో పలు కంపెనీల షేర్లలో భారీ ఒత్తిడి కనిపించింది. వరుణ్ బేవరేజెస్ త్రైమాసిక ఫలితాల అనంతరం 7.53 శాతం క్షీణించింది. హిందుస్థాన్ యూనిలీవర్ సమీకృత నికర లాభం ఏడాది ప్రాతిపదికన 3.01 శాతం తగ్గి రూ.2,673 కోట్లకు చేరడంతో షేరు 7.11 శాతం పడిపోయింది. ఇండోకో రెమెడీస్ తొలి త్రైమాసికంలో రూ.64.99 కోట్ల లాభం నమోదు చేసినప్పటికీ షేరు 7.72 శాతం క్షీణించింది. టాటా కెమికల్స్ త్రైమాసికంలో రూ.17 కోట్ల సమీకృత నికర నష్టం ప్రకటించడంతో షేరు 3.73 శాతం పడింది.తేజస్ నెట్‌వర్క్స్ రూ.202.24 కోట్ల నికర నష్టం నమోదు చేయడంతో 3.84 శాతం బలహీనపడింది. తిలక్‌నగర్ ఇండస్ట్రీస్ సమీకృత నికర లాభం 64.30 శాతం తగ్గి రూ.31.59 కోట్లకు చేరినా షేరు స్వల్పంగా 0.10 శాతం పెరిగింది.గాడ్‌ఫ్రే ఫిలిప్స్ ఇండియా నికర లాభం 44.3 శాతం తగ్గడంతో షేరు7.80 శాతం క్షీణించింది. ఔరియన్‌ప్రో సొల్యూషన్స్ సమీకృత నికర లాభం 10.62 శాతం తగ్గడంతో 11.79 శాతం పతనమైంది.

ఇండస్ టవర్స్ 1.73 శాతం నష్టపోయింది.ఆర్ఆర్ కేబుల్ 2.36 శాతం లాభపడింది.ఓం ఇన్‌ఫ్రా ఛత్తీస్‌గఢ్ జలవనరుల శాఖ చేపట్టిన కీలక మౌలిక వసతుల ప్రాజెక్టుకు అత్యల్ప బిడ్డర్‌గా ఎంపిక కావడంతో షేరు 4.78 శాతం పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్లో సెప్టెంబర్ 2026 డెలివరీకి సంబంధించిన బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 1.93 డాలర్లు తగ్గి 86.43 డాలర్లకు చేరింది. దేశీయ విదేశీ మారక మార్కెట్లో రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే 95.8875 వద్ద ట్రేడవగా, గత ముగింపు 95.9900గా నమోదైంది. ఎంసీఎక్స్‌లో ఆగస్టు 5,2026 డెలివరీకి సంబంధించిన బంగారం ఫ్యూచర్స్ ధర 1.17 శాతం తగ్గి 10 గ్రాములకు రూ.1,41,395 వద్ద ట్రేడైంది.

## ఎయిరిండియా, ఎక్స్‌ప్రెస్‌ల నికర నష్టం రూ.22,238 కోట్లు




**ముంబయి,జులై 28:** టాటా గ్రూప్ యాజమాన్యంలోని ఎయిరిండియా, దాని అనుబంధ సంస్థ ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌లు 2026 ఆర్థిక సంవత్సరంలో భారీ నష్టాలను ప్రకటించాయి. ఈ రెండు సంస్థల సంయుక్త నికర నష్టం రూ. 22,238 కోట్లుగా నమోదైంది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో నమోదైన రూ. 10,859 కోట్ల నష్టంతో పోలిస్తే ఇది రెట్టింపు కంటే ఎక్కువ. ఇదే సమయంలో సంస్థల సంయుక్త ఆదాయం కూడా దాదాపు 9 శాతం తగ్గి రూ. 71,870 కోట్లకు పరిమితమైంది. ఎయిరిండియా రూ. 15,368 కోట్ల నికర నష్టాన్ని నమోదు చేయగా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ రూ. 6,767 కోట్ల నష్టాన్ని చవిచూసింది. ప్రస్తుతం ఎయిరిండియాలో టాటా సన్స్‌కు 73.82 శాతం, సింగపూర్ ఎయిర్‌లైన్స్‌కు 25.1 శాతం వాటా ఉంది. ఈ ఫలితాలపై వాటాదారులను ఉద్దేశించి ఎయిరిండియా ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ మాట్లాడుతూ సంస్థ పునరుద్ధరణను ఒక దీర్ఘకాలిక ప్రక్రియగా చూడాలని సూచించారు. చరిత్రలో ఏ గొప్ప విమానయాన సంస్థ అయినా దశాబ్దాల కాలంలో నిర్మితమైందనీ, అంతేకానీ కొన్ని త్రైమాసికాల్లో కాదని ఆయన స్పష్టం చేశారు. సంస్థను కొనుగోలుచేసిననాటి పరిస్థితి, విడిభాగాల సరఫరాలో అంతరాయాలు, పాత వ్యవస్థల ఆధునికీకరణ వంటి సవాళ్లను అధిగమించేందుకు 5 నుంచి 10 యేళ్ల సమయం పడుతుందని వివరించారు. ఛైర్మన్ వ్యాఖ్యలను బట్టి చూస్తే, 2022లో ప్రభుత్వం నుంచి కొనుగోలు చేసిన ఈ జాతీయ విమానయాన సంస్థను గాడిన పెట్టేందుకు టాటా గ్రూప్ తొలుత అంచనావేసిన దానికంటే ఎక్కువసమయం, పెట్టుబడులు అవసరమవుతాయని స్పష్టమవుతోంది. పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఆరు పాత ఎయిర్‌బస్ ఏ319 విమానాలను విక్రయించేందుకు ఎయిరిండియా ఇటీవలే యూకేకు చెందిన స్కైటెక్ ఎవిసి సంస్థను నియమించుకుంది.

## ఇండిగో సిఇఒగా విల్లీ వాల్ష్‌కు కేంద్రం ఓకే




**న్యూఢిల్లీ,జులై 28:** దేశీయ అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో కొత్త సిఇఒగా విల్లీ వాల్ష్ నియామకానికి కేంద్ర ప్రభుత్వం మంగళవారం భద్రతా అనుమతి మంజూరు చేసింది. అంతర్జాతీయ వైమానిక రవాణా సంఘం డైరెక్టర్ జనరల్‌గా ఆయన పదవీకాలం ఈనెల 31తో ముగియనుండగా, ఆగస్టు 3లోగా ఇండిగోలో చేరనున్నట్లు సమాచారం. మార్చిలో అప్పటి సిఇఒ పీటర్‌ఎల్బర్స్ ఆకస్మికంగా వైదొలిగిన తర్వాత సంస్థ కొత్త నాయకత్వం కోసం ఎదురు చూస్తోంది. సిఇఒగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఇండిగో కార్యకలాపాల నిర్వహణతో పాటు సంస్థ దీర్ఘకాలిక వ్యూహాల రూపకల్పనలో విల్లీ వాల్ష్ కీలక పాత్ర పోషించనున్నారు. విలియం విల్లీ వాల్ష్ 1961 అక్టోబర్ 25న ఐర్లాండ్‌రాజధాని డబ్లిన్‌లో జన్మించారు.1979లో ఐరిష్ విమానయాన సంస్థ ఏర్ లింగస్‌లో క్యాడెట్ పైలట్‌గా తన కెరీర్‌ను ప్రారంభించారు. అనంతరం బోయింగ్737 విమాన కెప్టెన్‌గా పనిచేస్తూనే ట్రినిటీ కాలేజ్ డబ్లిన్‌లో బిజినెస్ అడ్మినిస్ట్రే షన్‌లో మాస్టర్స్ పూర్తి చేశారు.1990ల చివర్లో నిర్వహణ విభాగంలోకి అడుగుపెట్టిన ఆయన, 2000లో ఏర్ లింగస్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా, 2001లో సిఇఒగా నియమితులయ్యారు. 2005లో బ్రిటిష్ ఎయిర్‌వేస్ సిఇఒగా బాధ్యతలు స్వీకరించిన విల్లీ వాల్ష్ సంస్థను సమర్థంగానడిపించారు. 2011లో బ్రిటిష్ ఎయిర్‌వేస్, ఐబీరియా విలీనానికి ఆయన నాయకత్వం వహించారు. 2021 ఏప్రిల్ నుంచి అంతర్జాతీయ వైమానిక రవాణా సంఘం ఎనిమిదో డైరెక్టర్ జనరల్‌గా పనిచేస్తున్న విల్లీ వాల్ష్, విమాన భద్రత, నియంత్రణ విధానాలు, పర్యావరణ పరిరక్షణ, పరిశ్రమ వ్యయ నియంత్రణ వంటి అంశాల్లో ప్రపంచవ్యాప్తంగా విమానయాన సంస్థలకు ప్రాతినిధ్యం వహించారు.

2005 నుంచి 2018వరకు ఐఎటిఎ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్‌లో సభ్యుడిగా, ఒక దశలో ఛైర్మన్‌గా కూడా సేవలందించారు. భారతీయ దేశీయ విమానయాన మార్కెట్లో సుమారు 64 శాతం మార్కెట్ వాటాతో ఇండిగో అగ్రస్థానంలో ఉంది. సంస్థ రోజుకు 2,200కు పైగా విమాన సర్వీసులు నిర్వహిస్తూ 95 దేశీయ, 40కిపైగా అంతర్జాతీయ గమ్యస్థానాలకు సేవలు అందిస్తోంది. సుమారు 440 విమానాల ఫ్లీట్‌ను నిర్వహిస్తున్న ఇండిగో, అంతర్జాతీయ విస్తరణపై దృష్టి సారించిన నేపథ్యంలో విల్లీ వాల్ష్‌కు ఉన్న ప్రపంచ స్థాయి నిర్వహణ అనుభవం సంస్థ తదుపరి వృద్ధి దశకు బలాన్నిస్తుందని విమానయాన రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## అంచనాలను మించిన ఎల్ అండ్ టి నికరలాభం

**ముంబయి,జులై 28:** ఇంజినీరింగ్, నిర్మాణ రంగ దిగ్గజం లార్సెన్ అండ్ టుబ్రో (ఎల్అండ్‌టి) 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో అంచనాలకు మించిన ఆర్థిక ఫలితాలను నమోదు చేసింది. కంపెనీ నికర లాభం వార్షిక ప్రాతిపదికన 14 శాతం పెరిగి రూ.4,123 కోట్లకు చేరుకుంది. గత యేడాది ఇదే కాలంలో కంపెనీ లాభం రూ.3,617 కోట్లు. మార్కెట్ విశ్లేషకులు రూ.3,985 కోట్ల లాభాన్ని అంచనా వేయగా, కంపెనీ ఆ అంచనాలను అధిగమించింది. కంపెనీ మొత్తం ఆదాయం 6.7 శాతం పెరిగి రూ.67,942 కోట్లకు చేరుకుంది. గత యేడాది ఇదే త్రైమాసికంలో ఇది రూ.63,679 కోట్లు. మార్కెట్ నిపుణులు రూ.67,545 కోట్ల ఆదాయాన్ని అంచనా వేయగా, ఎల్అండ్‌టీ ఆ అంచనాలను కూడా మించింది. వడ్డీ, పన్నులు, తరుగుదల, అమార్టైజేషన్‌కు ముందు లాభం అంటే ఎబిడిటా మాత్రం 3.2 శాతం తగ్గి రూ.6,117 కోట్లకు పరిమితమైంది. గత యేడాది ఇదే కాలంలో ఎబిడిటా రూ.6,318 కోట్లు కాగా, విశ్లేషకుల అంచనా రూ.6,535 కోట్లు. దీంతో కంపెనీ నిర్వహణ లాభదాయకతపై కొంత ఒత్తిడి కనిపించింది.కంపెనీ ఎబిడిటా మార్జిన్ కూడా గత యేడాది 9.9 శాతం నుంచి 9 శాతానికి పడిపోయింది. ఇది 90 బేసిస్ పాయింట్ల క్షీణతగా నమోదైంది. మార్కెట్ అంచనా 9.7 శాతం కాగా, వాస్తవ ఫలితం దానికంటే తక్కువగా ఉంది. ఆర్థిక ఫలితాల ప్రకటనకు ముందు ఎన్ఎస్ఇలో ఎల్అండ్‌టి షేరు ధర 0.63 శాతం పెరిగి రూ.3,830 వద్ద ముగిసింది. అదే సమయంలో ప్రామాణిక సూచీ నిఫ్టీ స్వల్ప నష్టంతో ముగిసింది. దీంతో కంపెనీ ఫలితాలపై పెట్టుబడిదారులు సానుకూలంగా స్పందించినట్లు మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942–271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.